ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
1-6-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 120 పేజీలు: 10+4 వెల: 8.00

దేశభద్రతకు కవచంగా నిలిచిన నారీశక్తి: ప్రధాని 5లో

వందపైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి

# పింఛన్ల వరద


శనివారం చెయ్యేరులో పేదల సేవ కార్యక్రమంలో నప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

### యేడాదికి రూ.34 వేల కోట్లు పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం మనదే

### ఈనెలలోనే అన్నదాత, తల్లికి వందనం

### గత పాలకులు స్కీములతో స్కాములు

### చెయ్యేరు 'పేదల సేవ'లో సిఎం చంద్రబాబు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మే 31 ప్రభాతవార్త:** అధికారం చేపట్టిన 11 నెలల్లోనే కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలకు సంక్షేమం అందిస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దేశంలోనే ఏడాదికి రూ.34 వేల కోట్లు పింఛన్లకు ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే అని, భగవంతుడు కనికరిస్తే భవిష్యత్‌లో పెన్షన్లు పెంచుతామని చెప్పారు. అవినీతి లేని వ్యవస్థకు శ్రీకారం చుట్టామన్నారు. గత పాలకులు స్కీముల పేరుతో స్కాములు చేశారని, రాజకీయ ముసుగులో నేరాలుఘో రాలకు పాల్పడ్డారని అన్నారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. తప్పు చేసే వారిని చండశాసనుడిలా వెంటాడుతానని అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం చెయ్యేరులో పేదల సేవలో కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ శ్రామి కులు రత్నమ్మ, మరియమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పింఛన్లు అందజేశారు. అనంతరం ప్రజావేదిక బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

**పింఛన్లతో పేదల కళ్లలో ఆనందం:** మనది పేదల కోసం పనిచేసే ప్రభుత్వం. మన దేశంలో పింఛన్లు ప్రతి నెలా 64 లక్షల మందికి ఇస్తున్నాం. 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందించాం. గత ప్రభుత్వంలో ముక్కుతూ మూలుగుతూ పింఛన్లు ఇచ్చారు. రూ.200 పింఛన్ని రూ.2 వేలు చేసింది మన ప్రభుత్వమే. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రూ.3,000 పింఛను రూ 4000 వేలు చేశాను. డయాలసిస్ రోగులకు రూ.10 వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమ్యైన వారికి రూ.15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్టే పింఛన్లూ అంది స్తున్నాము. భగవంతుడు కనికరిస్తే భవిష్యత్‌లో పెన్షన్లు పెంచుతాం. భర్త చనిపోతే భార్యకు పెన్షన్ ఇచ్చే కార్యక్ర మానికి శ్రీకారం. గత ప్రభుత్వంలో భర్త చనిపోతే భార్యకు వితంతు పింఛను ఇవ్వలేదు. నేడు 71,380 మందికి రూ.4 వేలు అందించాము. భర్త చనిపోయిన వారు అనాథగా మిగిలిపోకూడదని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అలాగే ఈ నెలలో 2 నెలల పింఛను కలిపి తీసుకునే లబ్ధిదారులు 1,22,975 మంది ఉండగా, 3 నెలల పింఛను కలిపి తీసుకునేవారు 9176మంది ఉన్నారు. వీరికి రూ.111.41 కోట్లను విడుదల చేశాము. మనకంటే ధనిక రాష్ట్రాలున్నాయి. వారికి ఆదాయమూ ఎక్కువ వస్తోంది. కానీ వారికంటే మనమే ఎక్కువ పింఛను ఇస్తున్నాం. మహారాష్ట్రకు దేశంలోనే అన్ని రాష్ట్రాలకంటే ఎక్కువ ఆదాయం వస్తున్నప్పటికీ వారు పింఛను కింద ఇచ్చేది రూ.1000 మాత్రమే. తెలంగాణలో రూ.2,500 ఇస్తున్నారు. ప్రతి ఇంటికీ పెద్ద కొడుకుగా ఉంటానని నేను చెప్పిన మాట నిలబెట్టుకున్నాను. ఏడాదిలో 100 రోజులు కష్టపడితే రూ.30వేలు వస్తాయి. నేను నెలకు రూ.4వేలు లెక్కన 12నెలల్లో రూ.48వేలు >>2

# 'మిస్ వరల్డ్' థాయ్ సుందరి


శనివారం హైదరాబాద్‌లో జరిగిన మిస్‌వరల్డ్ పోటీలో విజేత థాయ్‌లాండ్ సుందరి

### 2025 నప్రపంచసుందరి కిరీటాన్ని ధరించిన ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ

### రన్నరప్-1: మిస్ ఇథియోపియా, 2: మిస్ పోలండ్, 3: మిస్ మార్టినిక్

### టాప్ 8 నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఎలిమినేట్

### హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో అట్టహాసంగా వేడుకలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే31:** హైదరాబాద్ వేదికగా సాగిన 72వ మిస్ వరల్డ్ పోటీల్లో థాయిలాండ్(ఆసియా ఖండం) సుందరి ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ ప్రపంచ సుందరి కిరీటాన్ని దక్కించు కున్నారు. మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా 72వ ప్రపంచ సుందరికి కిరీటాన్ని >>2

# కాలేజి ప్రిన్సిపాల్ కిడ్నాప్?

### ధ్రువీకరించని పోలీసులు

### ఫిర్యాదు రాలేదని వెల్లడి

**విజయవాడ క్రైం,మే 31,ప్రభాతవార్త:** విజయవాడ నగరంలో ఓ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ కిడ్నాప్ అయినట్లు వదంతులు షికారు చేస్తున్నాయి. అయితే దీనిని సంబంధిత పోలీసు అధికారులెవ్వరూ ధృవీకరించడం లేదు. విజయవాడ సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక పేరెన్నిక గన్న కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేస్తున్నట్లు సమాచారం. ఆయనను బందరు రోడ్డు లోని ఓ మాల్ వద్ద కిడ్నాప్ చేసినట్లు ప్రచార మాధ్యమాల్లో వెల్లడవడంతో ఈ విషయం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే దీనిపై ఇప్పటి వరకు నగరంలోని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఏ విధమైన ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని పోలీసు అధికారులు వెల్లడించడం గమనార్హం. దీనిపై సదరు ప్రిన్సిపాల్ కుటుంబ సభ్యు లు కూడా ఇంత వరకు ఏ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించకపోవడంతో ఈ కిడ్నాప్ కలకలం మిస్టరీగానే కొనసాగు తోంది. అయితే ఈయనను కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో కిడ్నాప్ చేసారని వదంతులు వినవస్తున్నప్పటికీ సంబంధిత సిఐని వివరణ కోరగా అదేంలేదని >>2

# మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం

**విజయవాడ,మే31.ప్రభాతవార్తప్రతినిధి:** మధ్యాహ్న భోజనం పథకం అమలవుతున్న ప్రభుత్వ స్కూళ్లకు జూన్ నుంచి సన్నబియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో పౌరసరఫరాల శాఖ ద్వారా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి డీలరుకు అక్కడి నుంచి స్కూళ్లకు బియ్యం తరలించేవారు. ఈ క్రమంలో డీలర్లు స్కూళ్లకు సక్రమంగా బియ్యం ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడేవారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం డీలర్ల అక్రమాలకు కళ్లెం వేసేందుకు బియ్యం సరఫరాలో ఎక్కడా వారి ప్రమేయం లేకుండా చేసింది. నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి పాఠశాలలు, వసతి గృహాలకు బియ్యం తరలించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో చాలాచోట్ల అన్నం ముద్దగా ఉండి, అధ్వానంగా ఉండేది. దీంతో చాలామంది విద్యార్థులు తినకుండా పడేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదిలోపే సర్కారు బడులకు సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తాజాగా జూన్ నుంచి సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నిర్ణయంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే గత ఖరీఫ్‌లో 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశారు. ధాన్యం మిల్లులో ఆడించగా 9 వేల 321 మెట్రిక్ టన్నులు బియ్యం తయారైంది. ఈ ప్రక్రియలో అక్రమాలకు తావు లేకుండా క్యూఆర్ కోడ్ ఉన్న ట్యాగుతో 25 కేజీల సంచులను సిద్ధం చేశారు. ఇదే విధంగా పలు జిల్లాల్లో అధికారులు ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది.

**స్కూళ్లు ప్రారంభించే లోపు సన్నబియ్యం సరఫరా:** ప్రభుత్వ స్కూళ్లు, వసతి



### ప్రభుత్వ స్కూళ్లకు సరఫరా చేయాలని సర్కార్ నిర్ణయం

### నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సరఫరా

గృహాల వివరాలు సేకరిస్తున్నామని, జూన్ నుంచే ప్రభుత్వ పాఠశాలలకు సన్న బియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అనంతపురం జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ రమేశ్‌రెడ్డి తెలిపారు. డీలర్ల ద్వారా కాకుండా నేరుగా స్కూళ్లకు, వసతి గృహాలకు సరఫరా చేస్తామని అన్నారు. 9,321 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సిద్ధంగా ఉంచామని, పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా బియ్యం తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, వసతి గృహాల వివరాలు సేకరిస్తున్నామని, జూన్ నుంచే ప్రభుత్వ పాఠశాలలకు సన్న బియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అనంతపురం జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ రమేశ్‌రెడ్డి తెలిపారు. డీలర్ల ద్వారా కాకుండా నేరుగా స్కూళ్లకు, వసతి గృహాలకు సరఫరా చేస్తామని అన్నారు. 9,321 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సిద్ధంగా ఉంచామని, పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా బియ్యం తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రేషన్ దుకాణల ద్వారా సరుకుల పంపిణీ చేపడుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విజయవాడలో మంత్రి నాదెండ్ల మనోహర్ కలెక్టర్లు, జిల్లా సరఫరా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీకి సిద్ధం కావాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా రేషన్ డీలర్లు పని చేయాలని కోరారు. గతంలో కార్డుదారుల కుటుంబాలకు కుటుంబ పెద్దలా ఉన్న రేషన్ డీలర్లు అదేవిధంగా ఇప్పుడు కూడా మనసు పెట్టి పనిచేసి కార్డుదారులకు గౌరవంగా సేవలందించాలన్నారు. రేషన్ దుకాణాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడటం, సరైన కొలతలతో సరుకులు పంపిణీ చేయడం, ధరలు, స్టాక్ బోర్డు, పోస్టర్లు ఏర్పా టు చేయాలన్నారు. ప్రతి దుకాణదారుడు విధిగా వారికి కేటాయించిన, బరువు స్కేల్ మిషన్ పనితీరును పరిశీలించుకోవాలన్నారు.

**ఆదివారాల్లోనూ:** దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటివద్దే రేషన్ >>2


శనివారం లాసెట్ వివరాలను వెల్లడిస్తున్న పద్మావతి మహిళా వర్సిటీ విసి ఉమ తదితరులు

# 5న లాసెట్

### 133 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు: వి.సి ఉమ

**తిరుపతి,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 5వతేదీ గురువారం లాసెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ తెలిపారు. ఈ ఏడాది మూడు సంవత్సరాలు, ఐదు సంవత్సరాల ఎల్ఎల్‌బి కోర్సుల్లో ప్రవేశాలకు 27,253 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 133 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లాసెట్ 2025 దరఖాస్తులు స్వీకరణ, హాల్‌టిక్కెట్లు పంపిణీ, అభ్యర్థులకు ప్రశ్నాపత్రాలు తదితర సామాగ్రి అన్ని కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. జూన్ 5వతేదీ జరిగే లాసెట్ ప్రవేశపరీక్ష ఏర్పాట్లపై లాసెట్ కన్వీనర్ ఆచార్య >>2

# ఇక 15 రోజులు రేషన్ పంపిణి

### రెండుపూటలా అందుబాటులో

### చౌకడిపోలు: డి.సిఎం పవన్

**విజయవాడ,మే 31,ప్రభాతవార్త ప్రతినిధి:** చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నామని, ఇకపై నెలలో 15 రోజుల పాటు రెండు పూటల అందచేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరకుల చౌక ధరల దుకాణాలు గత జగన్ ప్రభుత్వంలో మూసేసి, ఇంటింటికి అందిస్తామంటూ గొప్పలు చెప్పారని, ఆచరించలేదని మండిపడ్డారు. రూ.1600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేసి, ఇంటింటికీ ఇవ్వ డం మానేసి నెలలో 1-2రోజులు మాత్రమే జంక్షన్‌లలో వాహనంనిలిపి ఇచ్చారని చెప్పారు. ఎంతో మంది పేదలకు ఆ సరుకులు అందక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకొని, చిరుద్యోగాలకు సెలవు పెట్టుకోవాల్సి వచ్చేదని వెల్లడించారు. మిగిలిన రేషన్ బియ్యం, సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పూర్తి స్థాయిలో విచారణ జరిపిందని తెలిపారు. వేలాది టన్నుల అక్రమబియ్యాన్ని తమ ప్రభుత్వం కాకినాడ, విశాఖపట్నం పోర్టుల్లో >>2

# రూ. వెయ్యి కోట్లతో 'అడవితల్లి బాట'

### మారుమూల ఆవాసాలకు మౌలిక సౌకర్యాలు

### అల్లూరి జిల్లాలో రూ.87లక్షలతో రహదారి నిర్మాణం: డిసిఎం పవన్



**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** అడవితల్లి బాట కార్యక్రమాన్ని రూ.వెయ్యి కోట్లతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టిందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం జన్ మాన్ పథకంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో లక్కవరం నుంచి చీడిగొంద వరకూ రూ.87.19 లక్షల వ్యయంతో 1.01 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తి చేసినట్లు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణం వల్ల సమీప ప్రాంతాల్లోని గిరిజనుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. సమ్మిళిత వృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్‌డిఎ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మారుమూల ఆవాసాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. కేంద్రం సహకారంతో మనం ఎన్నో సాధిద్దామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం విషయానికి వస్తే పి.ఎం. - జన్ మన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.555.61 కోట్ల నిధులతో 612.72 కి.మీ. మేర రహదారులు నిర్మిస్తున్నాము. ఇవన్నీ పి.వి.టి.జి. ఆవాసాలను అనుసంధానించే రహదారులే. వీటి ద్వారా ఏడు జిల్లాల్లో 239 పి.వి.టి.జి. ఆవాసాలకు రహదారులు ఏర్పరచగలుగుతున్నాము. ఓట్ల కోసం చూస్తే 239 ఆవాసాలకు రహదారులు మూలంగా సుమారు 50 వేల మందికి రోడ్డు సౌకర్యం వస్తుంది. వారు మనకు ఓట్లు వేస్తారా లేదా అనే ఆలోచన ఎక్కడా చేయలేదు మన ప్రధాన మంత్రి. అదే మొత్తాన్ని ఓట్లు వస్తాయి అనే చోట వెచ్చించవచ్చు. ప్రతి ఒక్కరికీ, అన్ని ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు అందాలి అనే ఉద్దేశంతో మోడీ ముందడుగు వేస్తున్నారు. ఆ స్ఫూర్తితోనే ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు ముందుకు వెళ్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర క్యాబినెట్ ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలియచేసింది. రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. అధికారికి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ మూడు నెలల పాటు రాష్ట్రంలో పర్యటించి రూపొందించిన నివేదికను అనుసరించి ఎస్సీ వర్గీకరణ చేపట్టాము. ఆపరేషన్ సిందూర్, అందుకు దారి తీసిన పరిస్థితులు చాలా క్లిష్టమైనవి. ఇటువంటి దశలో కూడా ప్రజల రక్షణతోపాటు వారి భవిష్యత్తు కోసం ప్రధానమంత్రి ఆలోచన చేశారు. >>2

# అమరావతిలో క్వాంటం వ్యాలీ టెక్నాలజీ పార్కుకు ఆమోదం

### మూడు సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం

### రూ.33వేల కోట్ల ఇంజినీరింగ్ పనులకు గ్రీన్‌సిగ్నల్

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీ టెక్నాలజీ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో చేసుకున్న ఎంఓయూను ర్యాటిఫై చేస్తూ ఐటీశాఖ ఉత్తర్వులు జారీఅగ్రశ్రేణి ఐటీ సంస్థలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), లార్సన్ అండ్ టూబ్రో(ఎల్ అండ్ టీ), ఐబీఎంలు చేపట్టనున్నాయి. క్వాంటం వ్యాలీ టెక్నాలజీ పార్కు నిర్మాణానికి ఈ మూడు సంస్థలతో ప్రభుత్వం గత నెలలో ఒప్పందం కదుర్చుకుంది. ఇందులో భాగంగా క్వాంటం కంప్యూటింగ్ పార్కులో అధునాతన 156 క్యూబిట్ క్వాంటం సిస్టం 2ను ఐబీఎం సంస్థ ఏర్పాటు చేయనుంది. క్వాంటం కంప్యూటింగ్ సర్వీసెస్, సొల్యూషన్స్ తో పాటు పరిశోధన, హైబ్రీడ్ కంప్యూటింగ్ స్ట్రాటజీస్‌ను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అందించనుంది. వైద్యా రోగ్యం, ఆర్థిక, ఉత్పత్తి, విద్యా రంగాలకు చెందిన వివిధ అప్లికేషన్లు, పరిశోధన సహకారాన్ని టీసీఎస్ అందించేలా ఈ ఒప్పందం కుదిరింది. అలాగే క్లయింట్ నెట్‌వర్క్‌తో పాటు స్టార్టప్, ఇతర ప్రాజెక్టుల నిర్వహణ, ఇంజనీరింగ్ నైపుణ్యాలను ఎల్అండ్ టీ సంస్థ అందించనుంది. 2026 జనవరి 1 నాటికి రాజధాని అమరావతిలో అధునాతన క్వాంటం వ్యాలీ టెక్నాలజీ పార్క్ సిద్ధం కానుంది. రాజధాని అమరావతిలో చేపట్టే పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. రూ.33,137.98 కోట్లతో 45 ఇంజినీరింగ్ పనుల్ని చేపట్టేందుకు సీఆర్‌డీఏకి అనుమతిచ్చింది. ఐఏఎస్, గెజిటెడ్ అధికారులు, 4వ తరగతి ఉద్యోగుల క్వార్టర్లు, వరద నివారణ కార్యక్రమాలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ కళా శాలల



విద్యార్థులకు జేఈఈ, నీట్, ఈఏపీ సెట్‌లపై శిక్షణ. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్. వీటిని బోధించేందుకు ప్రత్యేక సమయం కేటాయింపు. పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావుతో ప్రత్యేకంగా పుస్తకాలు రూపొందించి పంపిణీ. ప్రభుత్వ యాజమాన్యాల్లో చదువుతున్న విద్యార్థులకు రూ.32.45 కోట్ల వ్యయంతో సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంకింద కిట్లు. పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల మెటీరియల్, రికార్డ్‌బుక్స్, >>2

# 10న భారత్ బంద్‌కు మవోయిస్టుల పిలుపు

### 11 నుంచి ఆగస్టు 3 దాకా అమరవీరుల స్మారక సభలు

### కేశవరావు ఆశయాలు కొనసాగిస్తాం: అభయ్

**చర్ల, ప్రభాతవార్త:** భారత విప్లవోద్యమ నాయకుడు, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ బసవరాజ్ (నంబాల కేశవరావు) మృతి >>2




శనివారం హైదరాబాద్‌లో జరిగిన మిస్‌వరల్డ్ పోటీలను తిలకిస్తున్న తెలంగాణ సిఎం రేవంత్, మెగా స్టార్ చిరంజీవి

# 'మిస్ వరల్డ్' థాయ్ సుందరి

>> సుచాతా చువాంగ్‌కు ధరింపజేశారు. 3వ రన్నర్ అప్ గా మిస్ మార్టినిక్(అమెరికా ఖండం), 2వ రన్నర్ అప్‌గా మిస్ పోలెండ్(యూరప్ ఖండం), 1వ రన్నర్ అప్‌గా ఇథియోపియా(ఆఫ్రికా ఖండం) నిలిచారు. మిస్ వరల్డ్‌గా ఎంపికైన సుచాతకు రూ.8.5 కోట్ల ప్రైజ్ మనీ దక్కింది. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో జన్మించారు సుచాత. ఈ పోటీల్లో మొత్తం 108 దేశాలకు చెందిన కంటెస్టెంట్‌లు పాల్గొన్నారు. అంతకుముందు మిస్ వరల్డ్ 2025 పోటీల్లో టాప్8 నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఎలిమినేట్ అయ్యారు. టాప్ 8మందిలో మార్టినిక్, బ్రెజిల్, ఇథియోపియా, నమీబియా, పోలెండ్, ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్, థాయిలాండ్ దేశాల సుందరీమణులు నిలిచారు. ఖండాల వారీగా టాప్ ఇద్దరి నుంచి ఒక్కరిని ఎంపిక చేశారు. నువ్వు మిస్ వరల్డ్ అయితే ఏం చేస్తావు అని అడిగిన ప్రశ్నకు 45 సెకన్లలో మెరుగైన సమాధానం ఇచ్చిన వారికి నిర్వాహకులు అవకాశం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు బట్టి విక్రమార్క, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,మంత్రి పొన్నం ప్రభాకర్.మెగాస్టార్ చిరంజీవి తదితరులు హాజరయ్యారు. మిస్ వరల్డ్ విజేతకు సిఎం రేవంత్‌రెడ్డి లేచి నిలబడి చప్పట్ల ద్వారా అభినందనలు తెలిపారు. 72వ మిస్ వరల్డ్ ఫైనల్స్ అట్ట హాసంగా శనివారం సాయంత్రం హైటెక్స్ వేదికగా అట్టహాసంగా ప్రారంభమైంది. మిస్ వరల్డ్ కోసం ఫైనల్‌కు చెరిన వారు పోటీపడ్డారు. సుమారు 20 రోజుల పాటు జరిగిన వివిధ కార్యక్రమాల్లో వీరంతా పాల్గొని తమ ప్రతిభను చాటడంతో పాటు తెలంగాణలో ప్రముఖ పర్యాటక,ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించారు. తెలంగాణ జరూర్ ఆనా నినాదాన్ని ప్రపంచ వ్యాప్తం చేశారు. మిస్ వరల్డ్ ఫైనల్ ప్రారంభానికి ముందు 71వ మిస్ వరల్డ్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రిస్టినా పిజ్కోవా అద్భుతమైన డ్రెస్‌తో హర్షధ్వానాల మధ్య స్టేజ్‌పైకి విచ్చేశారు. కాగా, మిస్ వరల్డ్ జడ్జీలుగా జూలియా మోర్లీ(మిస్ వరల్డ్ సీఈఓ),సోనూ సూద్(ప్రముఖ నటుడు), సుధారెడ్డి(మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్), రానా దగ్గుబాటి(సినీ హీరో),జయేశ్ రంజన్,మనూషి చిల్లర్(బాలీవుడ్ నటి), నమ్రత శిరోద్కర్,డోనా వాల్ష్, డాక్టర్ కరినా టర్రెల్ (మిస్ ఇంగ్లాండ్ 2014)వ్యవహరించారు. .

**సోనూ సూద్‌కు హ్యుమానిటేరియన్ అవార్డు:** కాగా, ప్రముఖ నటుడు సోనూ సూద్‌కు మిస్ వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డు వేదికపై ప్రధానం చేశారు. కరోనా సమయంలో ఆయన చేసిన మానవతా చర్యలు గుర్తింపుగా అవార్డు అందించారు. రానా దగ్గుబాటి చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు. స్టేజ్‌పైన వదల బొమ్మాళీ డైలాగ్ చెప్పి ప్రేక్షలను సోనూ సూద్ ఉత్సాహ పరిచారు. తర్వాత మిస్ వరల్డ్ ఫైనల్స్ ముందు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల వెలుగులో ఖండాల వారీగా అద్భుతంగా డిజైన్ చేసిన స్టేజీపై 108 దేశాల ప్రతినిధులు ర్యాంపు వాక్ చేశారు. తర్వాత ఒక్కో ఖండం నుంచి 10 మంది ఫాస్ట్ గ్రాక్ విన్నరల్‌ను ఫైనల్ ఈవెంట్‌కు నిర్వాహకులు పరిచయం చేశారు. అద్భుతమైన ఏర్పాట్లకు తెలంగాణ ప్రభుత్వానికి,టూరిజం శాఖకు సుధారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మిస్ వరల్డ్ బ్యూటీ విత్ పర్పస్‌గా మిస్ ఇండోనేషియా ఎన్నికైంది. పరిశుభ్రమైన నీరు అందరికీ అవసరమనే విషయంపై ఆమె ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా, ఫైనల్స్‌లో నిర్వాహకులు ఖండాల వారీగా టాప్ 10 నుంచి ఐదుగురిని షార్ట్ లిస్ట్ చేశారు. తర్వాత ఇద్దరేసిని షార్ట్ లిస్ట్ చేశారు. ఈ క్రమంలో మిస్ వరల్డ్ నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా నిష్క్రమించారు. తర్వాత ఖండాల వారీగా టాప్ ఇద్దరి నుంచి ఒక్కరిని షార్ట్ లిస్ట్ చేశారు.జడ్జీలు అడిగిన ప్రశ్నలకు కంటెస్టెంట్‌లు ఇచ్చిన సమాధానాల ఆధారంగా విజేతలను ఎంపిక చేశారు. ఫైనల్ పోటీ ప్రారంభంలో బాలీవుడ్ స్టార్ ఇషాన్ కట్టర్ డాన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఉర్రూత లూగించారు.

**ఈవెంట్‌ను అపూర్వ విజయంగా నిలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు**

హైదరాబాద్ వేదికగా తెలంగాణ పర్యాటక ప్రమోషన్ , సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించడమే లక్ష్యంగా నిర్వహించిన మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతం కావటంపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో, దిశానిర్దేశంతో అత్యంత ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ వేడుకలను తెలంగాణలో ఘనంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అపూర్వ విజయంగా నిలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మిస్ వరల్డ్ సంస్థ, ప్రపంచ వ్యాప్తంగా పాల్గొన్న పోటీదారులు, అధికారులు, అవిశ్రాంతంగా శ్రమించిన బృందాలు, విభాగాలు సహాయకుల అసమానమైన అంకితభావం, సమన్వయంతో కృషి చేసిన వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమగ్ర కార్యాచరణ, సమన్వయంతో నిర్విరామంగా కృషి చేయడం వల్ల ఈ ఈవెంట్ ఇంత గ్రాండ్ సక్సెస్ అయిందని చెప్పారు.అందరి సహకారంతో తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చెప్పగలిగామని పేర్కొన్నారు. సాంస్కృతిక వినిమయాన్ని ప్రోత్సహించే, తెలం గాణను ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలిపే అంతర్జాతీయ కార్యక్రమాలను నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్రం సదా సమాయత్తంగా ఉంటుందని మంత్రి పునరుద్ఘాటించారు. 2025 మిస్ వరల్డ్ విజేతకు మంత్రి జూపల్లి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈశాన్యరాష్ట్రాల్లో దంచి కొడుతున్న వర్షాలు

**న్యూఢిల్లీ, మే 31:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. అసోంలో ఐదుగురు మృతిచెందారు. మిజోరంలో ఇళ్లు కూలాయి. కేరళ, కర్నాటక, మహారాష్ట్రలోని చాలాప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జనజీవనం స్తంభించింది. రోడ్లు నదుల్ని తలపిస్తున్నాయి. అసోంలోని లఖింపుర్‌లో వరదలకు పశువులు మృత్యువాతపడ్డాయి. గువాహటి వరదల్లో చిక్కుకున్న వారిని సహాయక బృందాలు రక్షించాయి. మిజోరంలోని లాంగ్‌ట్లాయ్ టౌన్‌లో కొండచరియలు విరిగిపడి ఓ హోటల్‌తోపాటు 5 ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో పలువురు చనిపోయినట్లు అనుమానిస్తున్నారు. శిథిలాల్లో చిక్కుకున్న వారికోసం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయి. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, నాగాలాండ్, త్రిపుర, బెంగాల్ సహా కొన్నిప్రాంతాల్లో వాన దంచికొడుతోంది. మేఘాలయ తూర్పు ఖాసీహిల్స్ జిల్లాలో ముగ్గురు మరణించారు. ఈశాన్య రాష్ట్రాల్లో 20 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనావేసిన ఐఎండీ చాలా ప్రాంతాలకు రెడ్, ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. పర్వత ప్రాంతాలు కావడంతో ఎగువ నుంచి వర్షపునీరు దిగువకు ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు నీటమునిగాయి. అరుణాచల్‌లోని దపోరిజో ప్రాంతంలో సిగిన్ నదిలో ప్రవాహం పోటెత్తింది. కామెంగ్‌లో వరదల్లో చిక్కుకున్న వందలాది మందిని రక్షించారు. మియాంగ్ నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. కేరళలో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరువనంతపురం, కొల్లం, పతనంతిట్ట, అలప్పుజ, కొట్టాయం, ఇడుక్కి, ఎర్నాకుళం, త్రిస్సూర్, మలప్పురం, కోజికోడ్, కన్నూర్ జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. తిరువనంతపురంలోని లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు ఇళ్లలోకి చేరింది. వందలాది మంది పునరావాస కేంద్రాలకు వెళ్లారు. కాసరగోడ్‌లో మధువాహిని నది ఉప్పొంగింది. సమీప ప్రాంతాల ప్రజలు ఇళ్లపై అంతస్తులకు వెళ్లి తలదాచుకున్నారు. కోజికోడ్, కన్నూర్‌లో ప్రజలు ఇళ్లముందు చెక్క, రబ్బరు బోట్లను సిద్ధంగా ఉంచారు. కొట్టాయంలో 46, అలప్పుజ జిల్లాలో 26 సహాయక శిబిరాల్లో వందలమంది ఆశ్రయం పొందుతున్నారు. భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా కొచ్చిలోని కన్నమలీ, చెల్లనం ప్రాంతాల్లో సముద్రంలో అలలు జనావాసాల్లోకి పోటెత్తాయి. రెండు కాలనీలు నీటమునిగాయి. 250 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు కర్ణాటక, మహారాష్ట్రసహా జమ్మూకశ్మీర్‌లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి.



# పెంచ్చన్న వరద

>> ఇస్తున్నాను అన్నారు.

**కోనసీమ ఒకప్పుడు అందాలసీమ:** కోనసీమ ఒకప్పుడు అందాలసీమ. ఇక్కడ తలసరి ఆదాయం తగ్గింది. తలసరి ఆదాయం, అభివృద్ధిలో కోనసీమ కంటే అనంతపురం ముందుంది. ఆక్వా పెంపకం, కొబ్బరి తోటల సాగుతో కొంత వరకే ఆదాయం వస్తోంది. పాడి పరిశ్రమలు కూడా అభివృద్ధి కావాలి. కోకో వేస్తే అదనపు ఆదాయం వస్తుంది. 90వేల ఎకరాల్లో కొబ్బరి సాగువుతోంది. వీటిలో కోకో లేదా పశుగ్రాసం వేస్తే ఆదాయం రెట్టింపవుతుంది. కోనసీమ జిల్లాలో పేదలకు రెండు గేదెలు అందిస్తే వారు ఆర్థికంగా ఎంతోకొంత సంపాదించుకుంటారు. వీరికి సాయంపై చర్యలు తీసుకుంటాము. ఈ జిల్లాకు నా మిత్రుడు బాలయోగి గుర్తొస్తాడు. అతడు మామూలు కుటుంబంలో పుట్టి లా చేశాడు. దళితుడిని పార్లమెంటు స్పీకర్ చేసిన ఘనత టీడీపీదే. టీడీపీ అన్ని కులాలు, అన్ని వర్గాల పార్టీ. 1996లో గోదావరి తుఫాను సమ యంలో నేను రాజమండ్రికి సచివాలయాన్ని తీసుకొచ్చి 15 రోజులు ఇక్కడి నుంచే పనిచేశాను. **గోదావరి మృతులు కుటుంబాలకు రూ.2 లక్షల సాయం:** పల్లంకుర్రు, మూలపాడు బ్రిడ్జ్, ముమ్మిడివరం, కాట్రేని కూడా ఆర్ అండ్ బి రోడ్డు, గోగులంక బ్రిడ్జ్ నిర్మాణం చేపడతాము. కుండలేశ్వరం ఫ్లడ్ బ్యాంక్ ఆధునీకరణ పనులకు నిధులు మంజూరు చేస్తాం. చెయ్యేరు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేస్తాం. నియోజ కవర్గంలో విద్యార్థినుల కోసం బీసీ రెసిడెన్షియల్ స్కూలు, కాలేజీ మంజూరు చేస్తున్నాను. ఇటీవల గోదావరిలో స్నానానికి వెళ్లి విద్యార్థుల మృతి బాధించింది. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్ అందిస్తామన్నారు. జిల్లాకు విచ్చేసిన ఆయనకు మంత్రులు ఎమ్మెల్యేలు కలెక్టర్లు స్వాగతం పలికారు.

## 10న భారత్ బంద్‌కు మవోయిస్టుల పిలుపు

>> పార్టీకి తీరనిలోటని ఆయన ఆశయాల సాధనకు కృషిచేస్తామని మావోయిస్టు కేంద్ర కమిటి అధికార ప్రతినిధి అభయ్ అన్నారు. ఈ మేరకు శనివారం పత్రికలకు లేఖ విడుదల చేసారు.కేంద్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు కామ్రేడ్ బసవరాజ్ సహా 27 మంది పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. కార్యకర్తలను హత్య చేయడాన్ని ఖండిస్తూ జూన్ 10న దేశవ్యాప్తంగా బంద్‌ను పాటించాలని పిలుపునిచ్చారు.

జూన్ 11 నుండి ఆగస్టు 3 వరకు దేశవ్యాప్తంగా కామ్రేడ్ బసవరాజ్ (బీఆర్) సహా 27 మంది అమరుల స్మారక సభలు నిర్వహించాలని అన్నారు. మే 21 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటిరోజు అని ఆ రోజున దేశ ప్రధాని నరేంద్రమోదీ హోంమంత్రి అమిత్ షాల ఆదేశాలను అనుసరించి భారత సైన్యం, పారామిలిటరీ, కమాండో బలగాలు, ఛత్తీస్ గఢ్ రాష్ట్ర పోలీసు బలగాలు నారాయణపూర్ జిల్లా, మాడ్ ప్రాంతంలో సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ లో మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజ్ సహా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ.కు చెందిన వివిధ స్థాయి నాయకత్వ కామ్రేడ్స్‌ను, సభ్యులను హత్యచేసాయి. ఈ హత్యకాండ సాగించిన భద్రతా బలగాల పట్ల తనకెంతో గర్వంగా ఉందని మోదీ, ఇది చారిత్రాత్మక విజయమని అమిత్ షాలు ప్రకటించారు. ఈ ప్రకటనల ద్వారా వారు తమ రక్తపిపాస నరహంతక స్వభావాన్ని మరోమారు ప్రకటించుకున్నారని విమర్శించారు.

మార్చి చివరి వారంలో జస్టిస్ చంద్రకుమార్ నాయకత్వంలో హైదరాబాద్ లో శాంతి చర్చల కమిటీ ఏర్పడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని ప్రకటన విడుదల చేసిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు సానుకూల పరిస్థితిని కల్పిస్తే మా పార్టీ అందుకు సిద్ధమేనని మార్చి 28న పత్రికా ప్రకటన ద్వారా మా వైఖరిని ప్రకటించామని, ఆ తర్వాత రెండు సార్లు మా కేంద్రకమిటీ మీడియా ప్రతినిధి కామ్రేడ్ అభయ్, దండకారణ్య స్పెషల్ జోన్ లోని ఉత్తర్ పశ్చిమ్ సబ్ జోన్ల మీడియా ప్రతినిధి కామ్రేడ్ రూపేష్ రెండు సార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖగార్‌ఖీ యుద్ధాన్ని ఆపివేసి శాంతి చర్చలకు సానుకూల పరిస్థితిని కల్పించాలని కోరారని పేర్కొన్నారు. ఈ ప్రకటనలను ఏ మాత్రం లెక్క చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరమ ఫాసిస్టు పద్ధతుల్లో కగార్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ఏప్రిల్ 1 నుండి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా దాదాపు 85 మంది కామ్రేడ్స్ ను హత్య చేసారని ఏప్రిల్ 21 నాడు ఝార్ఖండ్ రాష్ట్రంలోని బొకారో జిల్లాలో మా పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ వివేక్ (ప్రయాగ్ మాంజీ)ని హత్య చేసారని, 24 ఏప్రిల్ నుండి మే 8 మధ్య కుర్రెగుట్టల్లో 31 మందిని హత్యచేసారు. గత సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు దాదాపు 540 మంది విప్లవకారులను, జల్, జంగల్, జమీన్ కోసం పోరాడుతున్న సాధారణ ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేసాయని, మావోయిస్టు రహిత భారత్ ఏర్పాటు కోసం మార్చి 31, 2026 వరకు ఈ హత్యాకాండను కొనసాగిస్తామని దేశప్రధాని, హోంమంత్రులు పదే పదే ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. శాంతి చర్చలకు సిద్ధమేనని ప్రకటించినప్పటి నుండి దాదాపు గత 2 నెలలుగా మేము ప్రభుత్వ సాయుధ బలగాలపై దాడులు చేయకుండా సంయమనం పాటించామని, ఈ స్థితిలో శాంతి చర్చలకు సిద్ధంగా లేని బీజేపీ పాలిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన, విశాలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా యావత్తు దేశ ప్రజానీకానికి పిలుపునిస్తున్నట్ల పేర్కొన్నారు.

## లిక్కర్ స్కాం కేసులో రెండో రోజు విచారణ

**విజయవాడ,మే31.ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులు,మాజీ సిఎం జగన్‌కు అత్యంత సన్నిహితులైన నలుగురిని సిట్ రెండో రోజు కస్టడీకి తీసుకుంది. ఐటీ శాఖ సలహాదారు రాజ్ కెసిరెడ్డి,సిఎంఓ మాజీ కార్యదర్శి,విశ్రాంత ఐఎఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి,జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహనరెడ్డి,భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలనున అధికారులు ప్రశ్నిస్తున్నారు. విచారణకు ముందు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సిట్ కార్యాలయానికి తరలించారు. సాయంత్రం 6 గంటల వరకు నిందితులను విచారించనున్నారు. ఈ కేసులో ఈ నలుగురిని రెండు రోజుల పాటు సిట్ కస్టడీకిస్తూ విజయవాడ ఎసిబి న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్ర, శనివారాల్లో ఉదయం 8 నుండి సాయంత్రం 6 వరకూ నలుగురినీ కస్టడీలో విచారించేందుకు అనుమతినిచ్చింది.కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తు చివరిగా ఎక్కడికి చేరిందో వీరికి తెలుసని, అంతిమ లబ్ధిదారునకు డబ్బు చేర్చడంలో వీరు కీలకంగా వ్యవహరించారని గుర్తించిన సిట్, ఆ కోణంలో ప్రశ్నించేందుకు సిద్ధమవుతోంది. కుట్రకు రూపకల్పన, అమలు, ముడుపుల వసూళ్ళు,ఆ మొత్తాన్ని 'బిగ్‌బాస్'కు,ఆయన సతీమణికి చేర్చడంలో ఈ నలుగురి పాత్రపై ఇప్పటికే కొన్ని కీలక ఆధారాలను సేకరించిన దర్యాప్తు అధికారులు, వాటి ఆధారంగా మరింత లోతుగా వివరాలు రాబట్టనున్నారు.

## మూడు రోజుల పాటు భారీ వర్షాలు

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న మూడు రోజులు రాష్ట్రంలో మేఘావృత వాతావరణంతో పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం,అనకాపల్లి, కాకినాడ,కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు,కర్నూలు,నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, వైఎస్ఆర్ కడప, అనంతపురం, శ్రీసత్యసాయి,చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశంఉంది. శుక్రవారం సాయంత్రం 5గంటలనాటికి విజయనగరంజిల్లా గుర్లలో 87.5మిమీ, వైఎస్ఆర్‌కడపజిల్లా సెట్టివారిపల్లిలో 87.5మిమీ, విజయనగరంజిల్లా వేపాడలో 79.2మిమీ, నంద్యాల జిల్లా ముత్యాలపాడులో 79మిమీ,అనకాపల్లిజిల్లా నర్సీపట్నంలో 74మిమీ వర్షపాతం నమోదైంది.

## మెగా డీఎస్సీహాల్ టిక్కెట్లు విడుదల

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే మెగా డీఎస్సీకి ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కీలక అప్‌డేట్.జూన్ 6 నుండి 30 వరకు జరుగనున్న ఈ పరీక్షకు సంబంధిత హాల్‌టిక్కెట్లు విడుదలయ్యాయి. ఇటీవల మొత్తం 17 పేపర్లకు సంబంధించిన నమూనా పరీక్షను అందుబాటులోకి తీసుకొచ్చిన విద్యాశాఖ అధికారులు ..తాజాగా హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ కోసం వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యర్థులు తమ వివరాలను ఎంటర్ చేసి హాల్‌టిక్కెట్లు పొందొచ్చు.రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 16,347 టీచర్ పోస్టుల భర్తీ కోసం ఏప్రిల్ 20 నుండి మే 15 వరకు ధరఖాస్తులు ఆహ్వానించగా అన్ని పోస్టుకు దాదాపు మూడున్నర లక్షల మందికి పైగా అభ్యర్థులు ధరఖాస్తు చేసుకున్నారు.ఇక జూన్ 6 నుండి 30 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. కూటమి ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే. రాష్ట్రానికి చెందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల అభ్యర్థులు కలిపి మొత్తం 3,35,401 మంది ఈ పరీక్షకు ధరఖాస్తు చేశారు. దీంతో రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశాలోనూ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధరఖాస్తు సమయంలోనే పరీక్ష కేంద్రాలకు సంబంధించి ఐచ్ఛికాలు స్వీకరించారు. ఎక్కువ మందికి వీటి ప్రకారమే పరీక్షా కేంద్రాలను కేటాయించారు.

## 16 యేళ్ల వయస్సులోనే కేన్సర్ ముప్పు నుంచి బయటపడిన సుచాత చువాంగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే31:** హైదరాబాద్ వేదికగా జరిగిన 72వ మిస్ వరల్డ్ పోటీల్లో ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీకి ప్రపంచ సుందరి కిరీటం దక్కడంతో ఆమె సొంత దేశం థాయిలాండ్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. 'ఓపల్ ఫర్ హర్' అనే నినాదంతో సుచాత.మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్నారు ఈ నినాదం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపాలన్నదే తన లక్ష్యమని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె చెప్పుకొచ్చారు. 16 ఏళ్ల వయస్సులోనే క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడిన ఆమె, థాయ్‌లాండ్‌లో రొమ్ము క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. క్యాన్సర్ బాధితులకు అండగా ఉండేందుకు నిధుల సేకరించడంతోపాటు, కొన్ని సంస్థలతో కలిసి పని చేస్తున్నారు. ప్రభావితం చూపే లక్ష్యంతో యువత ముందడుగు వేయాలని ఆమె కోరారు.




స్పీకర్ అయ్యన్న పాత్రుడుని కలిసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

## శ్రీశైల మల్లన్న సన్నిధిలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**శ్రీశైలంప్రాజెక్టు, మే 31 ప్రభాతవార్త:** శ్రీశైల మల్లన్న దర్శనార్థమై శనివారం అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు శ్రీశైలంకు చేరుకున్నారు.వీరికి అతిథిగృహం వద్ద శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిసారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకోనున్నారు.

# రేషన్ పంపిణి

>> పట్టుకుందని గుర్తు చేశారు. వీటిని అరికట్టేందుకు,ప్రతి పేద కుటుంబానికి రేషన్ సరుకులు అందించేందుకు ఇకపై ప్రతి నెలా 1వ తేదీనుండి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు అలాగే సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు రేషన్ డీలర్ల దుకాణాల వద్ద అందచేస్తామని తెలిపారు. దీని ద్వారా రద్దీని తగ్గించడమే కాకుండా,ప్రతి ఒక్క కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే దివ్యాంగులకు,65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించే సౌకర్యాన్ని కూడ ప్రభుత్వం కల్పించిందని వెల్లడించారు. ఈ సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జనరంజకంగా అమలవుతుందని పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు.

# సన్నబియ్యం

>> సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో సైతం సరుకులు పంపిణీ పూర్తి చేయాలన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి అయిదో తేదీలోపే దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడి వృద్ధులకు ఇంటివద్దే రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు చొరవ చూపాలన్నారు. వాట్సాప్ గ్రూపు ద్వారా ఎప్పటికప్పుడు సమా చారం అందించడం వల్ల, కార్డుదారులకు ఎలాం టి ఇబ్బంది లేకుండా చూడవచ్చన్నారు. ఒకవేళ ఎప్పుడైనా సాంకేతిక సమస్యలు ఎదురైనాసరే కార్డుదారులకు ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరుకుల పంపిణీ జరగాల్సిం దేనని స్పష్టం చేశారు. ఈపోస్, వెయింగ్ మెషిన్ల రిపేర్లకు సంబంధించి సర్వీసు క్యాం పులు ప్రతి జిల్లాకు ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీకి సర్వసన్నద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు.

## టెక్నాలజీ పార్కుకు ఆమోదం

>> రాతపుస్తకాలతో కిట్. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం పునరుద్ధరణ. జనవరి నుంచి 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు. అదే ప్రాంగణంలో కలిసి ఉన్న లేదా సమీపంలోని ఉన్నత పాఠశాలల నుంచే కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం. కేజీ నుంచి పీజీ వరకు ఇంటిగ్రేట్ చేస్తూ విలువలతో కూడిన పాఠ్యప్రణాళిక రూపకల్పన చేసారు. అమరావతిలో క్వాంటం వ్యాలీతో పాటుటెక్నాలాజీ రంగంలో పలు మార్పు కచ్చితంగా తీసుకుని వస్తామని ఇప్పటికే సీఎం చంద్రబాబు తెలిపారు.

## ఆయుష్ ఆస్పత్రికి వంశీ

**విజయవాడ,మే 31,ప్రభాతవార్త ప్రతినిధి:** రిమాండ్ ఖైదీగా ఉన్న వైకాపా నేత వల్లభనేని వంశీని విజయవాడలోని జిల్లా జైలు అధికారులు శుక్రవారంరాత్రి ఆయుష్ ఆస్పత్రికి తరలించారు. శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బందిపడుతున్న వంశీకి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించేలా ఆదేశించాలని అతడి న్యాయవాది హైకోర్టులో పిటీషన్ వేసినవేసారు. దానిపై కోర్టు ఆదేశాలమేరకు వంశీని ఆయుష్‌కు తరలించారు. అయితే కోర్టు ఉత్తర్వుల తరువాత జైలు అధికారులు వంశీని ఆస్పత్రికి తీసుకుని వెళ్ళడంలో ఆర్డర్లు రాలేదని తాత్సర్యం చేసింది.చివరికి కోర్టు మందలింపుతో వంశీని నాలుగో అంతస్థులో అతడి కోసం మూడు గదులను ఖాళీ చేయించినట్లు తెలిసింది. భార్య పంకజశ్రీ అతడికి సహాయంగా ఉండటానికి కోర్టు అనుమతించింది. రిమాండ్ ఖైదీ కావడంతో అతడి గది బయట సాయుధ సిబ్బందిని కాపలా ఉంచారు. ఆస్పత్రిలో చేరిన తర్వాత వంశీకి వైద్యులు పరీక్షలు నిర్వహించారు.

## తెలంగాణలో అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ వయస్సు 65కు పెంపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే31:** తెలంగాణలో ఉన్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ వయస్సును పెంచుతూ జీఓ జారీ చేసింది. ఈ మేరకు శనివారం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంపుతో పాటు, పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. లక్ష ఉండగా తాజా ఉత్తర్వుల్లో దానిని రూ. 2 లక్షలకు పెంచింది.

## కాలేజి ప్రిన్సిపాల్ కిడ్నాప్?

>> తమకేమీ ఫిర్యాదు రాలేదని వెల్లడించారు. కళాశాల ఉన్న సూర్యారావుపేట పోలీసులు కూడ తమకేమీ ఫిర్యాదు రాలేదని వెల్లడించడం గమనార్హం. ఈ కిడ్నాప్ అనేది నిజమా లేదా వదంతులు అనే విషయంపై సందిగ్ధత నెలకొని ఉంది.

## 5న లాసెట్

>> టి.సీతాకుమారి, పిఆర్ఒ డాక్టర్ ఎన్. రజనితో కలసి ఉపకులపతి ఆచార్య ఉమ శనివారం తిరుపతిలోని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో మీడియాకు వెల్లడించారు. 5వ తేదీ ఈ ప్రవేశపరీక్ష ఉదయం 9గంటల నుండి 10.30గంటల వరకు జరుగుతుందన్నారు. మూడుసంవత్సరాల ఎల్ఎల్‌బి కోర్సుకు 19,973మంది అభ్యర్థులు, ఐదేళ్ల లాకోర్సుకు 4,794మంది,పిజి ఎల్ఎల్ఎం కోర్సుకు 2,486మంది దరఖాస్తుచేశారు. వీరిలో పురుషులు 17,983మంది, స్త్రీలు 9,269మంది, ట్రాన్సెంజడర్ ఒకరు దరఖాస్తుచేసుకున్నారని తెలిపారు.అన్ని పరీక్షాకేంద్రాల్లో సాంకేతిక భద్రత లాజిస్టిక్ ఏర్పాట్లు పూర్తయ్యాయని విసి తెలిపారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్లు, గుర్తింపు పత్రాలతోబాటు సమయానికి ముందుగానే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని కన్వీనర్ ఆచార్య సీతాకుమారి తెలిపారు.తిరుపతిలో నాలుగు పరీక్షాకేంద్రాలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.

## 'అడవితల్లి బాట'

>> కుల గణన చేపట్టడం అనేది ఎంతో అవసరం. దేశంలో ఉన్న కులాల పరిస్థితులు, వారి జీవనం, వృత్తులు, స్థితిగతులు తెలుస్తాయి. వారికి జీవనోపాధుల మెరుగుదలకు ఏ విధమైన చర్యలు చేపట్టాలి, ఏ పథకాలు తీసుకురావాలో పాలనవర్గాలకు ఒక స్పష్టత వస్తుందన్నారు.

### వారం - వర్జ్యం

తేది : 01-06-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
షష్ఠి సా.8.06
ఆశ్లేష రా.9.41
వర్జ్యం ఉ.10.11-11.49
దు.సా.4.49-5.41
రాహుకాలం - సా.4.30-6.00

### వార్తాఫలం

మేషం : పారిశ్రామిక, రాజకీయ, కళారంగాలలోని వారికి సన్మానాల యోగం ఉంటుంది.

వృషభం : గృహ నిర్మాణ ఆలోచనలు ఫలిస్తాయి. వృత్తి-వ్యాపారాలలో అనుకూలంగా వుంటుంది.

మిథునం: రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అనుకోని ఆహ్వానాలు అందుతాయి.

కర్కాటకం : తండ్రి నుండి కీలక సమాచారం అందుకొంటారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

సింహం: జీవితభాగస్వామ్య సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ధనలాభం.

కన్య : కుటుంబ సమస్యలు తీరినందున ప్రశాంతత లభిస్తుంది. సంఘంలో గౌరవంపొందుతారు.

తుల : సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మీలోని ప్రతిభా పాటవాలకు గుర్తింపు లభిస్తుంది.

వృశ్చికం: పూర్వపు మిత్రుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. స్థలాల కొనుగోలు.

ధనుస్సు: ఊహించని విధంగా ఆహ్వానాలు పొందుతారు. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

మకరం: రచన, వ్యాసంగాల వల్ల అధిక ఆసక్తి చూపుతారు. పండితులు, ప్రముఖులను కలుస్తారు.

కుంభం: కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వస్త్రలాభం.

మీనం : ఆరోగ్యంపట్ల మెలకువ అవసరం. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్

## త్రిపుల్ ఐటిలో ప్రవేశానికి జూన్2 వరకు దరఖాస్తులు

**విజయవాడ,మే31,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా శాఖ నుంచి వచ్చిన విన్నపం మేరకు, ఆర్జీయూకేటీ - పీయూసీ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరించే చివరి తేదీని 10.06.2025 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించబడిందని ఆర్జీయూకేటీ అడ్మిషన్ల కన్వీనర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ సండ్ర తెలిపారు. ఈ పొడిగింపును అనుసరించి, ఇంకా దరఖాస్తు చేయని విద్యార్థులు జూన్2 ఉదయం 10 గంటల నుండి వెబ్ సైట్ ద్వారా కానీ ఎపి ఆన్‌లైన్ కేంద్రం ద్వారా కానీ దరఖాస్తులు చేసుకోవచ్చు. ఇప్పటికే దరఖాస్తు చేసిన విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అలాగే, ఇప్పటికే దరఖాస్తు చేసి, పున: లెక్కింపు లేదా పున్ణ మూల్యాంకనంలో తమ మార్కులు పెరిగిన విద్యార్థులు కూడా మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదు. వారి సవరించిన మార్కులు నేరుగా ఎస్‌ఎస్సీ (శీశీది) బోర్డు నుండి పొందబడతాయి.



## కాణిపాకంలో కొనసాగుతున్న రద్దీ

### - దర్శనానికి నాలుగు గంటల సమయం

**కాణిపాకం, మే 31 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతుండడంతో కాణిపాకం ఆలయ భక్తజన సంద్రంగా తయారైంది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు,వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది.ఈమేరకు శనివారం వారంతపు రోజు కావడంతో పాటు విద్యాసంస్థలు,పాఠశాలలకు వేసవి సెలవులు మరో వారం రోజుల్లో ముగుస్తుండడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు

## చంద్రబాబు ప్రసంగం మొత్తం అభద్రతాభావం కనిపించింది: మాజీ మంత్రి అంబటి రాంబాబు

కడపలో నిర్వహించిన టీడీపీ మహానాడు తుస్సు మంది అంటూ సెటైర్లు వేశారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత,మాజీ మంత్రి అంబటి రాంబాబు...చంద్రబాబు ప్రసంగం మొత్తం అభద్రతాభావం కనిపించింది...కడప మహానాడు తుస్సు మంది...ప్రజలను డైవర్ట్ చేయడానికి కామెడీ ఆర్టిస్టులను తీసుకువచ్చారు. ఎంఎల్ఏల వినోద కార్యక్రమాల సమయంలో కూడ జగన్‌ను తిట్టించడం కింద నవ్వుకోవడం...మేం మీ మీద ఇలా మీ మాట్లాడలేమా...? అని ప్రశ్నించారు... మాట్లాడితే తల్లి,చెల్లి అంటారు...మీ గృహ ప్రవేశానికి మీ చెల్లెళ్ళను పిలిచారా...? మహానాడులో గావు కేకలతో మాట్లాడి సక్సెస్ అయ్యింది అని చెప్పుకుంటున్నారు. లోకేష్ గారి ముందుంది ముసళ్ళ పండగ....ఆయన అనుభవం లేకుండా పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు...మా మీద కేసులు పెడుతునా న్నరు...రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు గుర్తు పెట్టుకోండి అని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు కాకపోవడంతో వెన్నుపోటు దినంగా జూన్ 4న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా హెడ్ క్వార్టర్లలో నిరసన తెలపాలని పిలుపునివ్వడంతో నేడు మంగళగిరి వైసీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అధ్యక్షతన అన్ని నియోజక వర్గాల ఇంఛార్జిలతో వైసీపీ కార్యకర్తల సమక్షంలో సమావేశం నిర్వహించారు.

జూన్ 4న జరుగబోయే వెన్నుపోటు దినంను జయప్రదం చేయాలని మాజీ మంత్రి అంబటి కోరారు...ఇక మంత్రి,నారా లోకేష్‌పై మాజీ మంత్రి అంబటి రాంబాబు ఫైర్ అయ్యారు.రాష్ట్రంలో మంత్రి లోకేష్ ఓ పిల్ల సైకోలా ప్రవర్తిస్తున్నారంటూ మండిపడ్డారు...రాష్ట్రంలో సిఐ దగ్గర నుండి డీఎస్పీ వరకు ఎవరి పోస్ట్ మారాలన్న సూట్‌కేసులు అందించాల్సిందేనని కామెంట్ చేశారు...రాజధాని పేరుతో వేల కోట్ల రూపాయలు కొడుకు ద్వారా అక్రమ సంపాదనను సంపాదిస్తున్నారు చంద్రబాబు... చంద్రబాబు స్టీరింగ్ లోకేష్ చేతిలో పెట్టారు...అది ఎప్పుడో గుద్దుతాడు జాగ్రత్త అని ఎద్దేవా చేశారు...చంద్రబాబు అడగ్గానే పవన్ కళ్యాణ్ తిక్కలోడిలాగా ఎక్కడపడితే అక్కడ సంతకాలు పెట్టేస్తున్నారు.

చంద్రబాబు పథకాలను బీజేపీ నమ్మలేదు కాబట్టే సంతకం పెట్టకపోగా...కనీసం పట్టుకునే సాహసం కూడ చేయలేదు...లోకేష్ తక్కువ ఇన్ మెచ్యూర్ పొలిటీషియన్‌గా ప్రవర్తిస్తున్నారు. చంద్రబాబు చంద్రగిరిలో ఓడిపోతే పారిపోయి కుప్పంలో పోటీ చేశాడు మంగళగిరిలో ఓడిపోయి ఇక్కడే గెలిచాను అని మీ నాన్నకు చెప్పు మళ్ళీ ఇక్కడే ఓడిపోతావు అంటూ అంబటి రాంబాబు లోకేష్‌ను విమర్శించారు.

## నర్సాపూర్ - అరిసికెర ప్రత్యేక రైళ్లు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,మే 31,ప్రభాతవార్త** రాష్ట్రంలోని నర్సాపూర్-అరిసికెర-నర్సాపూర్ మధ్య ప్రస్తుతం నడుపుతున్న ప్రత్యేక రైలు సర్వీసులను ప్రయాణికుల సౌకర్యార్థం ఆగస్టు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రతి ఆదివారం నర్సాపూర్ నుంచి అరిసికెరకు బయలుదేరే నెంబర్ 07201వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను జూన్ 1 నుంచి ఆగస్టు 31వరకు ప్రతి సోమవారాల్లో అరిసికెర నుంచి నర్సాపూర్‌కు బయలుదేరే నెంబర్ 07202వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును జూన్ 2నుంచి సెప్టెంబర్ 1వరకు పొడిగించారు.

## దేవాదాయ శాఖ భూమి కబ్జా, తన వెంచర్‌లో చేర్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారి!

**విజయవాడ,మే30,ప్రభాతవార్త ప్రతినిధి:** దేవాదాయ శాఖ భూమిన కబ్జా చేయడమే కాకుండా ఏకంగా సిర్దాస్తి వ్యాపార పరిధిల్లో ప్లాట్లు వేసాడో ప్రబుద్ధుడు.ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన వెంచర్ కు దేవాదాయ శాఖ భూమిని దారిగా చూపించి ప్లాట్లను అమ్ముకుంటున్న వ్యవహారం కృష్ణా జిల్లా కపాడు మండలం నెప్పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ విషయం తెలిసిన గ్రామస్థులు, రెవెన్యూ, దేవాదాయ శాఖ, కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో అసలు సంగతి బయటపడింది. ఈ . విషయం తెలుసుకున్న అధికారులు దేవాదాయ శాఖ భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. దీనిలో ఆర్ఎస్సార్ రికార్డులు సర్వే నెంబర్ 101లోని 4.41 ఎకరాల భూమి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి చెందినవి ఉండగా అడంగల్ లో కన్యకా పరమేశ్వరి సత్రానికి చెందినదిగా ఉంది. ఈ భూమి చాలా ఏళ్లుగా నెప్పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆధీనంలో ఉంది. దీంతో అతను వెంచర్ లోకి వెళ్లేందుకు రహదారికి అతను లీజు ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయంపై అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయగా ఈ భూమి కనకదుర్గమ్మ భూములుగా తేల్చారు. ఈ క్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు ఆ ప్రదేశాన్ని పరిశీలించి కబ్జాకు గురైందని నిర్ధారించారు. దీనిని వెంటనే రెవెన్యూ రికార్డులో మార్పులు చేసి పూర్తిస్థాయి దేవాదాయ శాఖ భూమిగా మార్పులు చేసేందుకు ఆదేశాలు జారీ చేశామని ప్రస్తుతం వెంచర్ లో వేసిన రహదారిని మూసివేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సాంబశివరావు తెలిపారు. జయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి చెందిన భూమి సర్వేనెంబర్ 101లో 4 ఎకరాల 41 సెంట్లు ఉంది. అయితే ఈ భూమిని కన్యకా పరమేశ్వర సత్రం వాళ్లు అడంగల్ లో వారి పేరు నమోదు చేయించారు.

ఇప్పటి వరకు ఈ భూమి వారి స్వాధీనంలో ఉంది. అయితే వారు వేరే వారికి లీజ్ కు ఇచ్చారని మాకు కంప్లైంట్ వచ్చింది. లీజ్ తీసుకున్నవారు ఈ భూమిలో నుంచి రోడ్డు వేశారు. ఇప్పుడు ఈ రోడ్డును మేము మూసివేస్తాము. అలానే రెవెన్యూ రికార్డులో మార్పులు ఈ భూమిని పూర్తిస్థాయిలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి చెందినదిగా మార్చుతామని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు, తెలిపారు.

## పలు రైళ్ల వేళల్లో మార్పు

### - అమరావతి,నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌ల తాజా వేళలు

**గుంతకల్లు రైల్వే,మే 31,ప్రభాతవార్త** రాష్ట్రంలోని వివిధ రైల్వే స్టేషన్ల మీదుగా తిరిగే పలు రైళ్ల వేళలను ఆయా స్టేషన్‌లలో రైళ్ల రాకపోకలను సవరిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బెంగళూరు నుంచి మాల్దా టౌన్ వెళ్లే నెంబర్ 13433అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 3 నుంచి చీరాలలో అర్థరాత్రి 12-43/45,తెనాలి 1-33/35, విజయవాడ 2-30/40,ఏలూరు 3-33/35,రాజమండ్రి 4-33/35, సామర్లకోట 5-13/15,తుని 5-58/6-00కు బయలుదేరుతుంది. అగర్తల నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07029ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ 6నుంచి విజయవాడలో 11-35/45లకు, నర్సాపూర్ నుంచి హుబ్లీ వెళ్లే నెంబర్ 17225అమరావతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5నుంచి డోన్‌లో తెల్లవారుజామున 3-38/40(వర్కింగ్ టైం టేబుల్ ప్రకారం నంద్యాల 2-30/35,డోన్ 3-40/45)లకు, తిరుగు ప్రయాణంలో హుబ్లీ నుంచి నర్సాపూర్ వెళ్లే నెంబర్ 17226అమరావతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5నుంచి డోన్‌లో రాత్రి 8-08/10కు బయలు దేరుతుంది. (వర్కింగ్ టైం టేబుల్ ప్రకారం క్రిష్ణ కెనాల్ 3-40/42,విజయవాడ తెల్లవారు జామున 3-50/4-00గంటలకు బయలుదేరు తుంది). బెంగళూరు నుంచి నాందేడ్ వెళ్లే నెంబర్ 16593ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5నుంచి గుంతకల్లులో ఉదయం 6-25/35, ఆదోని 7-09/10,కుప్పగల్లు 7-21/22,కోసిగి 7-32/33,మంత్రాలయం 7-43/45,మట్మారి 7-54/55, రాయచూరు 8-08/10,క్రిష్ణా 8-30/40,సైదాపూర్ 8-59/9-00,యాద్గిర్ 9-18/20,నాల్వార్ 9-43/45లకు బయలు దేరుతుంది.

## రేషన్ వాహనాల రద్దుపై హైకోర్టులో పిటిషన్ - కౌంటర్ వేయాలని కోర్టు ఆదేశం

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంటి వద్దకు వెళ్లి రేషన్ నిత్యావసర సరుకులు అందించే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్‌విధానాన్ని రద్దు చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ జీవోను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై కౌంటర్ వేయాలని ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది. పౌర సరఫరాలశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఏపీ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ సీఎండీకి నోటీసులిచ్చింది. విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ఈమేరకు ఉత్తర్వులిచ్చారు. దివ్యాంగులు, వృద్ధులకు మినహా మిగిలిన వారికి జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల్లో నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డీలర్ల ద్వారా దివ్యాంగులకు, వృద్ధులకు ఇళ్ల వద్ద సరుకులు సరఫరా చేయనుంది. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఎండీయూ (మొబైల్ వాహనాలు) ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేసే విధానం వలన ప్రభుత్వంపై తీవ్ర ఆర్థిక భారం పడింది. అదే విధంగా గడప వద్దే సరుకులు ఇవ్వాలనే లక్ష్యం నెరవేరకపోవడంతో ఎండీయూ విధానాన్ని రద్దు చేస్తూ ఈనెల 23వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ రాజమహేంద్రవరానికి చెందిన టి.రామకృష్ణ, మరో ముగ్గురు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. వారి తరఫున న్యాయవాది రేగులగడ్డ వెంకటేష్ వాదనలు వినిపించారు. వాహనాల కొనుగోలుకు పిటిషనర్లు బ్యాంకుల ద్వారా రుణం తీసుకున్నారన్నారు. అకస్మాత్తుగా ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తే రోడ్డున పడతారన్నారు. కాగా కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి తిరిగి జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్దే సరకుల పంపిణీకి సిద్ధమైంది. మరోవైపు పేదలకు అందిస్తున్న నిత్యావసర సరకుల పంపిణీపై ఎంత నిఘా ఉంచినా ఎక్కడో ఒకచోట రేషన్ పక్కదారి పడుతోంది. దీంతో ప్రభుత్వం ని పౌరసరఫరాల యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిలో రేషన్ దుకాణం, డీలరు, ఏరియా తదితర వివరాలన్నీ నమోదు చేస్తారు ను చూసే వీలుంటుంది. నిత్యావసరాలు ఎంత కేటాయించారు, లబ్ధిదారులకు ఎంత పంపిణీ చేశారనే వివరాలు అన్నీ ఇందులో అందుబాటులో ఉంటాయి. దీని ద్వారా వచ్చిన సరకులకు, పంపిణీకి వ్యత్యాసాలు ఉంటే తెలిసిపోతుంది.

ప్రతినెలా 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అధికారులు తనిఖీలు నిర్వహిస్తారు. రాష్ట్రంలో బియ్యం మాఫీయా అనేది లేకుండా చేసేందుకే జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ చేపడుతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 29,760 రేషన్ డిపోల ద్వారా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు.

## వైద్యుల ముంగిటకే వైద్య మండలి

### - జిల్లా కేంద్రాల్లోనే రిజిస్ట్రేషన్‌లు

**విజయవాడ,మే 31,ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్య మండలి (ఏపీ మెడికల్ కౌన్సిల్) కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. తన సేవలను వైద్యుల ముంగిటకు తీసుకువెళ్ళేలా కార్యాచరణ ప్రారంభించింది. జూన్ 7,8 తేదీల్లో విజయనగరం లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో,14,15 తేదీల్లో విశాఖ లోని ఆంధ్రా వైద్య కళాశాలలో 21,22 తేదీల్లో కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఉదయం నుండి సాయంత్రం వరకు వైద్య మండలి అధికారులు అందుబాటులో ఉంటారు. ఆయా తేదీల్లో స్థానిక వైద్యులకు సంబంధించి రీ రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఈ-డాక్టర్ ఫ్రొఫఃల్ రిజిస్ట్రేషన్లు చేపట్టనున్నట్లు వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు వెల్లడించారు. మిగిలిన జిల్లాల్లో రిజిస్ట్రేషన్ జరిగే తేదీలు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. సీఎంసీ క్రెడిట్ పాయింట్లలో(రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ కోసం) 65-70 ఏళ్ళ వయసు ఉన్న వారికి 30 పాయింట్లకు 15 ఉంటే సరిపోతుంది. 71-80 ఏళ్ళ వారికి పది పాయింట్లు,81 ఏళ్ళు పైబడిన వారికి పూర్తిగా మినహాయింపు ఇచ్చాం. రద్దయిన రిజిస్ట్రేషన్ పునరుద్ధరణకు కూడ చర్యలు తీసుకుంటున్నాం.రిజిస్ట్రేషన్ రద్దై 10 ఏళ్ళు దాటితే 2025 ఆగస్టు 31 లోపు,5-10 ఏళ్ళు ఉంటే 2025 అక్టోబరు 31,1-5 ఏళ్ళ లోపు ఉన్నవారు 2025 డిసెంబరు 31 లోపు పునరుద్ధరించుకోవచ్చు. మండలి తరపున ఇంకొన్ని కొత్త సేవలు ప్రారంభించనున్నాం. అని శ్రీహరిరావుఒక ప్రకటనలో వివరించారు.

## ఆషాఢం సారె కార్యక్రమానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి: ఇఓ వికె శీనా నాయక్

**ఇంద్రకీలాద్రి, మే 31, ప్రభాతవార్త** బెజవాడ దుర్గమ్మవారి ఆలయంలో రాబోయే ఆషాడమాసం సారె సమర్పణ, శాకంబరి ఉత్సవాలు, శ్రావణ మాసం లకు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేయడంలో అన్ని శాఖల వారు సహకరించి సమన్వయంతో పనిచేయాలని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ వికె శీనా నాయక్ అన్నారు.


శనివారం ఆలయంలో జరిగిన పలు శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ దుర్గమ్మ ఆలయానికి వస్తున్న భక్తుల సంఖ్య పెరిగినందున పార్కింగ్ సమస్య నివారించడానికి తగినట్లుగా టోల్‌గేట్ వద్ద వున్న ఆక్రమణల తొలగింపుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వెస్ట్ ఏసిపి దుర్గారావు, వన్‌టౌన్ సిఐ గురుప్రకాష్, దేవస్థానం ఇఇ కోటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

- దుర్గమ్మ ఆలయంలో ఇకపై అంతా డిజిటల్:

దుర్గమ్మ ఆలయంలో ఇకపై నగదు రహిత చెల్లింపులకోసం డిజిటలైజ్ చేయడానికి ఏర్పాట్లు చేయాలని ఇఓ వికె శీనానాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన చాంబర్లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఆన్‌లైన్లో పూజాదికాలు జరుపుకున్న భక్తులకు త్వరగా ప్రసాదాలు అందించాలన్నారు. ప్రసాదాల కొనుగోలు, సేవా టికెట్ల కొనుగోలు తదితర అన్ని చెల్లింపులు ఇకపై నగదు రహితంగా జరగాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఐటి మేనేజర్ ప్రసాద్, దేవస్థానం ఇఇ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- దుర్గమ్మ సేవలో ఏపి రెవెన్యూ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ:

దుర్గమ్మవారిని శనివారం ఏపి రెవెన్యూ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ జి జయలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు ఇఓ వికె శీనా నాయక్ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



అధికారులతో చర్చిస్తున్న ఇఓ వికె శీనా నాయక్

- నిత్యాన్నదాన పథకానికి విరాళం:

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి పామర్రుకు చెందిన వైవి వేంకటేశ్వరరావు, పార్వతి దంపతులు రు.1లక్ష 116ల విరాళాన్ని శనివారం ఆలయాధికారులకు అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# తిరుమల సమాచారం

## భోగశ్రీనివాసుడికి సహస్రకలశాభిషేకం



**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని పంచబేరాలలో ఒకటైన భోగశ్రీనివాసమూర్తిని పల్లవరాణి సామవై ప్రతిష్టించిన రోజు గుర్తుగా ఆలయంలో భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్రకళశాభిషేకం నేడు నిర్వహించనున్నారు. ఆలయంలోపల గరుడాళ్వార్‌సన్నిధిలో శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి, భోగశ్రీనివాసమూర్తిని, విశ్వక్సేనులనుకొలువుదీర్చారు. శ్రీనివాసమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో అబిముఖంగా కౌతుకమూర్తి భోగశ్రీనివాసమూర్తిని ,ఆయనకు అభిముఖంగా విశ్వక్సేనుల వారిని ఉంటారు. భోగశ్రీనివాసమూర్తికి నిర్వహించే అభిషేకాది క్రతువులు మూలమూర్తికి నిర్వహించినట్లు అవుతుంది.

## జూన్ 2నుండి ఎస్వీ సంగీత నృత్య కళాశాల నాదస్వర ప్రవేశాలకు దరఖాస్తులు

**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్యకళాశాల,ఎస్వీ నాదస్వరం డోలు పాఠశాలలు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.జూన్ 2నుండి ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుచేసుకోవాలని టిటిడి తెలిపింది. జూన్ 27వతేదీ నుండి కళాశాలల్లో తరగతులు ప్రారంభమవుతాయి. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు కార్యాలయ పనివేళల్లో, టిటిడి పేరుతో 50రూపాయలు డిడి తీసి దరఖాస్తు పొందాలి. రెగ్యులర్ కోర్సులకు 8వతగరతి ఉత్తీర్ణత ఉండాలి. సాయంత్రం కోర్సులకు 5వతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో 9440793205,9848374408నంబర్లలో సంప్రదించాలని టిటిడి తెలిపింది.

## తప్పు చేశాను.. క్షమించండి - భక్తుడు క్షమాపణ



**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో శ్రీవారి దర్శనానికి విపరీతంగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూలైన్లలో వేచివున్న భక్తుల్లో ఒకరు కాకినాడకు చెందిన అచ్చారావు క్యూలైన్లో టిటిడి తీరుపై ఆందోళనతో నినాదాలు చేశారు. ఏకంగా టిటిడికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో దుమారం రేపింది. అయితే చాలామంది భక్తులు క్యూలైన్లలో ఉండటంతో ఆయన కూడా జ్వరంతో బాధపడుతూ అస హనానికి గురయ్యాడు. దీంతో టిటిడికి వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. శనివారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకున్న తరువాత ఆలయం వెలుపలకు వచ్చి భక్తుల రద్దీ, టిటిడి సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశాడు. తెలియక తప్పుచేశానని, అనారోగ్యంతో ఇలా చేయాల్సి వచ్చిందని, తనను క్షమించమని కోరాడు. టిటిడి సిబ్బంది సేవాభావంతో సేవలందిస్తున్నారని తెలిపారు.

## భక్తులను రెచ్చగొట్టి విడియో చిత్రీకరించేవారిపై చర్యలు

### - సిబ్బంది ఇతోధిక సేవలు - క్యూలైన్లలో సౌకర్యాలపై ఇఒ వెంకయ్య పర్యవేక్షణ



**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులు ముగింపుకు చేరుకున్న సమయంలో..వారాంతం వరుసగా రెండురోజులు సెలవులు కావడంతో లక్షలామంది భక్తులు ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామి దర్శనానికి క్యూలైన్లలో పోటెత్తుతున్నారు. భారీగా భక్తులు తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాలు, మహారాష్ట్ర,కేరళ రాష్ట్రాల నుండి తరలివచ్చి చేరు కుంటుండటంతో తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్ లు,నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. ఆలయం వెలుపల క్యూలైన్లు మూడుకిలోమీటర్లు శిలాతోరణం వరకు చేరాయి. దీంతో వెంకన్న సాధారణ సర్వదర్శనానికి (ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేనివారికి)320గంటలు సమయం కేటాయిస్తున్నారు. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 8గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఆరేడు గంటలు సమయం కేటాయిస్తున్నారు. పెరిగిన విపరీత రద్దీతో వెలుపల క్యూలైన్లలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. నిరంతరాయంగా అన్నప్రసాదాలు, అల్పాహారం, పాలు,మజ్జిగ,మంచినీరు సరఫరా జరుగుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా డిప్యూటీ ఇఒ సోమన్నారాయణను నియమించి శ్రీవారి సేవకులతో అంకితభావ సేవలందిస్తున్నారు. విపరీతంగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం ఉదయానికి కొండంతా జనంతో కిటకిటలాడుతోంది. వేసవిసెలవులు కారణంగా తిరుమలలో విపరీతంగా రద్దీ ఉంది. శిలాతోరణం దగ్గర సర్వదర్శనం క్యూలైన్లు మొదలవుతున్నాయి. ఇక్కడ భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించడం, క్యూలైన్లలో అన్నప్రసాదాలు, తాగునీరు. మజ్జిగ పంపిణీపై, భక్తులు క్యూలు కదలడం స్వయంగా శనివారం ఉదయం గంటసమయంపైగా అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి గమనించారు. శ్రీవారి దర్శనం కోసం విచ్చేస్తున్న భక్తులకు అహర్నిశలు ఉద్యోగులు, సిబ్బంది,శ్రీవారిసేవకులు రాత్రింబవళ్ళు కృషి చేస్తున్నారు. భక్తులను రెచ్చగొట్టి వీడియోలు చిత్రీకరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన క్యూలైన్ల వద్ద హెచ్చరించారు. వేసవిసెలవులతో ప్రతిరోజూ లక్షమందికిపైగా భక్తులు తిరుమలకు వస్తున్నారని, వారాంతంలో 1.20లక్షలు దాటుతోందన్నారు. సామాన్యభక్తులకే దర్శనాల్లో పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రతిరోజూ 60శాతానికి పైగా సర్వదర్శనానికి విచ్చేసే భక్తులే స్వామివారిని దర్శించుకుంటున్నారని అదనపు ఇఒ చౌదరి తెలిపారు. శ్రీవారి సిబ్బంది సేవలకు, ఉద్యోగుల కష్టాన్ని తెలుసుకోకుండా పవిత్రతను,సేవలను దెబ్బతీసేలా కొందరు ఇలా ప్రవర్తించడం సరికాదని అన్నారు. ఓ భక్తుడు చేసిన వివాదాస్పద నిరసనలతో చివరకు ఆయన తప్పును తెలుసుకుని క్షమాపణ తెలిపాడని వెంకయ్యచౌదరి మీడియాకు చెప్పారు. కాగా శనివారం సాయంత్రం వరకు 55వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

## నేటి నుంచి రైల్వేలో జమ్మూ కేంద్రంగా కొత్త డివిజన్

### - భారత రైల్వే చిత్రపటంలో మరో డివిజన్
### - గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం

**గుంతకల్లు రైల్వే,మే 31,ప్రభాతవార్త** భారతీయ రైల్వేలో జూన్ 1(నేటి) నుంచి కొత్త డివిజన్‌గా జమ్ము తావి ప్రారంభమైంది. ఈమేరకు కేంద్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది జనవరిలో రైల్వే మంత్రిత్వ శాఖ ఈ మేరకు ప్రాజెక్టు సమగ్ర నివేదికను(డిపిఆర్)ను సిద్ధం చేసి పంపమని నార్థన్ రైల్వే జనరల్ మేనేజర్‌కు ఆదేశించిన విషయం వార్త పాఠకులకు విధితమే. వివరాల్లోకి వెళితే భారతీయ రైల్వే 17జోన్లు ఉండగా, వీటిలో మొత్తం 68డివిజన్లలో పంజాబ్, జమ్మూకాశ్మీర్,హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు కలిపి మొత్తం 1,849,95రూట్ కి.మీలతో ఫిరోజ్ డివిజన్ పని చేస్తోంది. నేటి నుంచి ప్రారంభం కానున్న జమ్మూతావి రైల్వే డివిజన్‌లో ఫిరోజ్‌పూర్ డివిజన్ పరిధిలోని 742కి.మీలను విడదీసి జమ్మూ కేంద్రంగా కొత్తగా రైల్వే డివిజన్‌ను కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పునర్ వ్యవస్థీకరణలో ఫిరోజ్‌పూర్ డివిజన్ పరిధిలో 21సెక్షన్‌లు ఉండగా వాటిలో నుంచి పఠాన్ కోట్-జమ్ము-ఉద్ధంపూర్-శ్రీనగర్-బారాముల సెక్షన్‌లోని 423రూట్ కి.మీలతో పాటు భోగ్‌పూర్-సర్వాల్-పఠాన్‌కోట్ సెక్షన్‌లోని 87కి.మీలు, బటలా-పఠాన్ కోట్ సెక్షన్‌లోని 68కి.మీలు, పఠాన్‌కోట్-జోగింధర్ నగర్(నారోగేజ్) సెక్షన్‌లోని 164కి.మీలు వెరసి మొత్తం 742కి.మీలతో జమ్మూ కేంద్రంగా జమ్ముతావి రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్రం తన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీంతో నార్థన్ రైల్వే జోన్ పరిధిలో ప్రస్తుతం ఐదు డివిజన్‌లు ఉండగా కొత్తగా ఏర్పడనున్న జమూ ్మ డివిజన్‌తో వీటి సంఖ్య ఆరుకు చేరింది. ఇదిలా ఉండగా కొత్త డివిజన్ ఏర్పాటుతో గ్రూప్-సి,గ్రూప్-డి,క్యాడర్ ఉద్యోగుల సంఖ్యలో ఆప్షన్స్, బదిలీలు తప్ప పెద్దగా మార్పు ఉండకపోగా అధికారుల సంఖ్య మాత్రం పెరుగనుంది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కాలంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురు గాలులకుమామిడి రైతులను తీవ్రనష్టాల పాల్జేశాయి.పలు జిల్లాల్లో కురిసిన వడగండ్ల వానలు,ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. చెడగొట్టు వానకు చేతికొచ్చిన పరిపంట నేలకొరగడంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ రెండు రాష్ట్రాల్లో అకాల వర్షాలు, వడగండ్ల వానలకు తోడు గాలిదుమారానికి చేతికొచ్చిన మామిడి నేలపాలై రైతాంగం నష్టాల పాలయ్యారు. అసలే సీజను ప్రారంభంలో వాతావరణంలో వచ్చిన మార్పులు మామిడి రైతులకు శాపంగా మారాయి.శీతాకాలంలో వడగండ్లవర్షాలు, పొగమంచు, ఉష్ణోగ్రతల మార్పులతోమామిడి చెట్లకు పూతరాలేదు.కొన్నింటి పూత వచ్చినప్పటికీ ఎక్కువభాగం రాలిపోయింది. ప్రధానంగా మామిడి తోటలకు వైరస్ వ్యాపించింది. దీంతో మామిడిచెట్లపై పూతరాలేకపోవడం, పూసిన పూత కూడా రాలిపోయింది. గత కొన్నిరోజులుగా ప్రతీరోజూ కురుస్తున్నవానలు కాయలను దెబ్బతీస్తున్నాయి. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో ఏంచేయాలో పాలుపోక సతమతమవుతున్నారు. ఫిబ్రవరి నుండి ఎండల తీవ్రత పెరిగి నీటిఎద్దడితో చిరుకాయ దశలో ఉన్న మామిడి తోటలు అంతంత మాత్రంగా దిగుబడి రాగా, ఈ అకాల వర్షాలు సగానికి పైగా కాయలు నేలరాలడంతో రైతులుకష్టాల్లో మునిగిపోయారు. అంతేకాకుండా నెల రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రత సాధారణం కన్నా దాదాపు ఏడు డిగ్రీలవరకూ నమోదుకావడం, ఉదయంపూట పొగమంచు విపరీతంగా కురుస్తుండడం మామిడిపూతపై నల్లపు రంగు మచ్చలు సైతంఏర్పడి పూతదశలోనే తోటలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు మిరప రైతులను నట్టేటముంచిన తామరపురుగు మామిడి తోటలకు వ్యాపించడంతో పెద్దఎత్తున పెట్టుబడులను నష్టపోయారు.ఇప్పుడు వర్షాలతోనేలరాలిన మామిడి కాయలను మార్కెట్లకు తరలిస్తున్నా రైతులకు టన్నుకు 15 వేల రూపాయల ధర కూడా అందని పరిస్థితి నెలకొంది.

# మామిడి రైతులకు అకాల దెబ్బ

**సిహెచ్ వి వి రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మందు వేసవిలో అకాల వర్షాలు అన్నదాతలను కుదేలు చేస్తున్నాయి. సీజన్ కాని సీజన్‌లో కురుస్తున్న వర్షాలు రైతులను ఆగమాగం చేశాయి. రెక్కలు ముక్కలు చేసుకుని కంటికి రెప్పలా కాపాడిన పంట చేతికందే సమయంలో దెబ్బతినడంతో విలపిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక, పూత రాలడం, అకాల వర్షాలు, వడగండ్ల వానలు దిగుబడిని చాలావరకూ దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా ఏటా మామిడి రైతులకు నష్టాలే మిగులుతుండగా, ఈసారి కూడా రైతు పరిస్థితి అలాగే ఉంది. కనీసం పెట్టుబడులు కూడా చేతికివచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం మామిడి తోటలుకాపు మీద ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్ల వానలతో సాగైన పంటల్లో ముఖ్యంగా కోతకు వచ్చిన మామిడి రాలిపోగా, ఈదురు గాలులకు చెట్లు కూలిపోయాయి. మామిడి సీజన్‌కు మే నెల అనుకూలం. ఇదే సమయంలో మంచి ధరలతో మిలమిల్లాడాల్సిన మామిడి రైతులకంట తడిపెడుతున్నారు. సీజను ప్రారంభంలో వాతావరణప్రభావం, మంచు కారణంగా ఇప్పటికే మామిడి తోటలకు 15 శాతం కూడా పూతరాలేదు. పూత, పిందెదశలో కురిసిన మంచుతో బూడిద తెగులు, తేనె మంచు ఆశించి నష్టం జరిగింది. దీనికి తోడు మామిడి చెట్లకు తామర పురుగు వైరస్ వ్యాపించడంతో పూత రాలేదు. అంతంత మాత్రంగా ఉన్న ఆ పూతకూడా రాలిపోయింది. వైరస్ వ్యాపించడంతో మామిడి చెట్లకు పూత నిలవక పిందెలు కాక దిగుబడి భారీగా తగ్గిపోయింది. అంతే కాకుండా మామిడికి తేనె మంచు పురుగు ఆశించి నల్ల మచ్చలు ఏర్పడి కాయనాణ్యతా దెబ్బతింది. దీనికి తోడు, ఇప్పుడు గత కొన్ని రోజులుగా అకాల వర్షాలు మామిడి రైతులను కోలేని దెబ్బతీశాయి. ఇరవై రోజుల కిందట వివిధ జిల్లాల్లో వడగళ్ల వర్షాలు కురిశాయి. ఈ కారణంగా పండు ఈగ ఉధృతి అధికమైంది. పక్వానికి వచ్చే సమయం కావడంతో చెట్లపైనే కాయలు పాడవుతున్నాయి. పండ్లుగా మారి విపరీతంగా పడిపోతున్నాయి. కాయలు తెంపి మాగబెడుతున్నా లోపల పురుగులు కనిపిస్తున్నాయి. దీంతో మార్కెట్‌కు తరలిస్తున్నా ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. తెలంగాణ మొత్తం మీద 3.20 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. తద్వారా ఎకరానికి 4వేల టన్నులచొప్పున 12,70,364 టన్నుల మేర దిగుబడివస్తోంది. అయితే వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాలకు 7 లక్షల టన్నులు కూడా వచ్చే పరిస్థితిలేదు. ఒక్క వికారాబాద్ జిల్లాలోనే మామిడి తోటల సాగు 13,150 ఎకరాలు కాగా, ఈ సారి దిగబడి



అంచనా. 43,550 టన్నులు అయితే అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లవానలు, తెగుళ్లువంటి వాటితో29,460 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. అకాల వర్షాలు ఉమ్మడి వరంగల్ జిల్లా మామిడి రైతులకు అపార నష్టాన్ని మిగిల్చాయి. ఈదురు గాలులు, వర్షాలకు మామిడి నేలరాలిపోతున్నాయి. ఈ క్రమంలో ఖమ్మం, మహబూబాబాద్, జనగామ, వరంగల్ తదితర జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో ప్రధానంగా కోతకు వచ్చిన మామిడి కాయలు రాలాయి. చెట్టుకు ఉన్న కాయలన్నీ నేలరాలాయి. సిద్ధిపేట జిల్లాలో 1,141 ఎకరాల మామిడి దెబ్బతింది. కరీంనగర్ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షానికి మామిడి రైతులునష్టపోయారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌లో ఈదురుగాలులకు మామడి కాయలు రాలిపోయాయి. నిర్మల్ జిల్లాలో ఈదురు గాలులతో పాటు, రాళ్లవర్షం కురియడంతోకోతకు వచ్చిన మామిడి దెబ్బతిన్నాయి. తెలంగాణలోని ప్రధానమైన బాటసింగారం మార్కెట్‌కు మామిడిని రైతులు తరలిస్తున్నారు. గత నెలలో టన్ను కాయల ధర రూ.30వేల నుండి రూ.40 వేల వరకూ పలకగా, ప్రస్తుతం ధరలు అమాంతం పడిపోయి కాయ నాణ్యతను బట్టి రూ.15 వేలు నుండి రూ.30 వేల లోపు పలుకుతున్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. దీనికితోడు పదేళ్లకు పైబడిన చెట్లు కూడా వేరుకుళ్లు తెగులు ఆశించి ఎండిపోతున్నాయి. ఏటా పూత పూసింది మొదలు, కాయలు కోతకు వచ్చేవరకూ మామిడి రైతులు పెట్టుబడి రూపంలో రూ.25 వేల నుండి రూ.30వేలవరకూ ఖర్చు చేస్తున్నారు. ఇక పలువురు రైతులు మామిడి తోటలను కౌలుకు తీసుకున్నారు. తోట వయసును బట్టి ఇసుక నేలల్లో ఎకరా రూ.30 వేల నుండి రూ.40 వేల వరకూ,ఎర్రనేలల్లోని తోటలను ఎకరానికి రూ.15 వేల నుండి రూ.25 వేలవరకూ కౌలుకు తీసుకున్నారు. ఈ ఏడాది మామిడి కాయలకు మంచి గిరాకీ ఉంటుందని రైతులు భావించారు. దీంతో ఎక్కువ ధరలకు తోటలు కొనుగోలు చేశారు. అయితే వాతావరణ మార్పులు, వైరస్ వ్యాపించడం తదితర కారణాలతో పూత రాక, వచ్చింది నిలవక రాలిపోతుండడంతో ఏమి చేయాలో అర్థం కాక రైతులు, ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల్లో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడ మామిడికాయలు గాలివానకు రాలిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలలతో పాటు, చిత్తూరు జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కూడా చిత్తూరుతోపాటు పలమనేరు, బంగారుపాళ్యం, యాదమరి మండలాల్లో వర్షం కుర వడంతోపాటు బలమైన ఈదురు గాలులు వీచాయి. ఈ ప్రాంతాల్లోని మామిడి కాయలు నేల రాలాయి. ఇప్పటికే పెనుమూరు, యాదమరి, చిత్తూరు రూరల్, గుడిపాల, పలమనేరు, ఐరాల,తవణంపల్లె మండలాల్లో 435 ఎకరాల్లో మామిడితో పాటు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో మామిడి, అరటి పంటలు దెబ్బతిన్నాయి. విజయవాడ రూరల్ మండలంలో నష్టం ఎక్కువగా జరిగింది. అసలే పూత ఆలస్యం కావడంతో అకాల వర్షాలకు మామిడి రైతులు మరింత నష్టాలపాలయ్యారు. కాయలు దశకు తోటలు చేరుకోవడంతో గాలివానకు రూరల్ మండలంలో 50 ఎకరాల్లో తోటలకు నష్టం వాటిల్లింది. 10 శాతం మామిడికాయలు గాలివానకు రాలిపోయాయి. కాగా ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించనున్నట్లు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. గతంలో కూడా రాష్ట్రంలో అకాల వర్షాలు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందజేసింది. పంటలు దెబ్బతిన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు చొప్పున పరిహారం అందించింది. ఈసారి కూడా అదే తరహాలో నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందజేయనుంది. అయితే వర్షాలు, వడగళ్ల వాన కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.20 వేలు పరిహారం చెల్లిస్తేనే కాని రైతులు కోలుకునే పరిస్థితి లేదు. ●

కర్ణాటక

# వివాద 'నాయగన్'!

**ఎ.వి.వి ప్రసాద్**

పెదవి దాటితే పృథివిదాటుతుందంటారు. కాలుజారితే వెనక్కి తీసుకోగలం కానీ నోరు జారితే తీసుకోలేం కదా! ప్రముఖ తమిళ నటుడు కమల్ హాసన్ ఇప్పుడు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు.'తమిళం నుంచి కన్నడం పుట్టింది' అంటూ ఆయన చేసిన వ్యాఖ్య కన్నడ నాట తీవ్ర వ్యతిరేకతను సృష్టించడమే గాక ఆయన సినిమాలను రాష్ట్రమంతా నిషేధించే సంక్షోభాన్ని కూడా తెచ్చింది. మణిరత్నం దర్శకత్వంలో కమల్ కొత్త సినిమా 'థగ్ లైఫ్' జూన్ ఐదవ తేదీన తమిళనాడు, కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచమంతా విడుదల కావలసి ఉండగా, కర్ణాటకలో మాత్రం నిషేధానికి గురైంది. వారం రోజుల క్రితం ఆ చిత్రం ఆడియో విడుదల చెన్నైలో జరిగిన సందర్భంగా కార్యక్రమానికి ప్రముఖ కన్నడ నటుడైన శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. కమల్ ఆ సందర్భంలో అటువంటి వ్యాఖ్యలు చేయడంతో అది మరింత వివాదాస్పదంగా మారింది.'కన్నడ కంఠీరవ' డా. రాజ్‌కుమార్ ఉన్న కాలంలో కన్నడ భాష మీద ఈగ వాలినా సహించని పరిస్థితి కనిపించేది. అలాగే తమిళనాట కరుణానిధి, ఎమ్జీఆర్ ఉన్న కాలంలో భాషాపరమైన ఉద్యమాలు అనేకం జరిగినసందర్భాలు కూడా ఉన్నాయి. చివరికి కావేరీ జలవివాదం తలెత్తినా అది భాష రంగునే చివరకు అద్దుకొనేది. తాజా వివాదం కూడా అటువంటి రంగునే ఇప్పుడు అద్దుకొంటున్నట్లు కనిపిస్తోంది. బహుళ ప్రజాదరణపొందిన సినిమాలు కమల్‌కు చాలానే ఉన్నాయి. తమిళనాటనే గాక కర్ణాటక,ఉభయ తెలుగు రాష్ట్రాలు, కేరళ, హిందీరాష్ట్రాల్లో కూడా ఆయనకు ఫాలోయింగ్ ఎక్కువే. తమిళంలో తీసిన ఎన్నో చిత్రాలు దక్షిణాది భాషలన్నిటిలో డబ్ అయి సూపర్ హిట్‌లయ్యాయి. ఆ కారణంగా దక్షిణాది భాషల వారందరికీ కమల్ చిరపరిచితుడే. ఆయన మాట్లాడింది చెన్నైలో నైనా వేదిక మీద శివరాజ్ కుమార్ కూడా ఉండడం,ఆ సందర్భంగా కమల్ ఆ వ్యాఖ్య చేయడంతో అది కొన్ని క్షణాల్లోనే రాష్ట్రమంతా దవానలంలా వ్యాపించింది. కమల్ కన్న డిగులకు కూడా అత్యంత సన్నిహితుడే. రాజ్‌కుమార్ కమల్‌ను సొంత సోదరునిలా భావించేవారు. ఎంతో సుహృద్భావ వాతావరణం అన్ని భాషల వారిమధ్య కనిపించేది. నిజానికి ఇప్పుడు కూడా గందరగోళ పరిస్థితి ఏదీలేదనే చెప్పాలి. అగ్రనటులు ఒకే వేదికపై కనిపించినా వారిమధ్య భాషాభేదాలు ఎప్పుడూ రావు. అందరూ అన్ని భాషలూ మాట్లాడగలరు. ఎన్టీఆర్, ఎఎన్నార్ చెన్నైలో ఉన్నా, బెంగళూరువెళ్లినా అక్కడి స్థానికుల మాదిరిగానే వ్యవహరించడంతో రాజ్ కుమార్, ఎన్టీ ఆర్, ఎఎన్నార్, ఎమ్జీ ఆర్, శివాజీ అందరూ సోదరుల్లా ఉండేవారు. తర్వాత రజనీకాంత్, కమల్, శివరాజ్ కుమార్, ఉపేంద్రలు కూడా అంతే. ఎక్కడికి వస్తే అక్కడ ఆ భాషా కుటుంబమే అనిపిస్తారు.తానుచేసిన వ్యాఖ్య కూడా అటువంటి సదుద్దేశ్యం, ప్రేమాభిమానాలతోనే అనీ, వివాదం సృష్టించడానికి కాదనీ



కమల్ హాసన్

కమల్ చెబుతున్నామొత్తం ఎపిసోడ్ కర్ణాటకలో భాషా వివాదం రంగునే పులుముకోవడం విచారకరం. కర్ణాటక సిఎం సిద్ధరామయ్య 'కమల్‌కు చరిత్ర తెలీదు. తెలియని విషయాలపై వ్యాఖ్యలు చేయడం తగదు' అంటూ రంగంలోకి దిగడంతో కన్నడ రక్షణ వేదిక కూడా జూలు విదిల్చింది. మరికొన్ని కన్నడ సంఘాలు కూడా బరిలోకి వచ్చేసాయి. దానితో చిన్నవ్యాఖ్య పెనువివాదంలా మారిపోయింది. కమల్ క్షమాపణ చెప్పకపోతే ఆయన సినిమాలపై నిషేధం విధిస్తామని హెచ్చరించిన కర్ణాటక ఫిలింఛాంబర్స్ అన్నంత పనీ చేసింది. మైసూరు, బెళగావి, హుబ్బళ్లి, బెంగళూరుతో పాటు అనేక ప్రాంతాల్లో కమల్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తునే ఆందోళనలు మొదలయ్యాయి. దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తున్నారు. పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. ఈలోగాకొన్ని తమిళ సంఘాలు కూడా కన్నడ సంఘాలకు వ్యతిరేకంగా చెన్నైలో ఆందోళనలు మొదలుపెట్టడంతో ఆ చిన్న వ్యాఖ్య రెండురాష్ట్రాల మధ్య వివాదంలా మారిపోతోంది. సిద్దరామయ్యకు మరికొందరు మంత్రులు వంత పాడడంతో ఇది రాజకీయ వివాదంగా కూడా మారుతోంది. అంత వివాదం వద్దనీ, భాష పుట్టుక, చరిత్ర గురించి భాషావేత్తలు, చరిత్రకారులు చూసుకుంటారనీ, సినిమా నటులు, రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలు సాధారణమైనవేనని కూడా కమల్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఒకసినిమా ఆడియో ఫంక్షన్ గనుక, పక్కన కూర్చున్నది రాజ్ కుమార్ తనయుడైన శివరాజ్ కుమార్ గనుక ఆప్యాయత తోనే కమల్ మాట్లాడి ఉండవచ్చు. కానీ తమిళం నుంచి కన్నడం పుట్టిందనే వ్యాఖ్యచేయకపోయి ఉంటే ఇంత అలజడి వచ్చి ఉండేది కాదనిపిస్తుంది. కన్నడం, తెలుగు, తమిళం, మలయాళం ఒకే ద్రావిడ భాషా కుటుంబంలోని స్వతంత్ర భాషలు. తమిళం, మలయాళం మధ్య, కన్నడం, తెలుగు మధ్య కొన్ని సోదర పోలికలు కనిపిస్తాయి కానీ ఏ భాష నుంచి మరో భాష పుట్టలేదని భాషా శాస్త్రం తెలిసిన వారెవరైనా తేలికగానే చెబుతారు. శివరాజ్ కుమార్ పక్కన ఉండడంతో ఏదో యధాలాపంగా కమల్ ఆ వ్యాఖ్యచేసి ఉండొచ్చు కానీ ఆయనకు ఆ మాత్రం తెలియదని అనుకోవడానికి లేదు. గత నాలుగైదు దశాబ్దాలుగా కన్నడ, తమిళ రాష్ట్రాల మధ్య ఎన్నో వివాదాలను, విభేదాలను ఆయనా గమనించిన వారే. పైగా ఓ పార్టీకి అధినేత కూడా. అన్నీ తెలిసి వివాదాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తారని అనుకోలేం కదా! కన్నడ సంఘాలు సంయమనం పాటించాలి .ఆ వ్యాఖ్య వల్ల తలెత్తిన వివాదానికి స్వస్తిపలికి కన్నడ, తమిళ సోదరులు ఎప్పటిలా సుహృద్భావంతో వ్యవహరించడం ఎంతైనా అవసరం. రాజకీయ నాయకులు తలదూర్చకపోతే ఏదీ వివాదంగా మారదనేది బహిరంగ రహస్యమే. కన్నడ కస్తూరి,తెలుగుతేనియ, తమిళ తాంబూలం అన్నీ అందరికీ అవసరమైనవే. మరి వివాదాలు ఎందుకు? ●

అమెరికా

# ఐక్యరాజ్యసమితికి ఆర్థిక సంక్షోభం!

**గన్ని మోహన్**

ప్రపంచ వ్యాప్తంగా యుద్ధోన్మాదం వీడి తోటి దేశాలతో శాంతి సామరస్య వాతావరణంతో ముందుకుపోవాలన్న లక్ష్యంతో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటైన ఐక్యరాజ్యసమితి ఇప్పుడు నిధుల కొరతను ఎదుర్కొంటున్నది.రెండోప్రపంచ యుద్ధం తర్వాత 1944లో మొత్తం 50దేశాల ప్రతినిధులు అత్యవసరంగా సమావేశమై ఒక విశ్వవేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో 51వ దేశంగా పోలండ్ కూడా అప్పట్లో వచ్చిచేరింది. మొత్తం 1945 జనవరి 26నుంచి ఐక్యరాజ్యసమితి ఏర్పాటైంది. అప్పటి నుంచి దేశాలు సభ్యత్వం పొందుతూనే ఉన్నాయి.దేశాల మధ్య సయోధ్య కుదర్చడం, సరిహద్దుల వివాదాలు పరిష్కారం, చర్చలు దౌత్యమార్గాల్లోనే పరిష్కార వేదికలు ఏర్పాటు, ప్రత్యేక భద్రతా మండలితో ఉగ్రవాదం, హింస నిర్మూలను కృషి చేయడం వంటి లక్ష్యాలతో ఈ సమితి ఆవిర్భవించింది. ప్రస్తుతం ఈ సమితిలో సభ్యత్వం కలిగిన 193కిపైగా దేశాలు ఏటా సమితికి నిధులను కూడా అందిస్తాయి. సర్వప్రతినిధులసభ, భద్రతా మండలి, ఆర్థిక సామాజిక మండలి, ట్రస్టీషిప్ మండలి, అంతర్జాతీయ న్యాయస్థానం, సమితి అంతర్జాతీయ సచివాలయం వంటివి ఉండటంతోపాటు మానవహక్కుల విభాగం, మానవతా సహాయసూచీ మండలి వంటివి వీటిలో విభాగాలుగా పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగిన అమెరికా 22శాతం చెల్లించాలి. ఇటీవలే చైనా కూడా సమితికిచెల్లించే వాటాను 20 శాతానికి పెంచింది. మొత్తం 193 దేశాల్లో 152 దేశాలు తమ నిధుల బకాయిలను చెల్లించాయి. కానీ ఇప్పటికీ అమెరికాతో సహా41 దేశాలు బకాయిలతోనే ఉన్నాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చాక అంతర్జాతీయ సంస్థల్లోఅమెరికా భాగ స్వామ్యం, నిధుల అందచేత వంటివాటిని సమీక్షించాలని నిర్ణయించారు. అప్పటి నుంచి బకాయిలు నిలిచిపోయాయి. సమితికి ఏటా 3.72 బిలియన్ డాలర్ల బడ్జెట్ ఇప్పుడు అనివార్యంగా కుదింపునకు గురవుతోంది. దీనివల్లనే సమితిలోసుమారు 60కిపైగా ఐక్యరాజ్యసమితి కార్యాలయాలు, ఏజెన్సీలు జూన్ మధ్యస్తం నాటికి 20శాతం సిబ్బందిని తగ్గించేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ కుదింపుజనరల్ బడ్జెట్‌లోకి వచ్చే సుమారు 14వేల పోస్టులపై ప్రభావం పడుతుంది. అంటే కనీసం 2800 పోస్టులకు గండిపడు తోంది. వీటితో సమితి రాజకీయ, మానవతా కార్యాలయాల్లోని సిబ్బంది, శరణార్థులకు సహాయం చేయడం, లింగ సమానత్వం ప్రోత్సహించడం అంతర్జాతీయ వాణిజ్యం, పర్యావరణ పరిరక్షణ, నగరాలతో సమన్వయం చేసుకుని సంయుక్తంగా కృషిచేయడం వంటి కీలక బాధ్యతల నిర్వహణకు ఇప్పుడు నిధుల సమస్య అడ్డంకిగామారింది. ఇప్పుడు మరు భూమిగామారుతున్న పాలస్తీనా శరణార్థులకు మద్దతు ఇచ్చే యుఎన్ ఏజెన్సీతోపాటు ఐక్యరాజ్యసమితి శరణార్థుల సహాయ ఏజెన్సీలకు కూడా ఈనిధుల కొరత



ఐక్యరాజ్యసమితి

సమస్య ఎదురవుతోంది. ప్రస్తుత సెక్రటరీ జనరల్ ఆంటోనియో గ్యుటరెస్‌యునైటెడ్‌నేషన్స్ 80 పేరిట ఉన్నసమితి రాజ్యాంగ అధికరణాలను తప్పని పరిస్థితుల్లో అమలు చేయాల్సివస్తోంది. కనీసం ఏడు సంవత్సరాలుగా ఐక్యరాజ్యసమితి వనరులు తగ్గిపోయినట్లు తెలుస్తోంది. ఇందుకు ప్రధానకారణం సభ్యదేశాలు తమ బకాయిలను చెల్లించలేకపోవడమే. ఇందుకోసం ఇప్పటినుంచే సమితి పొదుపు మంత్రం పాటిస్తోంది.ఏయే పోస్టులు తగ్గించాలో ఏజెన్సీల అధిపతులకు మార్గదర్శకాలు ఇస్తోంది. సలహాలు ఇస్తోంది. సమర్థత ఆధారంగా విధులు అంచనావేసి ఆపోస్టులు మాత్రమే కొనసాగించాలని, పరిస్థితుల ప్రభావం ఆధారంగా ప్రాధాన్యత ఇవ్వాలని, ఏకీకరణ లేదా రద్దుకోసం అవసరమైన ప్రతిపాదనలు అందించాలనిసర్క్యులర్లు కూడా వెళ్లాయి. నిధుల లేమితో సతమతమవు తున్న ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన ఈకోతల జాబితాలను వచ్చే నెల 13నాటికే అందించాలని కంట్రోలర్‌కు అందచేయాలని సెక్రటరీ జనరల్ సూచనల్లో ఉంది. 2026 బడ్జెట్‌లో వాటిని చేర్చితే ఇక ఐక్యరాజ్యసమితికి సాలీనా అందించే నిధుల్లో కూడా కోత మరింతపడుతుంది. సమితిలో ప్రధానంగా అంతర్జాతీయ న్యాయస్థానం, శాంతిపరిరక్షక దళాలవిభాగం, మానవతాసాయం విభాగాలే కీలకంగా ఉంటాయి. వీటిపైనే ఈ నిధుల కోత ప్రభావం పడుతోంది. ప్రధానంగా అమెరికా కనుక నిధుల కేటాయింపు నిలిపివేస్తే కీలక విభాగాలపై ఈప్రభావం పడుతుంది. ఇప్పటికే ప్రపంచ ఆరోగ్యసంస్థ నుంచి వైదొలిగిన అమెరికాసమితికి నిధులు నిలిపివేస్తే ఇకయూఎన్ నుంచి తొలిగినట్లే భావించాలి. అయితే ట్రంప్ చేష్టలను ప్రపంచం ఒకింత గమనిస్తూనే ఉంది. ఐక్యరాజ్యసమితి నిరంతరం పనిచేసే వేదికగా సంక్లిష్ట బాధ్యతలను నిర్వహిస్తోంది. ఒకవేళ అమెరికా నిలిపివేసినా ఇతర దేశాలు వీటిబాధ్యతలను భుజానకెత్తుకునే అవకాశాలు లేకపోలేదు. ప్రపంచ ఆహార పథకం విభాగం సిబ్బందిలో 30శాతం వరకూ కోతపడుతోంది. అలాగే యూఎన్ శరణార్థి సంస్థ, యుఎన్ మానవహక్కుల సంస్థల్లో కూడా 30శాతం వరకూ ఖర్చులు తగ్గిస్తున్నాయి. సీనియర్ స్థాయి పదవుల్లో కూడా 50శాతం కోతపడుతోంది. ఇక చిన్నారుల సంరక్షణ విభాగం యునిసెఫ్, యుఎన్ మానవతా సంస్థ ఒసిహెచ్ఎ వంటి ఇతర ఏజెన్సీల్లోకూడా కోతపడుతున్నందున రానురాను భవిష్యత్తులో సమితి మనుగడ మరింతప్రశ్నార్థకం అవుతుంది. ఈ పరిస్థితులు అధిగమించాలంటే వేదిక ఆవిర్భావానికి కీలకంగా పనిచేసిన ఇతర దేశాలు రష్యా, ఫ్రాన్స్,బ్రిటన్,చైనా దేశాలు కీలకభూమిక పోషించక తప్పదన్నది అర్థంఅవుతోంది.ఈనిధుల సమస్య నుంచి సెక్రటరీజనరల్ సమితిని ఎలా బయటపడేస్తారన్నదే ఇప్పుడు ప్రపంచ దేశాల్లో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిపోయింది. కాలమే సమస్యలకు పరిష్కారం అన్నట్లుగా ఇపుడు యుఎన్ సంస్థలు పనిచేస్తున్నాయనే మనం భావించాలి. ●

# 'ఫీజు రీయింబర్స్' తిప్పలు తప్పేదెప్పటికి?

**మన్నారం నాగరాజు**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీ ఓ కీలక అంశంగా నిలిచింది. ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల నినాదాలలో 'విద్యాహక్కు', బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, విద్యార్థుల చదువులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి' అనే అస్త్రాలు కేంద్రంగా ఉన్నాయి. కానీ, రాష్ట్ర ఆవిర్భావానంతరం పదేళ్ల పాటు అధికారంలో ఉన్న గత ప్రభుత్వ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో కనీస నిబద్ధతలేకపోవడం తీవ్ర ఆవేదనకరం. వాస్తవానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సామాజిక న్యాయం సాధనకు, వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్యఅందించేందుకు అత్యంత కీలకంగా ఉండాలి. అయితే, గత ప్రభుత్వం అధికారంలోఉన్న సమయంలో ఈ పథకం క్రమంగా నిర్లక్ష్యానికి గురైంది. సంవత్సరాల తరబడి బిల్లు పెండింగ్ పెట్టడం, కాలేజీలకు నిధులు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా ప్రైవేట్ కళాశాలలు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాకపోవడంతో విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వంటి దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి. తల్లిదండ్రులు అప్పులు తీసుకుని తమ పిల్లల చదువు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యాసంస్థలు నష్టాల భయంతో వెనుకబడిన వర్గాల విద్యార్థులను అడ్మిషన్లు ఇవ్వడానికే నిరాకరించాయి. ఇది రాష్ట్ర అభివృద్ధిలో మేలుకాలాన్ని ఆశించిన లక్షల కుటుంబాలకు గట్టిదెబ్బ. ఇంతటి ఘోర నిర్లక్ష్యానికి కారణం ఏమిటంటే, ప్రభుత్వం నిధుల కేటాయింపులను నేరుగా విద్యార్థుల కోసం ఉపయోగించకపోవడమే కాదు, ఖర్చు ప్రణాళికలో జాగ్రత్తలు తీసుకోకపోవడమూ దీనికి కారణం. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వేల కోట్లు అయ్యాయి. ఆర్థిక సంవత్సరానికి తగిన నిధులను కాలానుగుణంగా విడుదల చేయకపోవడం వల్లే ఈ సమస్య తీవ్రతరమైంది. అసలు ఉద్దేశం విద్యను హక్కుగా చేయడమే అయితే, విద్యార్థులకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చదువు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ, గత ప్రభుత్వం ఈ బాధ్యతను విస్మరించింది. ఉద్యమస్ఫూర్తిని మరిచి, రాజకీయ ప్రయోజనాల కోసం సొంత ప్రచారమే కంటే విద్యార్థుల కష్టాలపై దృష్టి పెట్టలేదు. ఈరోజు కూడా వేలాది మంది విద్యార్థులు రీయింబర్స్‌మెంట్ బకాయిల కింద సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మారినా సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదు. గత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం వలన ఏర్పడినబకాయిల భారం ఇప్పటికీ కొనసాగుతోంది. కనీసం ఇప్పుడు కొత్త ప్రభుత్వం విద్యను మానవ హక్కుగా గుర్తించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా క్లియర్‌చేసి, భవిష్యత్తులో నిర్లక్ష్యానికి తావులేకుండా క్రమబద్ధతతో ఈ పథకాన్ని అమలు చేయాలి. అప్పుడే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయకపోవడం వల్ల,కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు విద్యార్థుల పోరాటం ఎంతో కీలకమైనది. ఉస్మానియా యూనివర్సిటీ నుండి గ్రామీణ ప్రాంతాల వరకు, వేలాది మంది విద్యార్థులు ఉద్యమంలో పాల్గొనగా, కొందరు ప్రాణాలు కూడా త్యాగం చేశారు. అలాంటి త్యాగాలను ప్రభుత్వం గుర్తించకుండా, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడడం హేయం.ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యలో సమాన అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఒక శ్రేష్ఠమైన చర్య. పేద విద్యార్థులకు ఇది కొలమానమైన ఆర్థిక మద్దతుగా నిలుస్తోంది. కానీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వాహకంగా అమలు చేయకపోవడం వల్ల విద్యార్థులు కష్టాల్లో పడుతున్నారు. ప్రైవేట్ కళాశాలలు రుసుము వసూలు చేయడానికి ఒత్తిడి చేస్తుండగా, విద్యార్థులు అప్పులు చేసి చదవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు ప్రభుత్వ ప్రాధాన్యతగా విద్యను ప్రకటిస్తూనే, మరోవైపు విద్యార్థుల హక్కులను నిర్లక్ష్యం



చేయడం వంశపారంపర్య పాలనల తీరుకుసమానం. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఉన్న ప్రతి ప్రభుత్వం విద్యార్థుల నమ్మకాన్ని ద్రోహించడమే. తెలంగాణ విద్యార్థులు రాజకీయ లబ్ధికోసం కాదు, తమ హక్కుల కోసమే పోరాడారు.ఇప్పుడు వారిని మళ్లీ పోరాటానికి నెట్టడం దుర్మార్గం. కాబట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతను గుర్తించి, తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్వస్థితికి తేవాలి. పాత బకాయిలను సుమారు 8848 కోట్లు విడుదల చేసి, విద్యార్థుల భవిష్యత్తు కోసం విధిగా పనిచేయాలి. తెలంగాణ విద్యార్థులను మోసం చేయడం అనేది తక్షణమే ఆపాలి. ఇది న్యాయం కోసం చేసే మాట మాత్రమే కాదు, నైతికంగా నెరవేర్చాల్సిన బాధ్యత కూడా. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భారీగాఅభివృద్ధి పనులకు పెట్టుబడులు పెట్టింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం,రోడ్లు, భవనాలు, పట్టణాభివృద్ధి వంటి రంగాల్లో ఖర్చులు పెరిగాయి. అయితే ఆదాయ వనరులు తక్కువగా ఉండటంతో, అప్పులు తీసుకోవడం తప్ప లేదు. అలాగే పునర్వినియోగానికి సరైన ప్రణాళిక లేకపోవడం, అలసత్వపు విధానాలు, అనవసర ఖర్చులు వల్ల అప్పులు ఎక్కువయ్యాయి. ఇక్కడ 'తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లో ఉంది అని ముఖ్యమంత్రి ఒక వేదికపై చెప్పారు - కానీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీల కొరకై 1, ఏప్రిల్ 2023, కేంద్రప్రభుత్వం, నాయకులు తమ జీతాలు పెంచుకున్నారు. కనీసం ఒక నెల జీతాన్ని పిల్లల విద్యకోసంఇవ్వలేరా? అనే ప్రశ్న. ఇక తెలంగాణ రాష్ట్రం అప్పులకూపంలో కూరుకుపోతున్న సంగతి అందరికీ తెలిసినదే. వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకుని, వాటి వడ్డీలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వ ఖజానా నిలబెట్టిన రీతిని చూస్తుంటే, ఇది పాలకుల చేతుల్లో ఆర్థిక పరిపాలనకు వచ్చిన పతనానికి నిదర్శనం. కానీ ఇది మనదేశంలో ఆశ్చర్యంగా భావించనవసరంలేదు. ఎందుకంటే ఒకవైపు అప్పుల సంగతి గగ్గోలు పెట్టుతుంటే, ఇంకొకవైపు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు తమ జీతాలను సర్దుబాటు చేసుకుంటున్నారు. పైగా పెంచుకుంటూపోతున్నారు! పేదరికం, నిరుద్యోగం, రేషన్ కోత, విద్యుత్ ధరల పెంపు, ఎల్పీజీ ధరల బాదుడు ఇలా ఒక సామాన్యుడి బతుకు ప్రతీ మూలకు దెబ్బతింటుంటే, నాయకులకు మాత్రం వెండిగిన్నెల్లో భోజనం నడుస్తోంది. మంత్రుల వృధా ఖర్చులు, అధికారులు దుబారా ఖర్చులు ఎక్కువయ్యాయి. పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు లేక చదువుతుంటే, నాయకుల పిల్లలు విదేశీ స్కూళ్లలో చదువుతున్నారు.ప్రతి సంవత్సరం బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు, ప్రభుత్వ ఖర్చులలో నాయకులజీతాలు, భత్యాలు ఒక పెద్ద భాగాన్ని ఆక్రమిస్తుంటాయి. ప్రజల పిల్లలు విద్య కోసం అప్పులు చేస్తుంటే, నాయకులు మాత్రం అధికారానికి వందల కోట్లు ఖర్చుచేస్తూ ఎన్నికలు గెలుస్తున్నారు. కనీసం ఒక్క నెల జీతాన్ని రాష్ట్రంలోని పేద విద్యార్థుల విద్యకోసం విరాళంగా ఇవ్వడంవల్ల, వేలమంది చిన్నారులకు పుస్తకాలు, దుస్తులు, ఫీజు సహాయం చేయవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, బలపరచిన తరగతి గదులు నిర్మించవచ్చు. విద్యాబోధనలో నాణ్యత పెంపు కోసం ఉపాధ్యాయులకు అవసరమైన సదుపాయాలు కల్పించవచ్చు. కనీస బాధ్యత చూపించాల్సిన అవసరం ఉంది. పెట్టుబడులు పెట్టి రాబడి ఆశించలేరు. కానీ పిల్లల చదువు మీద పెట్టిన ప్రతీ రూపాయి, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడి వంటిది. ఈ విషయాన్ని మీ పెద్ద మనసుతో గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారంతో పాటు బాధ్యతలూ మోసే సమయం వచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన ఉద్యమంలో విద్యార్థుల పాత్ర అపూర్వం. వారి త్యాగాలు, పోరాటాలు, ప్రాణత్యాగాల పునాదులమీదే ఈ రాష్ట్రం నిలిచింది. అయితే, తెలంగాణ వచ్చిన తర్వాత వారికే రాష్ట్రం వివక్ష చూపుతుందనిపిం చడం బాధాకరం. ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం చాలా మందికి ఆశాజ్యోతి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బీద విద్యార్థులకు ఇది నూతన జీవం ఇచ్చే ఉపకారం. కానీ వేలాది కోట్ల రూపాయల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ క్లియర్ చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. పరీక్షలకు అనుమతించకపోవడం, విద్యాసంస్థల నుంచి బయటకు పంపించటం వంటి పరిస్థితులు తరచూ వినిపిస్తున్నాయి. ఇది విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే అంశం. ●

# దేశభద్రతకు కవచంగా నిలిచిన నారీశక్తి!



## భోపాల్‌లో ప్రధాని మోడీ

**భోపాల్, మే 31:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పరాక్రమానికి చిహ్నంగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. తుపాకీ గుళ్లకు ఫిరంగి గుళ్లతో బదులు ఇస్తామని పాకిస్థాన్‌కు హెచ్చరిక చేశారు. ఆపరేషన్ సిందూర్ దేశచరిత్రలోనే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన అతిపెద్ద, విజయవంతమైన ఆపరేషన్ అని అన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ, సైన్యం మొదటిసారి మహిళల కోసం రక్షణ ద్వారాలు తెరిచిందని తెలిపారు. నారీశక్తి దేశభద్రతకు కవచంగా మారిందని ప్రశంసించారు. దేశరక్షణలో మహిళల సామర్థ్యాన్ని ఇప్పుడు ప్రపంచమంతా చూస్తోందన్నారు. ఇందుకోసం గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని ప్రధాని మోదీ తెలిపారు. దేశరక్షణలో మహిళల సామ ర్థ్యాన్ని ప్రపంచమంతా చూస్తోందని ఇందుకోసం గత పదేళ్ల ప్రభుత్వం ఎన్నోచర్యలు తీసుకుంది. పాఠశాలల నుంచి యుద్ధభూమి వరకు దేశం తమ బిడ్డల ధైర్యసాహసాలపై పూర్తి నమ్మకంతో ఉంది. త్రివిధదళాల్లో మహిళలు కీలక బాధ్యతలు చేపడుతున్నారు. ఫైటర్ జెట్లు మొదలుకొని ఐఎన్ఎస్ విక్రాంత్ వరకు మహిళా అధికారులు సత్తా చాటుతున్నారని ప్రధాని మోదీ ప్రశంసించారు. నౌకాదళానికి చెందిన ఇద్దరు మహిళలు 250 రోజుల సముద్ర యాత్రను పూర్తి చేశారు. సవాల్ ఎంత పెద్దదైనా భారత మహిళలు విజయం సాధిస్తారు. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కానీ సీమాంతర ఉగ్రవాదం కానీ నేడు భారత మహిళలు దేశభద్రతకు కవచంగా మారారు. దేవీ అహల్య పవిత్రభూమి నుంచి దేశంలోని నారీశక్తికి మరోసారి సెల్యూట్ చేస్తున్నానని మోదీ తెలిపారు. భోపాల్‌లో నిర్వహించిన మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్‌లో పాల్గొన్న ప్రధాని మోదీ ఇందౌర్ మెట్రో, దాటియా, సత్నా విమానాశ్రయాల సూపర్ ప్రియారిటీ కారిడార్లను వర్చువల్‌గా ప్రారంభించారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రూ.483 కోట్లతో నిర్మించిన కొత్త అటల్ గ్రామ సేవా సదన్ (పంచాయత్ భవన్)లకు ఇవ్వాల్సిన మొదటివిడత మొత్తాన్ని మోదీ బదిలీ చేశారు. 18వ శతాబ్దానికి చెందిన మాల్వాలోని హోల్కర్ రాజవంశానికి చెందిన రాణి అహల్యాబాయి అసాధారణ పాలన, సామాజిక సంక్షేమంపై నిబద్ధతను కొనియాడారు. రాణి అహల్యాబాయికి అంకితం చేసిన పోస్టల్ స్టాంప్, రూ.300 స్మారక నాణాన్ని ప్రధాని విడుదల చేశారు.

# సంక్షోభంలో ఐక్యంగా ఉంచిన ఘనత రాజ్యాంగానిదే



## సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ బిఆర్ గవాయి

**అలహాబాద్, మే 31:** సంక్షోభాల సమయంలో దేశాన్ని ఐక్యంగా ఉంచిన ఘనత రాజ్యాంగానిదే అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అభిప్రాయపడ్డారు. దేశం సంక్షోభం ఎదుర్కొన్నప్పుడల్లా భారత రాజ్యంగం దృఢంగా ఉందన్నారు. దేశాన్ని ఐక్యంగా ఉండేలా రాజ్యాంగం చూస్తుందని తెలిపారు. అలహాబాద్ హైకోర్టులో అడ్వకేట్ ఛాంబర్లు, బహుళ స్థాయి పార్కింగ్ ప్రారంభోత్సవం సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్ పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు, దాని తుది ముసాయిదాను సభముందు సమర్పించినప్పుడు రాజ్యాంగం సమాఖ్య అని కొందరు అన్నారు. ఇంకొందరు ఏకీకృతమని చెప్పేవారు. కానీ బాబా సాహెబ్ భీమ్ రావ్ అంబేడ్కర్ రాజ్యాంగం పూర్తిగా సమాఖ్య లేదా ఏకీకృతం కాదని సమాధానం ఇచ్చారు. కానీ నేను మీకు ఒక విషయం చెప్పగలను. రాజ్యాంగం యుద్ధ సమయాల్లో భారతదేశాన్ని ఐక్యంగా, బలంగా ఉంచింది. మన దేశంపై దాడి జరిగినప్పుడల్లా రాజ్యాంగం విజయం సాధించిందని జస్టిస్ గవాయి అన్నారు. రాజ్యాంగం కారణంగా స్వాతంత్రం తర్వాత భారత్ అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని సీజేఐ స్పష్టంచేసారు. భారత్ పొరుగు దేశాల పరిస్థితి ఎలా ఉందో నేడు మనం చూస్తున్నామన్నారు. స్వాతంత్రం తర్వాత భారత్ అభివృద్ధి వైపు ప్రయాణిస్తోందని చెప్పారు. దేశంలోని చివరి పౌరుడికి న్యాయం అందడం ప్రాథమిక విధిగా అభివర్ణించారు. శాసనసభ అయినా, కార్యనిర్వాహక వ్యవస్థ అయినా, న్యాయవ్యవస్థ అయినా ప్రతి పౌరుడిని చేరుకోవాలని అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ సభలో ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువపై దృష్టి పెడుతున్నామన్నారు. దానితో మనం రాజకీయ సమానత్వాన్ని సాధించవచ్చని అన్నారు.

సంపద కొంతమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉంటుంది. దీనిని మనం అడ్డుకోకపోతే ప్రజాస్వామ్యాన్ని సాధించలేం. బార్, బెంచ్ ఒకే నాణేనికి రెండు వైపులా ఉన్నాయి. రథానికి రెండు చక్రాలు లాంటివి. అవి కలిసి పనిచేయకపోతే న్యాయం జరగదని సీజేఐ జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు.

# ఆపరేషన్ సిందూర్‌లో ఫైటర్ జెట్‌లకు నష్టం సహజమే!

## సిడిఎస్ జనరల్ చౌహాన్



**న్యూఢిల్లీ, మే 31:** ఆపరేషన్ సిందూర్ తరువాత భారత్, పాక్ మధ్య జరిగిన సైనిక ఘర్షణల్లో యుద్ధ విమానాలకు నష్టం జరిగినట్లు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ అంగీకరించారు. అయితే ఎన్ని యుద్ధ విమానాలకు నష్టం వాటిల్లింది, ఎంత మేర నష్టం జరిగింది అనేది చెప్పలేదు. కానీ భారత్‌కు చెందిన 6 ఫైటర్ జెట్లను కూల్చివేసినట్లు పాక్ చేస్తున్న వాదనను మాత్రం ఆయన తోసిపుచ్చారు. అది పూర్తిగా అవాస్తవం అని స్పష్టం చేశారు. భారత్ కోల్పోయిన యుద్ధ విమానాలపై సీడీఎస్ స్పందించడం ఇదే తొలిసారి కావావడం గమనార్హం. సీడీఎస్ మాట్లాడుతూ, విమానాలను కోల్పోవడం కంటే దానికి గల కారణాలు కనుగొనడం ముఖ్యం. అప్పుడే భారత సైన్యం తన వ్యూహాలను మరింత మెరుగుపరుచుకొని, తిరిగి దాడి చేయగలగుతుందని జనరల్ చౌహాన్ పేర్కొన్నారు. ఈ నెల ఆరంభంలో పాకిస్థాన్‌తో జరిగిన నాలుగు రోజుల సైనిక ఘర్షణల్లో భారత్ తన యుద్ధ విమానాలను కోల్పోయిందా? అని జనరల్ చౌహాన్‌ను అడగగా, ఆయన ఈ విధంగా తనదైన రీతిలో సమాధానం ఇచ్చారు. మంచి విషయం ఏమిటంటే, మేము చేసిన వ్యూహాత్మక తప్పిదాలను వెంటనే అర్థం చేసుకున్నాం. వాటిని సరిదిద్దుకున్నాం. రెండు రోజుల తర్వాత మేము మళ్లీ దాడులు చేశాం. పాక్‌లోని సుదీర్ఘ లక్ష్యాలపై మా ఫైటర్ జెట్లతో దాడి చేయగలిగామని సీడీఎస్ జనరల్ చౌహాన్ అన్నారు. అణు యుద్ధాన్ని ఆపానన్న డొనాల్డ్‌ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించడానికి జనరల్ చౌహాన్ నిరాకరించారు. అయితే 4 రోజుల భారత్-పాక్ ఘర్షణ అణు యుద్ధానికి ఏమాత్రం చేరువకాలేదని స్పష్టం చేశారు. అణ్వాయుధాలను వాడాల్సిన అవసరం లేకుండా సమస్యల పరిష్కారానికి ఎన్నో మార్గాలు ఉన్నాయని ఆయన అన్నారు. భారత్ దాడులను అడ్డుకోవడంలో చైనా రక్షణ వ్యవస్థలు ప్రభావవంతంగా పనిచేశాయన్న పాక్ వాదనను ఆయన తోసిపుచ్చారు. చైనాకు సంబంధించిన రక్షణ వ్యవస్థలు సరిగ్గా పని చేయలేదని త్రిదళాధిపతి స్పష్టం చేశారు. భారీగా రక్షణ వ్యవస్థలు మోహరించిన పాక్ వాయుసేన స్థావరాలపైనే, మీటర్ కూడా తేడా లేకుండా అత్యంత కచ్చితమైన దాడులు చేశామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం సీడీఎస్ జనరల్ చౌహాన్ షాంగ్రిలా డైలాగ్‌లో పాల్గొనడం కోసం సింగపూర్‌లో ఉన్నారు.

గతంలో ఈనెల11న ఇండి యన్ ఎయిర్‌ఫోర్స్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎయిర్ ఆపరేషన్స్, ఎయిర్ మార్షల్ ఏకే భారతి కూడా పరోక్షంగా సైనిక విమానాలు కోల్పోయిన విషయం తెలిపారు. సైనిక పోరాట్లో ఫైటర్ జట్‌లు కోల్పోవడం సహజమేనని ఆయన పేర్కొన్నారు.



## మహిళా కమాండెంట్ నేహాభండారికి ఆర్మీచీఫ్ సత్కారం

**జమ్మూ, మే 31:** ఆపరేషన్ సిందూర్ సమయంలో బీఎస్ఎఫ్ దళాలు పాకిస్థాన్ బలగాలను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. అయితే బీఎస్ఎఫ్ మహిళా ఆఫీసర్ అసిస్టెంట్ కమాండెంట్ నేహ భండారీ నేతృత్వంలోని మహిళా దళం కూడా అసాధారణ సత్తాను చాటింది. ఈ క్రమంలో నేహ భండారిని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సత్కరించారు. కమెండేషన్ డిస్క్‌తో ఆమెను సన్మానించారు. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఆమెను కీర్తించారు. జమ్మూలోని ఆక్నూర్ సెక్టార్ వద్ద పాక్ ఫార్వర్డ్ దళాలను ఆమె బృందం అడ్డుకున్నది. అంతర్జాతీయ బోర్డర్ వద్ద ఉన్న పాకిస్థానీ పోస్టుపై చాకచక్యంగా నేహ భండారి బృందం ఎదుర్కొన్నది. జీరో లైన్ వద్ద సుమారు మూడు ఫార్వర్డ్ పోస్టులను ఆ దళం తిప్పికొట్టింది. చాలా విపత్కరమైన పరిస్థితుల్లో నేహ తన టీమ్‌ను లీడ్ చేసినట్లు తెలిపారు. నేహతో పాటు మరో ఆరు మంది మహిళా కానిస్టేబుళ్లు ఫార్వర్డ్ పోస్టుల వద్ద గన్ పొజిషన్‌లో ధీటుగా బదులిచ్చారు. సాంబా, ఆర్ఎస్ పురా, ఆక్నూర్ సెక్టార్ల వద్ద శత్రువులను ఎదుర్కొన్నారు. నేహ భండారి స్వరాష్ట్రం ఉత్తరాఖండ్. నేహ కుటుంబం ఆర్మీలో ఉన్నది. ఆమె మూడవ తరం ఆఫీసర్ కావడం విశేషం.

ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆక్నూర్ సెక్టార్‌లోని పర్గ్వాల్ ఫార్వర్డ్ ఏరియాను ఆమె కమాండ్ చేశారు. ఇంటర్నే షనల్ బోర్డర్ వద్ద దళాలతో నిఘా నిర్వహిం చడం పట్ల గర్వంగా ఉందని, ఆక్నూరు పోస్టుకు 150 మీటర్ల దూరంలో పాకిస్థానీ పోస్టు ఉన్నట్లు ఆమె తెలిపారు. నేహ భండారి తాతయ్య ఇండియన్ ఆర్మీలో చేశారు. ఆమె తల్లితండ్రులు ఇద్దరూ సీఆర్పీఎఫ్‌లో విధులు నిర్వర్తించారు.

# వందకుపైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి



## ఎదురుదాడులకు దిగిన కీవ్

**కీవ్, మే 31:** ఇటీవల తుర్కియే వేదికగా రష్యా, ఉక్రెయిన్ మధ్య ప్రత్యక్ష శాంతి చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. వాటి వల్ల ఫలితం లేకపోవడంతో తాజాగా మరోసారి ప్రత్యక్ష చర్చల కోసం రష్యా ప్రతిపాదనలు చేసింది. ఒకవైపు శాంతి ఒప్పందానికి సన్నద్ధం అవుతున్నప్పటికీ మరోవైపు ఇరుదేశాలు దాడులు కొనసాగిస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు మాస్కో కీవ్‌పై దాదాపు వందకుపైగా డ్రోన్లు, ఐదు క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం పేర్కొంది. వాటిలో 42 డ్రోన్లను తమ సైన్యం ధ్వంసం చేసిందని తెలిపింది. జపోరిజ్జియా ప్రాంతంలోని ఫ్రంట్-లైన్ గ్రామం డోలింకాపై జరిగిన దాడిలో 9 యేళ్ల చిన్నారి మృతి చెందగా.. భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు జపోరిజ్జియా గవర్నర్ ఇవాన్ ఫెడోరోవ్ తెలిపారు. పలువురు గాయపడ్డారన్నారు. దీంతో కీవ్ సైతం మాస్కోపై ప్రతీకార దాడులు చేసింది. రష్యాలోని పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ చేసిన డ్రోన్ దాడుల్లో 14 మంది గాయపడ్డారని, పలు భవనాలు ధ్వంసమయ్యాయని రష్యా ఆరోగ్య శాఖ వెల్లడించింది. శుక్రవారం ఉక్రెయిన్ ప్రభుత్వ సలహాదారు ఆండ్రీ యెర్మాక్ మాట్లాడుతూ సోమవారం ఇస్తాంబుల్‌లో రష్యాతో ప్రత్యక్ష శాంతి చర్చలను తిరిగి ప్రారంభించడానికి కీవ్ సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే చర్చల ప్రారంభానికి ముందు యుద్ధం ముగింపుపై తన వైఖరిని తెలుపుతూ వాగ్దానం చేసిన మెమోరాండాన్ని రష్యా తమకు అందించాలని షరతు పెట్టారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మే 19న ట్రంప్, పుతిన్ ఫోన్ కాల్‌లో దాదాపు రెండు గంటలకుపైనే మాట్లాడుకున్నారు. అనంతరం పుతిన్ స్పందిస్తూ భవిష్యత్తు శాంతి ఒప్పందానికి సంబంధించి ఉక్రెయిన్‌తో కలిసి పని చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు.

మరోవైపు ఉక్రెయిన్‌తో పోరాడ దానికి ఇప్పటికే వేలమంది సైన్యాన్ని, ఆయు ధాలను మాస్కోకు పంపిన ఉత్తర కొరియా తాజాగా మరో 14 వేల మంది సైన్యం, 9 లక్షల రౌండ్ల మందుగుండు సామగ్రి, 100 బాలిస్టిక్ క్షిపణులు, రాకెట్ లాంచర్లు రష్యాకు పంపినట్లు సమాచారం. దీంతో యుద్ధం ముగింపుపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.



## ఇండో-పసిఫిక్‌లో చైనా దూకుడును అడ్డుకుంటాం

### యుఎస్ రక్షణ మంత్రి పీట్‌హెగ్సెత్

**సింగపూర్ సిటీ, మే 31:** ఇండో-పసిఫిక్ ప్రాంతంపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సింగపూర్‌లో పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా నుంచి ఎదురవుతున్న ఆర్థిక, మిలిటరీ ఒత్తిడి గురించి ప్రస్తావించారు. ఇండో-పసిఫిక్‌లో చైనా దూకుడు ప్రదర్శిస్తే అమెరికా దానిని అడ్డుకుంటుందని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో చైనా దూకుడు నేపథ్యంలో తైవాన్‌లో సంఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని అంచనా వేశారు. చైనా నుంచి ముప్పు ఎదురైనట్లయితే మిత్రపక్షాలకు తాము అండగా ఉంటామని వ్యాఖ్యానించారు. భౌగోళిక, సముద్ర వివాదాల పరిష్కారంలో, తైవాన్ విషయంలో చైనా ఏకపక్షంగా వ్యవహరిస్తోందని హెగ్సెత్ అన్నారు. భవిష్యతులో బీజింగ్ నుంచి రానున్న ముప్పును.. ముఖ్యంగా తైవాన్‌పై దాని దూకుడు వైఖరిని ఎదుర్కోవడానికి వాషింగ్టన్ విదేశాలలో తన రక్షణను బలోపేతం చేస్తుందని హెగ్సెత్ అన్నారు. తైవాన్‌ను స్వాధీనం చేసుకోవడానికి చైనా చురుగ్గా చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే తరచూ తైవాన్ చుట్టూ సముద్ర జలాల్లో యుద్ధ విమాన వాహక నౌకలను మోహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని అన్నారు. మరోవైపు పనామా కాలువపై చైనా ప్రభావాన్ని తగ్గించడానికి అందరం కలిసి కృషి చేద్దామని యూరోపియన్ దేశాలకు పిలుపునిచ్చారు. దీనికోసం రక్షణ వ్యయాన్ని తమ స్థూల దేశీయోత్పత్తిలో 5శాతానికి పెంచాలని సూచించారు. ఇండో-పసిఫిక్ దేశాలకు అమెరికా మద్దతు ఇవ్వడం వల్ల స్థానిక ప్రభుత్వాలు సాంస్కృతిక, వాతావరణ సమస్యలపై పశ్చిమ దేశాలతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉండదని హెగ్సెత్ అన్నారు.

# చార్‌థామ్ యాత్రకు పోటెత్తుతున్న యాత్రికులు

## 30 రోజుల్లోనే 16 లక్షలమంది రాక



**డెహ్రాడూన్, మే 31:** చార్ ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ ఏడాది యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి (ఏప్రిల్ 30) నుంచి ఇప్పటి వరకూ దాదాపు 16 లక్షల మంది గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలను సందర్శించారు. అత్యధికంగా కేవలం 30 రోజుల్లోనే కేదార్‌నాథ్ ఆలయాన్ని 6.50లక్షల మందికిపైగా భక్తులు సందర్శించినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్ ఆలయం ఒకటి. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది. ప్రతి ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌కు చేరుకుని పరమేశ్వరుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే ఏటా శీతాకాలం ప్రారంభం కాగానే ఈ ఆలయాన్ని మూసివేస్తారు. శీతాకాలంలో దాదాపు ఆరు నెలల పాటు ఈ ఆలయ తలుపులు మూసే ఉంటాయి. ఆ సమయంలో ఆలయం మొత్తం మంచుతో కప్పుకుపోయి ఉంటుంది. తిరిగి వేసవిలో ఈ ఆలయ తలుపులు తిరిగి తెరుస్తారు. ఈ ఏడాది చార్ ధామ్ యాత్ర ఏప్రిల్ 30న ప్రారంభమైన విషయం తెలిసిందే. గర్వాల్ హిమాలయాల్లోని గంగోత్రి, యమునోత్రి దేవాలయాలను అక్షయ తృతీయ సందర్భంగా తెరిచారు. ఆ తర్వాత కేదార్‌నాథ్ దేవాలయాన్ని మే 2న, బద్రీనాథ్ దేవాలయాన్ని మే 4న భక్తుల సందర్శనార్థం తెరిచారు. శీతాకాలంలో ఈ నాలుగు దేవాలయాలను మూసివేస్తారు అక్టోబర్ - నవంబర్ నెలల మధ్య మూసివేసి ఉంచుతారు. భక్తుల భద్రత కోసం యాత్ర మార్గాల్లో దాదాపు 6,000 మంది పోలీసులు, 17 కంపెనీల ప్రొవిన్షియల్ ఆర్మ్‌డ్ కానిస్టేబులరీ సిబ్బంది, 10 కంపెనీల పారామిలిటరీ దళాలను మోహరించారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న 65కుపైగా ప్రాంతాల్లో రాష్ట్ర విపత్తు స్పందన దళ సిబ్బందిని మోహరించారు.

# భారత్‌కు మద్దతు తెలిపిన కొలంబియా




## పాక్‌కు మద్దతుగా తెలిపిన ప్రకటన ఉపసంహారణ

**బగోటా,మే 31:** కొలంబియాలో భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాల దౌత్యం ఫలించింది. పాకిస్థాన్ భూభాగంపై భారత్ దాడుల్లో చనిపోయిన వారికి సంతాపం తెలుపుతూ విడుదల చేసిన ప్రకటనను కొలంబియా ఉపహంసరించుకుంది. కాంగ్రెస్ నేత శశిథరూర్ అందించిన ఆపరేషన్ సిందూర్ పూర్తి వివరాలను ఆ దేశం పరిగణలోకి తీసుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన కొలంబియా విదేశాంగమంత్రి యెలాండ్ తమ ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. శశిథరూర్ నేతృత్వంలోని బృందం కొలంబియాకు వెళ్లింది. ఈ నేపథ్యంలోనే ఆ దేశ విదేశాంగ శాఖ ఉప మంత్రి రోసా యెలాండ్ విల్లావిసెన్సియోతో థరూర్ భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన పూర్తి విషయాలను యెలాండ్‌కు తెలియజేశారు. అనంతరం భారత్ జరిపిన దాడుల్లో పాకిస్థాన్‌లో చనిపోయిన వారికి సంతాపం తెలుపుతూ విడుదల చేసిన ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నట్లు యెలాండ్ ప్రకటించారు. భారతబృందం తమకు అన్ని విషయాలు తెలియజేసిందని చెప్పారు. కశ్మీర్‌లో ఏం జరిగిందనేది పూర్తిగా తెలుసుకున్నామన్న యెలాండ్ దాడులకు దారితీసిన పరిస్థితిపై అవగాహన వచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రకటన అనంతరం శశిథరూర్ కొలంబియా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై తమ వైఖరిని కొలంబియా పూర్తిగా తెలుసుకున్నారని థరూర్ తెలియజేశారు. అంతకుముందు కొలంబియా ప్రభుత్వం పాక్‌కు మద్దతుగా సంతాపం తెలపడంపై అసహనం వ్యక్తంచేశారు. కేవలం మా ఆత్మ రక్షణ హక్కును మాత్రమే వినియోగించుకున్నామని తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత్ అనేక ఉగ్రదాడులను భరించిందని చెప్పారు.


# షిరిడీ గోల్డెన్‌వాచ్ వేలం వేయాలని డిమాండ్

## వేయబోమని నిరాకరించిన సంస్థాన్ ట్రస్ట్



**షిరిడీ, మే 31:** శిర్డీలోని ద్వారకామాయిలో సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ భద్రతా సిబ్బందికి లభించిన క్వీన్ విక్టోరియా చిత్రంతో కూడిన బంగారు గడియారం సంచలనంగా మారింది. ఈ ప్రత్యేక వాచ్ ఎవరిదైతే వారు రుజువు సమర్పించి తీసుకెళ్లాలని సాయిబాబా సంస్థాన్ విజ్ఞప్తి చేసింది. మరోవైపు, ఈ గడియారాన్ని వేలం వేయాలని కొంతమంది శిర్డీ వాసులు, సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయంపై సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సీఈవో గోరక్ష్ గడిల్కర్ మాట్లాడుతూ బంగారు గడియారాన్ని వేలం వేయబోమని స్పష్టం చేశారు. ద్వారకామయిలో దొరికిన ఈ గడియారాన్ని వేలం వేయం. దాని యజమాని కోసం మేము మరో 10 రోజులు వేచి చూస్తాం. వాచ్‌ను తీసుకోవడానికి ఎవరు రాకపోతే, దానిని సంస్థాన్ లాకర్‌లో భద్రంగా ఉంచుతాం. భవిష్యత్తులో యజమాని వస్తే అతను రుజువు సమర్పించిన తర్వాత గడియారాన్ని తిరిగి ఇస్తాం. ఆలయ ప్రాంగణంలో భక్తుల విలువైన వస్తువులు కనిపిస్తే వాటిని సంస్థాన్ లో జమ చేస్తాం. ఎవరూ ముందుకు రాకపోతే వాటిని సంస్థాన్ లాకర్ లో భద్రపరుస్తాం. ఆలయ ప్రాంగణంలో దొరికిన వస్తువులను సంస్థాన్ వేలం వేయదు. భక్తులు సాయిబాబాకు సమర్పించినందున విరాళాలు, హుండీలో వేసిన వస్తువులను మాత్రమే వేలం వేస్తుంది సంస్థాన్ ట్రస్ట్ సీఈఓ తెలిపారు. విక్టోరియా చిత్రంతో ఉన్న గోల్డ్ వాచ్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ గురించి శిర్డీకి చెందిన గ్రామస్థుడు ప్రమోద్ గోండ్కర్ స్పందించారు. సాయిబాబా సంస్థాన్ గడియారాన్ని పోగొట్టుకున్న భక్తుడిని తెలుసుకునేందుకు ప్రయత్నించిందన్నారు. గడియారాన్ని తీసుకోవడానికి ఎవరూ రాకపోతే ట్రస్ట్ దానిని ఇతర క్లెయిమ్ చేయని వస్తువులతో పాటు వేలం వేయాలి. అలాగే వేలం వేసే అన్ని విలువైన వస్తువులను వివరిస్తూ ఒక ప్రెస్ నోట్ రిలీజ్ చేయాలి. ఈ ప్రత్యేకమైన గడియారాన్ని వేలం వేస్తే దాదాపు రూ. 3లక్షలురూ.4 లక్షల వరకు పలుకుతుందన్నారు. దేశ, విదేశాల నుంచి ప్రతిరోజూ సాయిబాబా దర్శనం కోసం వేలాది మంది భక్తులు శిర్డీకి వస్తారు. సాయిబాబా సమాధిని సందర్శించిన తర్వాత, భక్తులు బాబా తన జీవితాంతం ఫకీరుగా గడిపిన ద్వారకామాయికి కూడా వెళ్తారు. అయితే మే 21న ట్రస్ట్‌కు చెందిన ఇద్దరు మహిళా భద్రతా గార్డులు రంజనా కుంభార్, రషీద్ షేక్‌లకు ద్వారకామాయిలోని సాయిబాబా కూర్చొన్న పవిత్ర రాయి దగ్గర రూ.2 లక్షల విలువైన బంగారు గడియారాన్ని గుర్తించారు. దానిపై విక్టోరియా రాణి చిత్రం ఉంది. అలాగే విక్టోరియా ఎంప్రెస్ అని రాసి ఉంది. వెంటనే భద్రతా సిబ్బంది దానిని సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌కు సమర్పించారు. ఆ తర్వాత ఈ వాచ్ ఎవరిదైతే వారు సరైన ఆధారాలు చూపించి తీసుకెళ్లాలని ట్రస్ట్ భక్తులను కోరింది. అయితే, 10రోజులైనా ఎవరూ ఈ గడియారం తమదేనని ముందుకు రాలేదు.

# ఏడు రాష్ట్రాల్లోని 15 కేంద్రాల్లో ఎన్ఐఎ దాడులు




**న్యూఢిల్లీ, మే 31:** జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) శనివారం ఏడు రాష్ట్రాల్లోని 15 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులుచేసింది. ఉగ్రవాదులకు నిధుల సాయం, ట్రావెల్ ఏజెన్సీ లింకులు వంటి సమాచారంపై ఈ దాడులు, సోదాలు నిర్వహించింది. పాకిస్తాన్ వేగులకు దేశ భద్రతకు సంబంధించిన కీలక రహస్యాలను చేరవేసిని సిఆర్‌పిఎఫ్ ఉద్యోగి మోతీరామ్‌జాట్‌ను అరెస్టు చేసిన తర్వాత ఎన్ఐఎ అధికారులకు కీలక సమాచారం అందింది. ఢిల్లీ, హర్యానా, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, అస్సాం రాష్ట్రాల్లో ఈ దాడులు సోదాలు నిర్వహించింది. కోల్‌కత్తాలో ఇప్పటికీ సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. సోదాలు జరిపిన వాటిలో ఒక ట్రావెల్ సంసథకూడా ఉంది. ఈ సంస్థ ఆధ్వర్యంలోనే అనుమానిత నగదు బదిలీలు ఉగ్రవాదులకువెళ్లాయని అంచనావేసారు. మూడు సందర్భాల్లో నగదును బదిలీచేసినట్లు తేలింది. 2024 ఏప్రిల్ మూడోతేదీ కూడా నగదు బదలీ జరిగింది. ఇందుకోసమే షాపు ఓనర్ మసూద్ ఆలమ్‌ను ఇదేవిషయమై ప్రశ్నించేందుకు పిలిపించారు. 20-25 మంది ఎన్ఐఎ అధికారులు నగదు బదలీ లావాదేవీలుపరిశీలించారు. ఒక స్పష్టమైన లావాదేవీకోసం ప్రశ్నించారు. కానీ ఆ లావాదేవీ కనిపించలేదు. పేపాయింట్ ఇండియా వంటి థర్డ్‌పార్టీ యాప్‌ల సాయంతో బదలీ చేసారు. ఆధార్‌కార్డులను పరిశీలించి లావా దేవీలు చేస్తామని షాపు ఓనర్ చెప్పారు. ఈ మొత్తాలు పాకిస్తాన్ ఖాతాకు బదలీచేసారని మాత్రమే గుర్తించారు. ఫోను, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. తాను దర్యాప్తు అధికారులకు పూర్తిగా సహకరిస్తానని మసూద్ ఆలమ్ స్పష్టం చేసాడు. పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్లు టివి జర్నలి స్టుల ముసుగులో ఈ కీలక సమాచారం సిఆర్ పిఎఫ్ ఎఎస్ఐనుంచి రాబట్టారు. ముందు పహ ల్గాంలో డ్యూటీచేసిన జాట్‌ను దాడికిఐదు రోజుల ముందే ఢిల్లీకి బదిలీచేసారు. తనిఖీలు 15 ప్రాంతాల్లో జరిగాయన్నారు.

# కార్పొరేట్ సంస్థపై ఒంటరి పోరాటం

## - అపోలో సంస్థకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఇచ్చిన లీజు అగ్రిమెంటు రద్దు చేయాలని యుద్ధం

## - వైద్యుల నిర్లక్ష్యం.. కుమార్తె మృతి చెందడంతో రోడ్డెక్కిన తండ్రి



చిత్తూరు అపోలో ప్రభుత్వ ఆసుపత్రిలో సక్రమంగా వైద్య సేవలు అందడం లేదని ఎక్స్‌పర్ట్ కమిటీ ఎదుట హాజరై ఫిర్యాదు చేస్తున్న బాధితులు(ఫైల్‌ఫోటో)

**చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:** చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో కార్పొరేట్ సంస్థకు అప్పగిస్తే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చునని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు లీజుకు ఇచ్చింది. అయితే కొండ నాలుకకు మందు వేస్తే వున్న నాలుక పోయింది అన్న చందంతో తయారైంది ప్రస్తుతం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి పనితీరు. ఈ ఆసుపత్రికి వైద్యం కోసం ఎవరు వచ్చినా వారికి పరీక్షలు నిర్వహించి ఇక్కడ దీనికి వైద్యం లేదు. తిరుపతి రుయా ఆసుపత్రికి వెళ్ళాల్సిందే అంటూ వైద్యులు రెఫర్ చేస్తుండటంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రభ కొల్పోతున్నది. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించి 2016 సంవత్సరంలో అపోలో ఆసుపత్రికి ఈ ఆసుపత్రిని లీజుకు ఇచ్చారు. అపోలో సంస్థకు చిత్తూరులో ప్రైవేటు మెడికల్ కళాశాల వుండటంతో ఆ కళాశాలకు అనుబంధంగా పెద్ద ఆసుపత్రి వుండాల్సి వుండటంతో అపోలో సంస్థ పక్కా వ్యూహంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి లీజు ప్రక్రియను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళింది. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో సంస్థకు లీజుకు ఇచ్చిన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నియామకాలు, సిబ్బంది నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యులు లేదా సిబ్బంది రిటైర్డ్ అయితే వారి స్థానంలో కొత్త వారిని సైతం నియమించని పరిస్థితి నెలకొంది. క్రమేపి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది సంఖ్య తగ్గడం, ఆ స్థానంలో అపోలో సంస్థ వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరుగుతుండటంతో ఇక్కడ వైద్యం కోసం వచ్చే రోగులకు సరైన వైద్యం అందించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రారంభంలో అపోలో సంస్థకు ఇచ్చిన లీజును రద్దు చేయాలని కొన్ని ప్రజా సంఘాలు పోరాటాలు చేసినా ఫలితం లేకపోవడంతో అవి మిన్నకుండిపోయాయి. ఈ క్రమంలో ఇటీవల అధికార పార్టీకి చెందిన మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్, దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జి పి.షణ్ముగం కుమార్తె రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో ఆమెను వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు యధావిధిగానే ఈమెకు ఎలాంటి గాయం తగలలేదు. అని ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా కట్టుకట్టి ఇంటికి పంపివేశారు. ఇలా ఇంటికెళ్ళిన ఆమె ఆ రాత్రి మృతి చెందింది. ఈ సంఘటనపై ఆమె తండ్రి సీరియర్ అయి అపోలో సంస్థపై యుద్ధం ప్రకటించారు. ఇప్పటికే అపోలో సంస్థకు ప్రభుత్వం ఇచ్చిన లీజును సత్వరం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 25 వేల మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొని సంతకాలు చేశారు. ప్రభుత్వం నియమించిన కమిటీ ఎదుట హాజరై తన కుమార్తెకు జరిగిన అన్యాయం గురించి వివరించి వచ్చారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు రాష్ట్ర స్థాయిలో మంత్రులను కలిసి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిరుపేద రోగులకు అపోలో కార్పొరేట్ సంస్థ చేస్తున్న నిర్వాకంపై వివరించారు. ఈ క్రమంలో చిత్తూరు రుయా ఆసుపత్రి ఆర్ఎం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి పనితీరుపై విచారించడానికి మరో కమిటీ వేశారు. ఈ కమిటీ సభ్యులు జూన్ 3వ తేదీ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రానుంది. ఈ కమిటీ ఎదుట మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగంతో పాటు ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చి సరైన వైద్యం అందని వారందరు హాజరై వాస్తవాలను వెల్లడించడానికి సిద్ధం అవుతున్నారు.



# ప్రజామోదం లేకుండా ఏ నిర్ణయం తీసుకోను

## నా తెలుగు కుటుంబంలోని ఆరు శాసనాల కాన్సెప్ట్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** "నా తెలుగు కుటుంబంలోని ఆరు శాసనాల కాన్సెప్ట్‌ను "విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు "ఎక్స్" వేదికగా పునరుద్ఘాటించారు. నేను ప్రతిది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేస్తాను.అందుకే ఆ విషయాలను వారికి అవకాశం ఉన్నప్పుడల్లా వివరిస్తాను, అది సామాజిర మాధ్యమంలోగాని, మౌఖికగాని పంచుకుంటాను.ప్రజలతో ఫోన్‌లో నేరుగా మాట్లాడతాను.ఇది నా నైజం,అందుకే ప్రతి పనినిలో విజయం సాధించగలుగుతున్నా మన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తున్నామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏడాదిలో ఏమి చేశామో రాబోయో రోజుల్లో ఏం చేస్తామో మహానాడు ద్వారా వివరించామన్నారు. ప్రజలతో నాయకులు మరింత మమేకమవ్వడం ద్వారా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై నిరంతరం చర్చించేలా చూడాలన్నారు. ఎమ్మెల్యేలు విధిగా పేదల సేవా కార్యక్రమాల్లో పాల్గనాలన్నారు. జూన్ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత పథకాలు ప్రారంభిస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నట్లు సిఎం తెలిపారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందేలా కేలండర్‌ను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. జాతీయ స్థాయిలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఏపీ నిర్ణయాలు ఉంటాయన్నారు. "మనకు నైపుణ్యం ఉన్న మానవ వనరులు చాలా అవసరం ఉంది. దీనికి అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు అవసరం అవుతాయి. నైపుణ్యాభివృద్ధి కోసం ఏపీలోనూ కొన్ని ఉత్తమ విద్య సంస్థలు వస్తున్నాయి. బిల్ గేట్స్ ఫౌండేషన్ తోనూ ఆరోగ్యం, వ్యవసాయం లాంటి అంశాలపై పనిచేస్తున్నాం. సాంకేతికత ఉంటేనే సరిపోదు దాన్ని క్షేత్రస్థాయిలో అమలు పరిస్తేనే ఫలితాలు వస్తాయన్నది నా విశ్వాసం. అందుకే ఏపీలో అత్యుత్తమ విధానాలను అనుసరిస్తున్నాం, ఏపీలో ఫలితాలు వస్తే దేశమంతా దాన్ని అనుసరించవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ లాంటి వారి నుంచి ఆలోచనల్ని తీసుకుని నైపుణ్యాభివృద్ధి చేస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు ను ఏపీలో నిర్మిస్తున్నాం, సముద్రంలోకి వృధాగా పోయే 2 వేల టీఎంసీల నీటి నుంచి 200 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకునేలా ప్రాజెక్టు నిర్మిస్తున్నాం. ఇది పూర్తి అయితే రాష్ట్ర సస్యశ్యామలం కావడంతో పాటు.. సంపద అందరికీ అందుతుంది. వంశధార నుంచి పెన్నా వరకూ నదుల్ని కూడా అనుసంధానించాలన్నది మా ప్రయత్నం. అలాగే సర్క్యులర్ ఎకానమీ దిశగానూ ఏపీలో ప్రణాళికలు చేపడుతున్నాం. స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల ద్వారా సుస్థిర ఆర్థిక వ్యవస్థను సాధించాలన్నది మా ప్రయత్నం.ఏపీ ఇప్పటికీ వ్యవసాయ ఆధారిత రాష్ట్రమే జీఎస్టీపీలో 35 శాతం వ్యవసాయం ద్వారానే వస్తోంది. అరకు కాఫీ ఇప్పుడు గ్లోబల్ బ్రాండ్ గా ఉంది . ఈ తరహా ఉత్పత్తులు ఉపాధిని సంపదను సృష్టిస్తాయి. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలతో పాటు పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాలంలో స్మార్ట్ వర్క్ అనేదే కీలకం, నైపుణ్యాలు పెంచుకోవటమే సరైన విధానం. గతంలో ఐటీ విప్లవం వచ్చినప్పుడు కూడా ఉద్యోగాలు పోతాయని అపోహ ఉండేది. పర్యాటక రంగంలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నాం, ఎక్కువ సంఖ్యలో హోటళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. వచ్చే ఐదేళ్లల్లో 50 వేల హోటల్ రూంలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతీ సమయంలోనూ సవాళ్లు, అవకాశాలు ఉంటాయి అందులో అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ఏపీని.. ఏపీలోని యువతను సిద్ధం చేస్తున్నాం. అమరావతిలో పెద్ద ఎత్తున వివిధ నిర్మాణాలు జరగాల్సి ఉంది.

నిర్మాణ రంగంతో పని చేయటానికి మేం సిద్ధం. వయబులిటి గ్యాప్ ఫండింగ్ వంటి విధానాల ద్వారా అభివృద్ధి, పీ4జీరో పావర్టీ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేలా కృషి చేస్తున్నాం. మనకు నైపుణ్యం ఉన్న మానవ వనరులు చాలా అవసరం ఉంది. దీనికి అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు అవసరం అవుతాయి. నైపుణ్యాభివృద్ధి కోసం ఏపీలోనూ కొన్ని ఉత్తమ విద్య సంస్థలు వస్తున్నాయి.

# సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపడితే సీమ సస్యశ్యామలం

## సీమలో సిద్దేశ్వరం అలుగు నిర్మించేంత వరకు ఉద్యమం కొనసాగిస్తాం

## రాయలసీమ సాగునీటి జలసాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాయలసీమ సాగునీటి జలసాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి

**ఆత్మకూరు,మే31,ప్రభాతవార్త:** రాయలసీమ ప్రాంతాని అభివృద్ధి చేయాలనే ఉద్యమంతో కృష్ణనది తీరంలోని సంగమేశ్వరం ప్రాంతంలో సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపడితే సీమ సస్యశ్యామలం అవుతుందని 2016 మే 28వతేదిన ప్రజా శంకుస్థాపన చేసి నేటికి 9సంవత్సరాలు పూర్తి కావచ్చిన నేపథ్యంలో ప్రజా పాలకులు సీమపై చిన్నచూపు చూస్తూ మెట్టభూములను తడి భూములుగా మార్చాలనే ఆశయం నీరు కారిపోయిందని రాయలసీమ హక్కులకై నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని సిద్దేశ్వరం సమీపంలో ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల సరిహద్దులో కృష్ణనదిపై అలుగు నిర్మాణం చేపట్టేందుకు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి ఆద్వర్యంలో జరిగిన ప్రజా బహిరంగ సభను విజయవంతం చేసేందుకు రాయలసీమ ప్రాంతంలోని చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం, నంద్యాల జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడనాడాలని ద్వజమెత్తారు. ప్రజా స్వామ్య బద్దంగా ఎన్నుకోబడిన రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ ప్రజల ఆశయాలకు, ఆక్షాంక్షలకు విరుద్దంగా రాచరీక వ్యవస్థలో ప్రభుత్వాని నడుపుతున్నారన్నారు. రాయలసీమలోని 8జిల్లాల నుంచి ప్రజా సంఘాలు, మహిళ సంఘాలు, న్యాయ వర్తక వాణిజ్య, విద్యార్థి, రైతు సంఘాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలు దద్దరిలే విదంగా సంగమేశ్వరంలో తమ గళాని రైతులు పెద్దఎత్తున్న సిద్దేశ్వరం అలుగు నిర్మాణం తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాయలసీమ సాగునీటి జలసాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత హైద్రబాద్ కేంద్రంగా పరిపాన చేయకుండా అమరావతి కేంద్రంగా నిధులు అని అక్కడే ఖర్చు పెట్టడంతో రాష్ట్రం దివాల తీసే పరిస ్థతి నెలకొందన్నారు. అమరావలి, పోలవరం అని ఒకరికి ఒకరు మూడు రాజధానులు ఒకరు మరోకరు తమ స్వార్ద రాజకీయ ఆర్థిక సామ్రాజ్యాలు నిర్మించుకోవడానికి ప్రయత్నించారే పాలకులు కనపడలేదని విమర్శించారు. రాయలసీమలో ప్రతి ఎకరానికి నీళ్ల ఇస్తామని, అందుకు తగట్టుగా బ్లూప్రింట్ తయారు చేస్తామని ప్రకటించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ దగ్గర ఉన్న ఆ బ్లూప్రింట్ ద్వారా ఏ విదంగా నీళ్ల ఇస్తారో ప్రజానీకానికి చూపాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు కోసం వేలాది ఎకరాలను త్యాగం చేసుకోని ప్రతి ఇంటికి ఉదో ్యగం కల్పిస్తామని హామీ ఇచ్చి నాలుగు దశాబ్దాలు అయిన నేటికి ఉద్యోగాల ఊసే లేదన్నారు. పట్టుసీమ పూర్తి చేసి రాయలసీమకు నీళ్ళు ఇస్తామని చెప్పిన పాలకులు మరిచి నేడు గోదావరి - బనుచర్ల అంటూ మరోకొత్త నాటానికి తెరలేపి రాయలసీమ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రూ.1500లు కోట్లు ఖర్చుపెడితే రాయలసీమలో 10లక్షల ఎకరాలకు నీరు అందించవచ్చని 10వేల కోట్ల వ్యవసాయ ఉత్పదాన జరుగుతుందని ప్రభుత్వానికి తెలిపిన ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని విమర్శించారు.

# 12న తల్లికి వందనం పథకం అమలు

## - విఆర్ హైస్కూల్లో నిరుపేద విద్యార్థులకు హైటెక్నాలజీ ఎడ్యుకేషన్ - పి-4 విధానం ద్వారా అభివృద్ధికి శ్రీకారం : మంత్రి డాక్టర్ పి. నారాయణ



**నెల్లూరు, మే31, ప్రభాతవార్త-వైద్యం** అవ్వ తాతలు వితంతువులు దివ్యాంగుల కళ్ళల్లో ఆనందం చడడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీనే పెన్షన్లను క్రమం తప్పకుండా పంపిణీ చేస్తుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరు మూడో డివిజన్ జాఫర్ సాహెబ్ కాలువ గట్టుపై మంత్రి నారాయణ చేతుల మీదుగా పండుగ వాతావరణంలో పెన్షన్‌ల పంపిణీ చేపట్టారు. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అని మంత్రి తెలియజేశారు. తమ డివిజన్‌కి విచ్చేసిన మంత్రికి మంగళ హారతులతో పింఛన్ దారులు, స్థానిక ప్రజలు స్వాగతం పలికారు. ఈ క్రమంలో మంత్రి నారాయణ అందర్ని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకెళ్తూ వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. మంత్రే తమ ఇంటికి వచ్చి పెన్షన్ అంద చేయడంతో పెన్షన్ దారుల ఆనం దానికి అవధులు లేకుండా పోయాయి. పెన్షన్ దారుల యోగ క్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలోని పిల్లలను వీఆర్ స్కూల్‌లో చేర్పించాలని పేరెంట్స్‌కు మంత్రి సూచించారు. చిన్న పిల్లలను ఎత్తుకొని మంత్రి ఆప్యాయంగా పలకరించారు. స్కూల్‌లో కల్పించే సదుపాయలపై చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు మంత్రి వివరించారు. పండుగ వాతావరణంలో లబ్దిదారులందరికి పెన్షన్లు పంపిణీ చేస్తూ అందరిని పేరుపేరునా పలకరిస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని తెలియజేస్తూ మంత్రి ముందుకు సాగారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక రోజు ముందుగానే పండుగలా పెన్షన్‌ల పంపిణీ సాగుతోందన్నారు. అవ్వ తాతల కళ్ళల్లో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎన్నికల ముందు మండుటెండలో వైఎస్సార్‌సీపీ వృద్ధులను ఇబ్బంది పెట్టిందని, మాపై అబాండాలు వేసేందుకు ప్రయత్నించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగించిందని ఎద్దేవ చేశారు. గత ప్రభుత్వ అవకతవక పాలన వల్ల పరిశ్రమలు వెళ్లిపోయాయన్నారు. దాంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని విచారం వ్యక్తం చేశారు. ఫలితంగా గత ప్రభుత్వ పాలనలో యువత పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్డీయే మానిఫెస్టోలో ఉంచిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ మేరకు లక్ష్యం చేధించేందుకు సీఎం చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్ శ్రమిస్తున్నారన్నారు. పరిశ్రమల స్థాపనకు ప్రణాళికతో ముందుకెళ్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో పెన్షన్ 4 వేలు చేస్తామని ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకున్నారని కొనియాడారు. ఆ క్రమంలో మూడు వేలు అరియర్స్ కూడా ఇచ్చామని తెలిపారు. కుటుంబ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి ఖజానా ఖాళీ అయినా ఇచ్చిన మాట నిలబెట్టు కొంటున్నామన్నారు. మానిఫెస్టోలో చెప్పినవన్నీ వందశాతం అమలు చేస్తామని భరోసా ఇచ్చారు.

# వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య ప్రవేశానికి నోటిఫికేషన్


## తెలంగాణ విద్యార్థులకే అన్ని సీట్లు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విద్యాల యాల పరిధిలోని కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యా లయం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం కింద గత పదేళ్లుగా 85 శాతం స్థానికులకు, 15 శాతం ఏపీ విద్యార్థులకు కోటా ఉండగా, ఈసారి మొత్తం సీట్లను తెలంగాణ విద్యార్థులతోనే భర్తీ చేయనున్నారు. ఎస్సీ వర్గీకరణను ఈ ప్రవేశాల్లో తొలిసారిగా అమలు చేయనున్నారు. అలాగే వ్యవసాయ కూలీల కుటుంబాలకు తొలిసారిగా 15శాతం సీట్లు కేటాయించారు. ఉద్యాన వర్సిటీ పరిధిలో 40 శాతం సీట్లను, వ్యవసాయ, పశువైద్య వర్సిటీల పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబాల విద్యార్థులకు కేటాయిస్తారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థికి లేదా వారి తల్లిదండ్రులకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జాబ్‌కార్డు ఉండాలి. అంతేకాకుండా విద్యార్థి 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మధ్య కనీసం 4 ఏళ్లు ప్రభుత్వ పాఠశాలలు లేదా కళాశాలలో చదివి ఉండాలి. ఎలాంటి భూమి లేదని తహసీల్దారు నుంచి పొందిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఇక బీఎస్సీ వ్యవసాయం, బీఎస్సీ ఉద్యాన, బీటెక్ వ్యవ సాయ ఇంజినీరింగ్, బీటెక్ ఆహార సాంకేతికత, బీఎస్సీ హోంసైన్స్, బీఎఫ్ఎస్సీ, బీవీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఈఏపీసెట్-2025లో ఉత్తీర్ణులై ఉండాలి. ఈ నెల 31 ఉదయం 10 గంటల నుంచి జూన్ నెల 28 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి మరింత సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్ సైట్‌ని సందర్శించాలని సూచించారు. కోర్సుల వారీగా సీట్లు ఈ విధంగా ఉన్నాయి. వ్యవసాయ వర్సిటీ పరిధిలోని ఏడు బీఎస్సీ వ్యవసాయ కళాశాలల్లో 615 సాధారణ సీట్లు, 365 సెల్ఫ్‌ఫైనాన్స్(ఎస్ఎఫ్) సీట్లు, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్‌లో 38 సాధారణ, 5 ఎస్ఎఫ్ సీట్లు, బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో 25 సాధారణ, 5 ఎస్ఎఫ్ సీట్లు, ఉద్యాన వర్సిటీ పరిధిలో మూడు కళాశాలల్లో 200 సాధారణ, 34 ఎస్ఎఫ్ సీట్లు ఉన్నాయి. ఇక పశువైద్య యూనివర్సిటీ పరిధిలోని మూడు పశువైద్య కళాశాలల్లో 185 సాధారణ, 15 ఎస్ఎఫ్ సీట్లు, ఫిషరీ సైన్స్ కళాశాలలో 28 సీట్లు భర్తీ అవుతాయి.

# జపాన్‌లోని కుషిరో తీరంలో తీవ్రస్థాయి భూకంపం

## రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రత గుర్తింపు

**టోక్యో, మే 31:** జపాన్ ఉత్తర ద్వీపం హక్కైడోలోని కుషిరో తీరంలో శనివారం మధ్యాహ్నం తీవ్రస్థాయి భూకంపం సంభవించింది. భూకంపం 20 కిలో మీటర్ల లోతులో సంభవించిందని జపాన్ భూగర్భ వనరుల శాఖ ప్రకటిం చింది. భూకంపం రిక్టర్‌స్కేలుపై 6.1 తీవ్రతతో ఉందని వెల్లడించింది. అదే ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపాలు వచ్చాయి తర్వాత మధ్యాహ్నం మళ్లీ 2.19 గంటలకు ప్రకంపనలు వచ్చాయి. షికోకు తీరంలో 3.5 తీవ్రతతోను, సాయంత్రం 4.45 గంటలకు కుషిరోలో 4.7 తీవ్రతతోను, సాయంత్రం 5.07 గంటలకు మరొక భూకంపం సంభవిం చిందని జపాన్ భూకంప అధ్యయన కేంద్రం తెలిపింది. జపాన్‌లోని భూకంప అధ్యయన కేంద్రం వివరాల ప్రకారం గత ఏప్రిల్‌లోకూడా జపాన్ క్యుషు ప్రాంతం లో రిక్టర్ స్కేలుపై ఆరు పాయింట్ల అయస్కాంత ప్రభావిత శక్తితో భూకంపం సంభ వించింది. భూకంపం 30 కిలోమీటర్ల లోతన వచ్చింది. ఈ యేడాది జనవరిలోకూడా జపాన్ లోని నైరుతి ప్రాంతంలో 6.9తీవ్రతతో భూకంపం వచ్చింది. ఆ తర్వాత సునామీ హెచ్చరిక కూడా జారీచేసింది. రాత్రి 9.19 గంటలప్రాంతంలో మియాజాకిలో ఈ భూకంపం వచ్చింది. పసిఫిక్ బేసిన్‌లోని అగ్నిపర్వతా నుంచి వచ్చిన రాపిడి కారణంగా జరిగిందని అప్పట్లో భావించారు. సునామీ రావచ్చని పదేపదే సముద్రంలోకి వెళ్లవద్దని కూడా జపాన్ వాతావరణ సంస్థ గతంలోనే హెచ్చరించింది.




# వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

## తెలంగాణ, ఎపి జెఎసి, పలు ముస్లిం సంఘాల నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 31, ప్రభాతవార్త:** వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని తక్షణమే రద్దుచేయాలని తెలంగాణ, ఎపి జాయింట్ యాక్షన్ కమిటీ,పలు ముస్లిం సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కేంద్రం ఇటీవల తెచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మార్చ్, భారీ బహిరంగ సభ నిర్వ హించారు. ఈ సభకు జెఎసి కన్వీనర్ మహ్మద్ ముస్తాక్ మాలిక్, ఎంబిటి అధ్యక్షుడు మాజిదుల్లాఖాన్, ఫరహత్, కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ ఎంపిలు వి.హనుమంత రావు, అజీజ్‌పాషా, కాంగ్రెస్ నేత ఓసామా మహ్మద్ తదితరులు పెద్దఎత్తున హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డ్ సవరణ చట్టం వల్ల ముస్లింల వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యా క్రాంతమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే దీనిపై పునరాలోచన చేసి, ఉపసంహారించుకోవాలని, లేదా దేశ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని మార్చే హక్కు బిజెపికి లేదని, ఈ నల్ల చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నల్ల చట్టాన్ని రద్దు చేసే వరకు ముస్లిం మైనారిటీలంతా ఏకతాటిపైకి వచ్చి, పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

# వైసిపి అధికారం చేపట్టే దిశగా అడుగులు

## - పార్టీ అజెండాపై ముందుకెళ్తాం : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్

**విజయవాడ, మే 31, ప్రభాతవార్త :** పార్టీని బలోపేతం చేసే దిశగా దృష్టిపెట్టి నాయకులతో చర్చించినట్లు వైసిపి విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్ చెప్పారు. పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తెచ్చేలా అడుగులు వేస్తున్నామన్నారు. దేవినేని అవినాష్ నేతృత్వంలో శనివారం విజయవాడలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా వైసిపి సమన్వయకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవాడికి భరోసా కల్పించే విధంగా పార్టీ నేతలంతా కలిసి పని చేస్తామన్నారు. మాకు గ్రూపులు లేవని స్పష్టం చేశారు. ఏడు నియోజకవర్గాల్లో గెలిచేలా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. జూన్ 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తామన్నారు. దానికి సంబంధించిన పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ప్రజలను నమ్మించి మోసగించిన చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలను జూన్ 4న ప్రజలందరికి తెలిసేలా వెన్నుపోటు దినం నిర్వహిస్తామన్నారు. ఓట్లకోసమే హామీలు ఇచ్చి అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టేవిధంగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. బిల్లులు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ పథకం అటకెక్కిందన్నారు. ఇదే పద్ధతిలో కూటమి ప్రభుత్వం కొనసాగితే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. ప్రజలు వారికి తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు. రాక్షస పాలనతో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదని ప్రజల్ని ముంచిన ప్రభుత్వమంటూ రాష్ట్ర మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. గతంలో జగన్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పలు హామీలు అమలు చేసి ప్రజల మన్ననలందుకున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు ఏవీ అమలు చేయలేదంటూ దెప్పి పొడిచారు. ఆయన పొడిచిన వెన్నుపోటును గుర్తు చేస్తూ జూన్4న వెన్నుపోటు దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే చంద్రబాబు ప్రభుత్వం రు.1లక్ష 50వేల కోట్లు అప్పుచేసిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి శూన్యమంటూ ఎద్దేవా చేశారు. ప్రజలపక్షాన తాము నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో వైసిపికి పూర్వ వైభవం తేవడం తథ్యమని వెల్లడించారు.

# ఆహార కమిషన్ కార్యదర్శి నరేందర్ వీఆర్ఎస్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** ఆహార కమిషన్‌లో సభ్య కార్యదర్శిగా పని చేస్తున్న నరేంద్రరావు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పాటు కొనసాగిన ఆయన్ను, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫుడ్‌కమిషన్ సభ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. అంతకు ముందు ఆయన సచివాలయంలో రెవెన్యూశాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేసేవారు. ఏఎస్‌వోగా సచివాలయ సర్వీసులోకి వచ్చిన నరేంద్రరావు సెక్షన్ అధికారిగా, సహాయ కార్యదర్శిగా, డిప్యూటీ కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా, అదనపు కార్యదర్శిగా పదోన్నతులు పొందారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి పదేళ్లుగా సచివాలయ ఉద్యోగులసంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వచ్చారు.

# దిగుమతి సుంకం తగ్గింపుతో ఆయిల్‌పామ్‌కు అడ్డంకి

## కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ


**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** దిగుమతి సుంకం తగ్గింపుతో ఆయిల్ పామ్ సాగుకు అడ్డంకిగా మారుతుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభ్యంతరం తెలిపారు. దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునసమీక్షించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతులపై సుంకాన్ని తగ్గించాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఇప్పటికే దేశీయ ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనార్థం దిగుమతి సుంకాన్ని 27.5 నుంచి 40 కి పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభ్యర్థించినప్పటికి, దీనికి విరుద్ధంగా కేంద్రం దిగుమతి సుంకాన్ని తగ్గించడం బాధాకరమన్నారు. ఈ నిర్ణయం వలన ఆయిల్ పామ్ రైతులకు గెలల ధర తగ్గడంతో పాటు, దీర్ఘకాలికంగా దేశీయ ఆయిల్ పామ్ సాగును తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. ప్రస్తుతం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రాలు, రైతులకు తగిన ప్రోత్సాహం కల్పిస్తూ, ఈ పంట సాగు పెంపుపై దృష్టిసారిస్తున్న తరుణంలో, కేంద్ర నిర్ణయం రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ఈ దిగుమతి సుంకం తగ్గింపు వలన కొత్తగా ఆయిల్ పామ్ సాగు ప్రారంభించాలనుకునే రైతులు వెనక్కి తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది స్వదేశీ నూనె ఉత్పత్తిని ప్రోత్సహించాలన్న కేంద్ర, రాష్ట్రాల ఉద్దేశ్యాలకు విరుద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు పలు ప్రోత్సాహక కార్యక్రమాలే కాకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెద్ద ఎత్తున రైతుల అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు. రైతుల ఆకాంక్షలు నిలబెట్టడంకోసం, దేశ ఆత్మనిర్భరత లక్ష్యాన్ని సాధించేందుకు ఆయిల్ పామ్ వంటి నూనె పంటల ఉత్పత్తికి భరోసా కల్పించే విధానాలను అమలు చేయాలని కేంద్రాన్ని కోరినట్టు వెల్లడించారు.

### దిగుమతి సుంకం తగ్గింపు ప్రభావం: రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

కేంద్ర ప్రభుత్వం పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించడం వల్ల పామ్ ఆయిల్ సాగుచేసే రైతులపై తీవ్ర ప్రభావం పడ్తుందని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి అన్నారు. రాష్ట్రంలో పామ్ ఆయిల్ సాగు పెంచడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక ప్రోత్సహకాలు ఇస్తుందని, దీంతో రాష్ట్రంలో పామ్ ఆయిల్ సాగు చేయడానికి రైతులు ముందు కొస్తున్నారని గుర్తుచేశారు. ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం పామ్ ఆయిల్ దిగుమతిపై సుంకం తగ్గించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఇది దిగుమతి చేసుకునే పరిశ్రమలకు లాభం చేరుకుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ, సబ్సీడీలు ఇస్తుంటే కేంద్ర ప్రభుత్వం పిడుగులాంటి ఈ నిర్ణయం పామ్ ఆయిల్ తోటల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం గతంలో కూడా మల్టీనేషనల్ కంపెనీలకు దిగుమతి సుంకం తగ్గించి కంపెనీలకు లాభాలు చేకూర్చిపెట్టిందని అన్నారు. ఈ దిగుమతి, ఎగుమతి పాలసి పామ్ ఆయిల్ తోటల వ్యవసాయంపైన ప్రభావం పడకుండా ఉండాలి అంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి, రైతులను కూడా భాగస్వామ్యం చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ దిగుమతిపై సుంకాన్ని తగ్గించి తెలంగాణాలో సాగుచేసే పామ్ ఆయిల్ రైతులకు భారీ పెట్టుబడులు పెట్టి తోటలుపెంచి, ఆ లాభాలు రైతుకు అందకముందే ఈ నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ రైతు కమిషన్ తీవ్రంగా పరిగణలోకి తీసుకుంటుందన్నారు.

### నకిలీ ఆయిల్‌పామ్ విత్తనాలను అరికట్టాలి

ఆయిల్ ఫామ్ రైతులకు సరఫరా అవుతున్న నకిలీ విత్తనాలను అరికట్టాలని తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షులు తుంబూరు ఉమామహేశ్వర్‌రెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 2.10లక్ష ఎకరాల్లో 44వేల మంది రైతులు ఆయిల్ ఫామ్ పంటను సాగుచేస్తున్నారన్నారు. ఆయిల్ ఫామ్ పంట వేసి నష్టపోతే పరిహారం అందించేందుకు సరైన చట్టాలు లేవన్నారు.




శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపి వి.హెచ్

# పేదల భూములు లేఔట్‌లకు ఎలా ఇస్తారు?

## మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** మాజీప్రధాని ఇందిరాగాంధీ ఇచ్చిన భూములను గుంజుకుంటే చూస్తూ ఊరుకోమని, అక్కడ రాగి కృష్ణారెడ్డి కుతుర్ల 36 ఎకరాలు వెంచర్లకు ఇచ్చారు.. హెచ్‌ఎండిఏ లేఔట్ ఉండని, పేదల భూములు లేఔట్‌కి ఎలా ఇస్తారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపి వి.హనుమంతరావు ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. భూభారతిలో అసైన్డ్ భూముల స్వాధీనం చేసుకొని బడాబాబుల చేతిలో ఉన్న భూములను గుంజు కుంటామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారని, ఇది శుభ పరిణామం వి.హెచ్ అన్నారు. కీసర దాయరలో ఉన్న మాదిగల పట్టా భూమి 38వ సర్వేలో రాగి కృష్ణారెడ్డి చనిపోయిన దళితుల దొంగ సంతకలు ఫోర్జరీ చేసి కోర్టుకు పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. కీసర దాయరలో 120 మంది కుటుంబాలు రోడ్డునపడ్డారని, ఎంఆర్‌ఓ కూడా పేదల భూములని సర్టిఫై చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నానని, మిగతా 50 ఎకరాలు పేదలకు ఇవ్వాలన్నారు. అక్కడ అన్యాయం జరిగితే నేను అక్కడ ఉంటానని అన్నారు. దొంగ దగ్గర భూములు లాక్కుంటాం అన్నా పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేదలకు న్యాయం చేయాలన్నారు. ఈ భూమి ఇప్పిస్తే భూభారతికి, సిఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు వస్తుందన్నారు.

# బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాణి అహల్యాబాయి జయంతి వేడుకలు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్యాబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారి, ఎంపి ఈటల రాజేందర్, రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్, సీనియర్ నాయకులు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, బస్వాపురం లక్ష్మీనరసయ్య, సుభాష్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి, బిఆర్ఎస్‌ది చోర్‌పత్తా రాజకీయం

## పిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌ది చార్ పత్త రాజకీయం కాదు, కానీ బిజెపి, బిఆర్ఎస్‌ది చోర్ పత్త రాజకీయం అని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తొండి మాటలను ఎవ్వరు నమ్మరన్నారు. కవిత లెటర్ వెనకాల కాంగ్రెస్ ఉందని బండి సంజయ్ మాటలు అర్థ రహితం అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ డ్రామా రాజకీయాలు 11 ఏళ్ల నుండి తెలంగాణ ప్రజలకు తెలుసునని అన్నారు. అవినీతి బిఆర్ఎస్ పార్టీని కాపాడుతుంది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కదా? అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేశ ద్రోహి అనడం సిగ్గు చేటు అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు భద్రత కరువైందన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మోడీ భారత దేశ ఆత్మ గౌరవాన్ని అమెరికా అధ్యక్షుడికి తాకట్టు పెట్టారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు జరుగుతుంది అనే విషయం కూడా హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి తెలియక పోవడం దౌర్భాగ్యం? అన్నారు. ఇందిరా గాంధీ గురించి బండి సంజయ్‌కి మాట్లాడే స్థాయి లేదని, దేశ ప్రజలు రాహుల్ గాంధీని ప్రధాని కావాలని కోరుకుంటున్నారన్నారు. యుద్ధం ముందు అఖిల పక్షం సమావేశం పెట్టిన మోదీ యుద్ధం ఆగిపోయాక మోదీ అఖిల పక్ష సమావేశం ఎందుకు పెట్టలేదన్నారు.

# సింగరేణిలో వనమహోత్సవం

## 40 లక్షల మొక్కలు నాటే లక్ష్యం

## సిఎండి బలరామ్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జూన్ 1వ నుండి సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున వన మహోత్సవ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. ఈ ఏడాది తమ సంస్థ పరిధిలో 675 హెక్టార్లలో 40 లక్షల మొక్కలను నాటి సంరక్షించాలని చెప్పారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ ఏరియాల వారీగా వన మహోత్సవ లక్ష్యాలను ఈ సందర్భంగా ఆయన తెలుసుకున్నారు. నిర్ణీత లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవ వ్యాప్తి ప్రతి ఏరియాలో ఉత్సాహంగా నిర్వహించాలని, కార్మికులు, స్థానికులు పాల్గొనేలా చూడాలని సూచించారు. అలాగే సింగరేణి వ్యాప్తంగా భూగర్భ జలాల పెంపుదలకు చేపట్టిన నీటి బిందువు జలసింధువు పై సమీక్షించారు. సింగరేణి ప్రాంతంలో మొత్తం 62 మినీ చెరువుల తవ్వాలని నిర్ణయించగా, వీటిలో ఇప్పటికే 48 చెరువుల నిర్మాణం పూర్తయిందన్నారు. ఇంకా మిగిలిన మినీ చెరువుల నిర్మాణం వారం లోగా పూర్తి చేయాలని సూచించారు.

ఇప్పటికే ఆయా ఏరియాల్లో ఉన్న చెరువుల్లో 43 చెరువుల్లో పూడికతీత పనులను పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇందులో 25 చెరువుల్లో పనులు పూర్తయినట్లు వివరించారు. మిగిలిన స్థానిక ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తద్వారా సింగరేణి ఆధ్వర్యంలో 105 నూతన చెరువుల నిర్మాణం, పూడికతీత చేసినట్లు అవుతుందని, ఇది అతి పెద్ద సామాజిక ప్రయోజన కార్యక్రమంగా నిలిచిపోతుందన్నారు. వర్షాకాలంలో కొత్తగా ఏర్పాటు చేసిన చెరువుల్లో నీరు చేరే విధంగా తగు సివిల్ పనులు పూర్తి చేయాలని, నీటి నిలువ గరిష్టంగా ఉండేలా చూడాలని సూచించారు.

పనుల్లో నాణ్యత ఉండాలని, చెరువు కట్టలు పటిష్టంగా ఉండే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఇడి ఎస్.డి.ఎం.సుభాని, సింగరేణి అటవీ సలహాదారులు మోహన్ పరిగేన్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలపై అసత్య ప్రచారాన్ని సహించం

## డిగ్రీ కాలేజీల్లో కూచిపూడి, కథాకళి నాట్య కోర్సులు ఈ యేడాది నుంచే ప్రారంభం

## గతంలో సొసైటీ నిధుల దుర్వినియోగంపై విచారణ

## ఎస్‌సి గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్‌సి గురుకులాలపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని.. రాజకీయ అవసరాల కోసం గురుకులాలను వాడుకుంటే చూస్తూ ఊరుకోబోమని గురుకుల సొసైటీ కార్యదర్శి విఎస్ అలగు వర్షిణి స్పష్టం చేశారు. ఈ యేడాది నుంచే గురుకుల డిగ్రీ కాలేజీల్లో కథాకళి, కూచిపూడి వంటి నాట్య కోర్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అనుమతి కోసం ఇప్పటికే సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయానికి దరఖాస్తు చేసినట్టు తెలిపారు. ఈ యేడాది మే నెలలోనే గురుకుల స్కూళ్లలో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయగలి గామని తెలిపారు. గురుకుల సొసైటీలో జరుగుతున్న పరిణామాలపై సొసైటీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. గురుకులాల్లో 5వ తరగతిలో అడ్మిషన్లను మే నెలలోనూ పూర్తి చేశామని తెలిపారు. డిగ్రీ కాలేజీల్లో గత యేడాది వరకు 50 శాతం అడ్మిషన్లు కూడా జరగలేదని.. కానీ ఈ యేడాది 30 కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ బిపిఈడి కోర్సును ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. 12 జూనియర్ కాలేజీలకు భవనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతానికి వాటిల్లో అడ్మిషన్లు చేపట్టలేదని.. భవనాలను చూసి వెంటనే వాటిల్లో కూడా అడ్మిషన్లను చేపడతామని సెక్రటరీ తెలిపారు. పిల్లల చేత టాయిలెట్స్ శుభ్రం చేయిస్తున్నారనే దుష్ప్రచారం సోషల్ మీడియాలో జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టాయిలెట్స్‌పై సోషల్ మీడియాలో ఉన్న వాయిస్ తనదేనని.. తాను రెండున్నర గంటలపాటు గురుకులాల్లో ఏమేమీ చేయాలో ప్రిన్సిపాల్స్‌కి చెప్పానని దానిలో కేవలం 4 నిమిషాల మాటలను అది కూడా ఎడిట్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని.. ఇది కేవలం రాజకీయ అవసరాల కోసమే చేస్తున్నారని తెలిపారు. గతంలో సొసైటీ నిధుల్లో గోల్‌మాల్ జరిగిందని తమ సాధారణ పర్యవేక్షణలో తేలిందని.. దానిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నామని.. ప్రభుత్వానికి ఇదే అంశంపై లేఖలు రాశామని.. ప్రభుత్వ నిర్ణయం మేరకు వాటి వివరాలన్నారు. రూ. 25 కోట్ల వరకు దుర్వినియోగం జరిగినట్టు ప్రాథమికంగా తేలిందని పూర్తి వివరాలను తెలియజేస్తామన్నారు. అద్దెబకాయిల విషయంలో తమ నుంచి కొన్ని పొరపాట్లు జరిగాయని తెలిపారు. వాటిని భవిష్యత్‌లో జరగకుండా చూసుకుంటామన్నారు.

# సంక్షేమ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువు పెంపు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త :** స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచింది. అర్హులైన సంక్షేమ విద్యార్థులు జూన్ 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటనలో పేర్కొంది. ఈమేరకు సాంఘీక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, శారీరకంగా వికలాంగులైన విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం మే 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది. 2024-25 విద్యా సంవత్సరానికి కళాశాలలు, విద్యార్థుల రిజిస్ట్రేషన్ కోసం టీఎస్ ఈ పాస్ వెబ్‌సైట్లో సెప్టెంబర్ 01, 2024 నుండి ప్రారంభించారు. అయితే దశల వారీగా గడువు పొడిగిస్తూ వచ్చారు. కాగా గత విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల లక్ష్యం 11,88,120 కాగా, ఇప్పటివరకు 10,75,041 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇంకా దాదాపు 1,13,079 దరఖాస్తులు నమోదు చేయాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం మరోసారి గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అన్ని సంక్షేమ శాఖలు రెన్యువల్, కొత్త స్కాలర్షిప్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై విస్తృత ప్రచారం చేయాలని. అర్హత ఉన్న విద్యార్థులందరూ 2024-25 విద్యా సంవత్సరానికి నమోదు చేసుకోగలిగేలా 30.06.2025 నాటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యం ఉన్నంతవరకు సజీవంగా కాంగ్రెస్ పార్టీ

## పిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నంత వరకు కాంగ్రెస్ బతికే ఉంటుందని టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్, బిజెపిలు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను డైవర్ట్ చేయాలని కొత్త నాటకాలు ఆడుతున్నారని అన్నారు. బిజెపి దర్శకత్వంలో బిఆర్ఎస్ డ్రామా కంపెనీ నడుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగి పోయే నావ అని కవిత అంటుంది, మీ కల్వకుంట్ల పార్టీ మునిగి పోయే నావ అన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఎవరు మునిగి పోలేదన్నారు. కాంగ్రెస్‌ను నమ్ముకొని కెసిఆర్ ఎదిగిండు అన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక అర్హత బండిసంజయ్, కిషన్‌రెడ్డిలకు లేదు అన్నారు. బిఆర్ఎస్, బిజెపిలో విలీనం చేయాలని చూస్తున్నారు అని కవిత ఇప్పుడు అంటుంది, కానీ కెసిఆర్ బిఆర్ఎస్‌ను ఎప్పుడో బిజెపిలో కలిపారని అన్నారు. మేము 2023లోనే బిజెపి, బిఆర్ఎస్‌లు ఒక్కటే అని అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారన్నారు. 2023 ఎన్నికల్లో 8 ఎమ్మెల్యే సీట్లు బిజెపి గెలిస్తే, 2024 లో 8 పార్లమెంట్ సీట్లు ఎట్లా గెలిచారు అంటూ ప్రశ్నించారు. ఒక్క ఎమ్మెల్యే లేకుండా 5పార్లమెంట్ సీట్లలో ఎట్లా గెలిచారు అన్నారు.


# ఎన్నికల ప్రస్థానంలో సంస్కరణలు తేవాలి

## అందుకు మీడియా, ప్రసార మాధ్యమాలు నడుం బిగించాలి: తమిళనాడు మాజీ గవర్నర్ పి.ఎస్.రామ్మోహన్‌రావు

## ఎన్టీఆర్‌ను ఏరూపంలో చూసినా హృదయాల్లో హత్తుకుపోయే చిరస్మరణీయుడు : డా. కొలకలూరి ఇనాక్

## కంఠంనేని రవిశంకర్‌కు ఎన్‌టిఆర్ పురస్కార ప్రదానం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 31, ప్రభాతవార్త :** నేడు ప్రజాస్వామ్యం ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల గురించి తెలుసుకోకుండా ఎక్కువ డబ్బులిచ్చే అభ్యర్థికే ఓటేసే దౌర్భాగ్యస్థితి నెలకొందని, మీడియా, ప్రసార, సామాజిక మాధ్యమాలు మన ఎన్నికల ప్రస్థానంలో సంస్కరణలను తీసుకు రావాలని, లేకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచి ఉందని తమిళనాడు మాజీ గవర్నరు పి.ఎస్.రామ్మోహన్‌రావు స్పష్టం చేశారు. ఎన్నికల్లో పార్టీల విధానాలు, సమీక్షించే విశ్లేషణలు లేవని, శాసనసభ, పార్లమెంటులలో కూడా దేశం ముందున్న సమస్యలపై చర్చలు జరగడం లేదని, ప్రజాస్వామ్య విలువలు దిగజారి పోతున్నాయన్నారు. ముఖ్యంగా ప్రభుత్వాలు వచ్చే ఆర్థిక వనరులను శాంతిభద్రతలు, న్యాయం, ఆహారం, ఆరోగ్యం, విద్యలకు వినియోగించాల్సిందిపోయి పూర్తిగా విస్మరిస్తూ ఉచిత పథకాలకు ప్రాధాన్యతనిస్తూ అప్పుల ఊబిలో పడిపోయి ప్రజాస్వామ్యం కునారిల్లుతోందని చెప్పారు. రాజకీయాలు చాలా కలుషితమై పోయాయని, ఆయా పార్టీలు ఒకరినొకరు నిందించుకోవడమే విధిగా సాగుతూ ప్రజాస్వామ్య, ప్రభుత్వాల, ప్రజాసమస్యలకు తిలోదకాలు వదలారని ఆవేదన వ్యక్తపరిచారు. వీటిపై మాధ్యమాలు దృష్టిసారించాలన్నారు. చివరిగా ఎన్టీరామారావు తీసుకొచ్చిన సంస్కరణలు, విధానాలతోపాటు పలు సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న తెలుగు వన్ చానల్ అధినేత కంఠం నేని రవిశంకర్‌కు ఎన్‌టిఆర్ పురస్కారం ప్రదానం చేయడం ఎంతో సబబుగా ఉందని ఆయన్ను అభినందించారు. ఆదాయ పన్నుశాఖ మాజీ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప సభాధ్యక్షతన జరిగిన ఎన్టీరామారావు 103వ జయంతికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పి.ఎస్.రామ్మోహన్‌రావు విశిష్ట అతిథులు పద్మశ్రీ డా. కొలకలూరి ఇనాక్, జస్టిస్ బి.చంద్ర కుమార్, డా. సముద్రాల వేణుగోపాలాచారి, ఎం.కె.ఆర్.ఆశాలత తదితరులతో కలిసి కంఠంనేని రవిశంకర్‌ను ఘనంగా సత్కరించి ప్రతిష్టాత్మక ఎన్‌టిఆర్ పురస్కారం ప్రదానంచేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎన్‌టిఆర్ పురస్కారంతో రవిశంకర్‌ను సత్కరిస్తున్న రామ్మోహన్‌రావు, కొలకలూరి ఇనాక్, చంద్రకుమార్, ఎంకె. రాము తదితరులు

# ఔట్‌సోర్సింగ్‌లో కండక్టర్ల నియామకంపై యూనియన్ల మండిపాటు

## రెగ్యులర్ విధానంలో నియామకాలకు డిమాండ్

## జూన్ 17న నిరాహారదీక్ష చేపట్టనున్న ఎస్‌డబ్ల్యూయు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి)లో ప్రైవేట్ మ్యాన్‌పవర్ ఏజెన్సీల ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్ల నియామకాలు చేపట్టాలనుకుంటున్న యాజమాన్య నిర్ణయాన్ని అన్ని యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఆర్‌టిసిలో నియామకాలు చేపట్టలేదని.. ఇప్పుడు కూడా రెగ్యులర్ విధానంలో నియామకాలు చేపట్టకుండా ఔట్‌సోర్సింగ్ విధానంలో కండక్టర్లను నియమించడంపై యూనియన్లు మండిపడుతున్నాయి. ఆర్‌టిసిలో 3,038 కొత్త ఉద్యోగాల నియామకానికి ఉత్తర్వులిచ్చిన సంస్థ వాటిని ఔట్‌సోర్సింగ్ విధానంలో ప్రైవేట్ మ్యాన్‌పవర్ ఏజెన్సీల ద్వారా నియమించుకోవడం ఏమిటని సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కండక్టర్ పోస్టులను రెగ్యులర్ విధానంలోనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని అందుకు తగిన మార్గదర్శకాలను జారీచేసిన ఉత్తర్వులను వెంటనే నిలిపి వేయాలని, లేదంటే ఆర్‌టిసి కార్మికులతో పాటు లక్షలాది నిరుద్యోగ యువతి యువకుల్లో ప్రభుత్వంపై తీవ్రవ్యతిరేకత వస్తుందని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూని యన్(ఎస్‌డబ్ల్యూయు) తెలిపింది.

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను పూర్తిచేసి అపాయింటెడ్ డే ప్రకటించాలని ఎస్‌డబ్ల్యూయు జనరల్ సెక్రటరీ రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఇదే సమస్యపై జూన్ 17న సాముహిక నిరాహార దీక్షను చేపట్టనున్నట్టు తెలిపారు.

సంవత్సరం నుండి ఆర్‌టిసిలో 3,038 పోస్టులకు కొత్త ఉద్యోగ నియామాలకు అనుమతిచ్చామని ఒకవైపు ప్రకటిస్తూ వస్తున్న ప్రభుత్వం మరోవైపు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్ల నియామాకాలను చేపట్టాలన్న ప్రక్రియను నిలిపివేయాలి డిమాండ్ చేశారు. గతంలో వలే ఆర్‌టిసి యాజమాన్యమే శాశ్వత ప్రాతిపాదికన నియమించుకునేవిధంగా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంకా ఔట్‌సోర్సింగ్ విధానం అమలు చేయడం ఏమిటనీ.. నియామకాలను రెగ్యులర్ విధానంలోనే చేపట్టాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్‌రావు డిమాండ్ చేశారు.

# నేడు బిజెపి కార్యాలయంలో ఎంపిలు, ఎమ్మెల్యేలతో వర్క్‌షాప్

## ముఖ్యఅతిథిగా హాజరుకానున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర పదాధికారులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, బిజెపి జిల్లా అధ్యక్షులలకు వర్క్‌షాప్ నిర్వహించనున్నారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ 11 సంవత్సరాల పరిపాలన, రానున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ రాష్ట్ర రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న కార్యక్రమాలు చర్చించనున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు వ్యవసాయ సంబంధించి కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన నష్టం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం తదితర అంశాలను చర్చించనున్నారని తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.కోదండరామ్. చిత్రంలో అజీజ్‌పాషా, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

# పాలస్తీనాపై ఇజ్రాయెల్ మారణహోమాన్ని తక్షణమే ఆపాలి

## పలువురు ప్రముఖుల విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 31, ప్రభాతవార్త:** పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమాన్ని తక్షణమే నిలుపుదల చేయడానికి భారతదేశంతోపాటు ప్రపంచ దేశాలు ముందుకు రావాలని పలువురు ప్రముఖులు విజ్ఞప్తి చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల వల్ల వేలాదిమంది పిల్లలు, మహిళలు, పురుషులు, ప్రజలు చనిపోతున్నారని, ఇప్పటికే అనేకమంది చనిపోయారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పాలస్తీనా ప్రజలకు సంఘీభావ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, హైకోర్టు మాజీ న్యాయమూరి జస్టిస్ బి.చంద్రకుమార్, సిపిఎం నేత అబ్బాస్ తదితరులు మాట్లాడారు. నిస్సహాయస్థితిలో ఉన్న గాజాపై ఇజ్రాయెల్ దారుణంగా దాడులకు పాల్పడటం అన్యాయమన్నారు. అక్కడ 60 వేల మంది చిన్నారులు పోషకాహారం లోపంతో బాధపడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మానవతా సహాయాన్ని ఇజ్రాయెల్ నిరంతరం అడ్డుకోవడాన్ని ప్రపంచ దేశాలు ఖండించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఉమర్ అహ్మద్ హసిజ్, అబ్బాస్, సారా మాథ్యూస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్దుబాటు ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలి

## ప్రాథమిక పాఠశాలల పట్ల వివక్ష తగదు

## జూలై, ఆగస్టు నెలల్లో సర్దుబాటు చేయాలి

## ప్రభుత్వానికి సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సర్దుబాటు ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్‌జిటియు) డిమాండ్ చేసింది. జులై, ఆగస్టు నెలలో సర్దుబాటు చేయాలని, ప్రాథమిక పాఠశాలల పట్ల ప్రభుత్వ వివక్ష తగదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిగులు టీచర్లను సర్దుబాటు చేయాలని ఉద్దేశంతో తీసుకొచ్చిన అశాస్త్రీయంగా ఉన్న ఈ ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బడిబాట తర్వాత నమోదు అయిన విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాల్సిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను బడిబాటకు ముందే ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలు ఒకరు లేకపోతే ఇద్దరు ఉపాధ్యాయులతో నడుస్తూ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని.. 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరే ఉపాధ్యాయులు 18 సబ్జెక్టులు ఎలా బోధించాలన్నారు.

చాలా ఇబ్బందికరమైన పరిస్థితులలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం నిర్వహించడానికి, క్వాలిటీ ఎడ్యుకేషన్‌ను అందించడానికి ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయులు, తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయున్ని కేటాయించకుండా పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను కూడా సర్దుబాటు పేరుతో ఏకపక్షంగా తీసేస్తే పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం, గుణాత్మక విద్య అనేది శూన్యం అవుతుందన్నారు.

ప్రజా ప్రభుత్వం గనక బడుగు బలహీన వర్గాల పేద పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చిత్తశుద్ధితో కనుక ఉన్నట్లయితే సర్దుబాటు ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలన్నారు.

బడిబాట కార్యక్రమంలో ఇప్పుడిప్పుడే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల వైపు నడిపిస్తున్న సమయంలో విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోనికి నెట్టే విధంగా తీసుకొచ్చిన ఉత్తర్వులను వేంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మిగులు టీచర్లున్నట్లు జూన్‌లోనే ఎలా తేల్చుతారని.. చాలా ప్రాంతాల్లో సర్కారు బడుల్లో విద్యార్థులు చేరేందుకు ముందుకొస్తున్నారని బడిబాట ముగిసిన తరువాత పిల్లల నమోదును పరిశీలించి జులై, ఆగస్టు మాసాల్లో చేయాల్సిన సర్దుబాటును జూన్‌లోనే చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు.

'భైరవం సినిమాకి ఇంత అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చిన ఆడియన్స్‌కి థ్యాంక్ యూ. ఇది నాకు వెరీ మెమరబుల్ డే. సినిమాని అందరూ థియేటర్స్ లోనే చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను: ప్రెస్ మీట్ లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 'భైరవం'కు ఇంత ప్రేమ, ఆదరణ చూపించిన ప్రతి ఒక్కరికి థ్యాంక్యూ: హీరో మంచు మనోజ్ 'భైరవం'కు ఆడియన్స్ నుంచి గ్రేట్ రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది: హీరో నారా రోహిత్బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గాడా సమర్పించారు. మే 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్ తో బ్లాక్ బస్టర్ హిట్ ని అందుకుని సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రెస్ మీట్‌లో

# 'భైరవం'కు అద్భుతమైన రెస్పాన్స్



హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ,అందరికీ నమస్కారం. మా అందరికీ కొంచెం గ్యాప్ వచ్చినా ఆడియన్స్ నుంచి ఇంత సపోర్ట్, ప్రేమ రావడం మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమా తప్పకుండా మీరందరూ థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయాలి. ఇలాంటి మంచి సినిమా చూస్తే మీకు కూడా ఒక మంచి ఫీలింగ్ ఉంటుంది. ఆ రోజంతా ఎనర్జిటిక్ గా ఉంటారు. ఇలాంటి సినిమా మీరందరూ చూసి మమ్మల్ని ప్రోత్సహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. . నాకు ఈరోజు వెరీ హ్యాపీ మూమెంట్. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నమెంట్‌కి ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను. ఇది నాకు వెరీ మెమొరబుల్ డే. ఈ సినిమాని, నన్ను సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికి థాంక్యూ. తప్పకుండా ఈ సినిమాని అందరూ థియేటర్స్ లోనే చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నానన్నారు.హీరో మంచు మనోజ్ మాట్లాడుతూ,అందరికీ నమస్కారం. భైరవం సినిమాకి గొప్ప విజయం ఇచ్చినందుకు ఆడియన్స్‌కి థాంక్యూ. ఈ సినిమా మాకు ఇచ్చిన డైరెక్టర్ విజయకి జీవితాంతం రుణపడి ఉంటాం. సినిమాని అద్భుతంగా ప్రజెంట్ చేశారు. మా టీమ్ అందరికీ థాంక్ యూ. తమ్ముడు సాయి శ్రీనివాస్ గ్రేట్ పర్ఫామెన్స్ ఇచ్చాడు. రోహిత్ బాబాయ్ కంగ్రాజులేషన్స్. 9సంవత్సరాలు తర్వాత వచ్చిన నాకు ఇంత ప్రేమ ఆదరణ చూపించిన ప్రతి ఒక్కరికి థాంక్యూ. రేపటి నుంచి ప్రతి ఒక్క ఊరికి రావడం జరుగుతుంది. ఇది విజిల్స్ వేసి గోల చేసే సినిమా. ప్రతి ఒక్కరూ వెళ్లి థియేటర్స్ లో చూడండి. ఈ సినిమాని ఇంకొంచెం పెద్ద విజయం చేసి సూపర్‌డూపర్ హిట్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు.

# "ధర్మచక్రణ్ణ సినిమా ఆడియో రిలీజ్



విశ్వ విఖ్యాత నందమూరి తారకరామారావు జన్మదినోత్సవం పురస్కరించుకొని మహానాడు పర్వదిన సందర్భంగా వెంకటరమణ పసుపులేటి సృష్టించిన "ధర్మచక్రణ్ణ సినిమా ఆడియో విడుదల.సంచలనాలకు తెర లేపబోతున్న 'ధర్మచక్రణ్ణ మూవీచంద్రన్న చరిత్ర స్ఫూర్తితో ఎస్ఐఎఫ్ఎఎ సంస్థ నిర్మాణంతెలుగు రాజకీయ, సినీ రంగాల్లో సంచలనం సృష్టించేందుకు సిద్ధమవుతోన్న చిత్రం 'ధర్మచక్రణ్ణ . ఈ సినిమాను నిస్వార్థ సేవా దృక్పథంతో స్థాపితమైన ఎస్ఐఎఫ్ఎఎ సంస్థ నిర్మిస్తోంది. ఈ సంస్థను స్థాపించిన వ్యక్తి, గత ముప్పై ఏళ్లుగా సొంత ఖర్చులతో, ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా, ఏపి సిఎం చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంల 'ధర్మచక్రణ్ణ సినిమా షూటింగ్ పూర్తయినట్లు ఎస్ఐఎఫ్ఎఎ సంస్థ ప్రకటించింది. ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది.ఈ సందర్భంగా మూవీ డైరెక్టర్ వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ, 'ధర్మచక్రణ్ణ సినిమా చంద్రబాబు నాయుడు ఎంతో కష్టపడి, పార్టీ విలువలను కాపాడిన జీవన గాథకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఈ సినిమా ద్వారా నోటు రుచి మరిగిన వారికి పదవులిస్తే ఓటు విలువ తగ్గుతుందనే సందేశాన్ని ప్రేక్షకులకు అందిస్తున్నాం. ధర్మం గెలుస్తుంది అనే సందేశాన్ని తెరకెక్కించాము. రాముడుని అడవికి పంపించే దాక మందర నిద్రపోని విధంగా, ఈ సినిమాను ఆపాలని కొందరు ప్రయత్నిస్తున్నప్పటికీ, 'ధర్మచక్రణ్ణ సినిమా సూపర్ హిట్ అవుతుంది, చంద్రబాబునాయుడు చరిత్రకారుడు అవుతారు అని ధర్మచక్రం ఋజువు చేస్తుంది అని ఎస్ఐఎఫ్ఎఎ సంస్థ ధీమాగా ఉంది. రాముడు దేవుడయ్యాడు, మందర చరిత్ర హీనమైంది. విశ్వవిఖ్యాత నందమూరి తారకరామారావు జన్మదినోత్సవం పురస్కరించుకొని మహానాడు పర్వదిన సందర్భంగా "ధర్మచక్రణ్ణ సినిమా ఆడియో విడుదల కావడం సంతోషంగా ఉందని అన్నారు.సినిమా విడుదలకు ముందు,ఎస్ఐఎఫ్ఎఎ గ్రూప్ సభ్యులు ఐకమత్యంతో సోషల్ మీడియాలో పాటలను, చిత్ర విశేషాలను ప్రచారం చేసి, జాతరో జాతర సృష్టించాలని చిత్ర యూనిట్ పిలుపునిచ్చింది, ఎస్ఐఎఫ్ఎఎ సంస్థ తమ విలువలకు కట్టుబడి, ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి కృషి చేస్తోంది. సినిమాను విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.దర్శకుడు: వెంకటరమణ పసుపులేటి, లిరిక్స్: వెంకటరమణ పసుపులేటి,సంగీతం: రాజకిరణ్, గాత్రం: మాళవిక, రాంకీ, వినాయక్, పీఆర్వో: కదలి రాంబాబు, అశోక్ దయ్యాల .



రశ్మిక మందన్నా

యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై అహాన్ పాండే, అనీత్

# 'సైయార్ణా టీజర్ విడుదల..

పద్దా జంటగా మోహిత్ సూరి తెరకెక్కించిన 'సైయార్ణా టీజర్ విడుదల. యష్ రాజ్ ఫిల్మ్స్ (వైఆర్ఎఫ్) నిర్మాణంలో మోహిత్ సూరి తెరకెక్కించిన చిత్రం 'సైయార్ణా వైఆర్ఎఫ్ నీ బ్యానర్ నుంచి వచ్చే ప్రేమ కథా చిత్రాలకు ఉండే ఫాలోయింగ్, క్రేజ్ అందరికీ తెలిసిందే. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగానే ఈ 'సైయార్ణా చిత్రాన్ని రూపొందించారు. అహాన్ పాండేను హిందీ చిత్ర పరిశ్రమకు ఈ చిత్రంతోనే హీరోగా పరిచయం చేయనున్నారు. ఈ క్రమంలో అహాన్ పాండే, అనీత్ జంట ఎలా ఉండబోతోంది? అసలు వారిద్దరి ప్రపంచం ఎలా ఉంటుందో తెలియజేసేందుకు టీజర్‌ను విడుదల చేశారు. ఇంటెన్స్ లవ్ స్టోరీగా రాబోతోన్న ఈ 'సైయార్ణా టీజర్‌ను రిలీజ్ చేశారు. సైయారా చిత్రాన్ని కంపెనీ సిఇఓ అక్షయ్ విధాని నిర్మించారు. ఇక ఈ మూవీ టీజర్‌ను గమనిస్తే. ఇదొక ఇంటెన్స్ లవ్ డ్రామా అని అర్థం అవుతోంది. నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ఈ ప్రేమ కథను అంతే అందంగా తెరకెక్కించారు. హీరో హీరోయిన్ల పరిచయం, ప్రేమ, బ్రేకప్ వంటి సీన్లతో టీజర్‌ను అందంగా మలిచారు. ఇద్దరి నటన ఈ టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవచ్చు. ఇక విజువల్స్, మ్యూజిక్ ఈ చిత్రానికి మేజర్ అస్సెట్ కానున్నాయి. సైయారా అంటే ఆకాశంలోని ఒంటరి తార అని టీజర్ చూస్తే అర్థం తెలుస్తోంది.



# 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ్ణ నుంచి ప్లెజెంట్ టీజర్

**మేఘాలు** చెప్పిన ప్రేమకథ చాలా నిజాయితీగా తీసిన ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్. తప్పకుండా అందరికీ నచ్చుతుంది: టీజర్ లాంచ్ఈవెంట్ లో డైరెక్టర్ విపిన్ టీంయంగ్ హీరో నరేష్ అగస్త్య అప్ కమింగ్ మూవీ మేఘాలు చెప్పిన ప్రేమ కథతో అందరినీ ఆకర్షించడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ చిత్రం సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై ఉమా దేవి కోట నిర్మిస్తున్నారు. విపిన్ దర్శకత్వం వహించిన కంటెంట్‌రిచ్ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా ఇది. ఫస్ట్ లుక్ పోస్టర్ తో పాజిటివ్ బజ్ క్రియేట్ చేసిన తర్వాత, మేకర్స్ ఇప్పుడు టీజర్ ను లాంచ్ చేశారు. ఈఒకప్రతిభావంతమైనసంగీతకారుడి చుట్టూ తిరుగుతుంది. అతడు ఒక గొప్ప ఆల్బమ్‌కి స్ఫూర్తి పొందేందుకు ప్రశాంతమైన పర్వతప్రాంతానికి వెళ్తాడు. అక్కడ ఓ అమ్మాయిని కలుస్తాడు. ఈ ఇద్దరి జర్నీ హృదయానికి హత్తుకునే బంధాన్ని తెరపై ఆవిష్కరిస్తాయి. టీజర్ చివర్లో హీరో లేచిపోయిన జంటని చూశావాఅని హీరోయిన్ ని సరదాగా అడిగే సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.నరేష్ అగస్త్య తన పాత్రలో చక్కగా ఒదిగిపోయారు. రబియా ఖతూన్ లైవ్లీగా కనిపించింది రాధికా శరత కుమార్ కథకు బలాన్నీ, వాల్యూని జోడించుతుంది. దర్శకుడు విపిన్ ఒక అందమైన ప్రేమకథను ఎంచుకున్నారు,



అద్భుతమైన పర్వతప్రాంతంలోని నేపథ్యంలో సాగుతుంది, అక్కడ సంగీతం ఒక కీలకమైన పాత్రను పోషిస్తుంది. సినిమాటోగ్రాఫర్ మోహన కృష్ణ సహజ సౌందర్యాన్ని అద్భుతంగా చిత్రీకరించారు. సంగీత దర్శకుడు జస్టిన్ ప్రభాకరణ్ మ్యూజిక్ మ్యాజికల్ గా వుంది. డైలాగ్స్ కట్టిపడేస్తున్నాయి. ఆర్ట్ డైరెక్టర్‌గా తోటా తరణి, ఎడిటర్‌గా మార్తాండ్ కె. వెంకటేష్ అద్భుతమైన వర్క్ అందించారు. టీజర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిత్రం గ్రాండ్ థియేట్రికల్‌విడుదల కోసం ప్రేక్షకుల్లో క్యురియాసిటీని పెంచింది. ఈవెంట్ లో డైరెక్టర్ విపిన్‌మాట్లాడుతూ.అందరికీ నమస్కారం. ఇది చాలా క్లీన్ ఎంటర్టైనర్. చూసినప్పుడు మంచి ఫీలింగ్ వస్తుంది. మా సినిమాలో ప్రిన్స్ రామ వర్మనే పెద్ద సంగీత విద్వాంసులు, ట్రావెల్ కోర్ వారసులు ఒక ఇంపార్టెంట్ గెస్ట్ రోల్ చేశారు. ఆయన రాచరికాన్ని అన్నిటిని త్యాగం చేసి మంగళంపల్లి వారి దగ్గర 18 సంవత్సరాలు సంగీత సాధన చేశారు. అలాంటి స్పెషల్ పర్సన్ మన సినిమాలో పాడారు. అలాగే నటించారు. ఇందులో ఒక పాట ఉంది. అనే బ్యూటిఫుల్ లొకేషన్లో జరిగే బ్యూటిఫుల్ కథ ఇది.

# 'జర్నీఆఫ్ ఎమోషనల్ స్కై టీజర్ణ లాంచ్

**త్వరలో గ్రాండ్** థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న మూవీ.. మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "స్కైణ. ఈ చిత్రాన్ని వాలోర్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ లో నాగి రెడ్డి గుంటక, పృథ్వీ పెరిచెర్ల, శ్రీ లక్ష్మీ గుంటక, మురళీ కృష్ణంరాజు నిర్మిస్తున్నారు. పృథ్వీ పెరిచెర్ల దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న "స్కైణ సినిమా నుంచి జర్నీ ఆఫ్ ఎమోషనల్ స్కై టీజర్ణ లాంఛ్ చేశారు. హైదరాబాద్ లో జరిగిన ఈ కార్యక్రమంలో మూవీ టీమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగాహీరోయిన్ శృతి శెట్టి మాట్లాడుతూ , "స్కైణ సినిమాలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. మా టీమ్ అంతా మనసు పెట్టి ఈ మూవీకి వర్క్ చేశాం. వీలైనంత త్వరగా "స్కైణ సినిమాను మీ ముందుకు తీసుకురావాలని ఎగ్జైటింగ్ గా ఉన్నాం. మా సినిమా ప్రతి ఒక్క ఆడియెన్ కు నచ్చుతుంది. అన్నారు.హీరో, నిర్మాత మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ, నన్ను నేను హీరోగా కంటే ఒక నటుడిగా భావిస్తా. ఈ సినిమాలో ప్రతిభ గల టీమ్ తో వర్క్ చేయడం హ్యాపీగా ఉంది.



రీసెంట్ గా మా మూవీ స్క్రీనింగ్ చేసినప్పుడు నా క్యారెక్టర్ ను మర్చిపోయి సినిమాను ఎంజాయ్ చేశా. నేను ఎలా నటించాను అని మా టీమ్ మెంబర్స్ ను అడిగితే ఎంకరేజింగ్ గా చెప్పారు. మా టీమ్ లో రసూల్ గారి లాంటి చాలా ఎక్స్‌పీరియన్స్ టెక్నీషియన్ ఉండటం ఎంతో కాన్ఫిడెన్స్ ఇచ్చింది. త్వరలోనే "స్కైణ మూవీతో మీ ముందుకు వచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాం. అన్నారు.సినిమాటోగ్రాఫర్ రసూల్ ఎల్లోర్ మాట్లాడుతూ ఒక కాంపాక్ట్ బడ్జెట్ లో పర్ఫెక్ట్ గా ఒక మూవీ చేస్తే ఎలా ఉంటుంది అనేందుకు మా "స్కైణ సినిమా ఎగ్జాంపుల్.ఛాలెంజింగ్ గా తీసుకుని ఈ సినిమాకు ప్రతి ఒక్కరం పనిచేశాం. ఆ ప్రయత్నంలో సక్సెస్ అయ్యామని నమ్ముతున్నాం. మా "స్కైణ సినిమాకు మీడియా మిత్రులు సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా. మీరు సపోర్ట్ చేస్తే మరిన్ని ఇలాంటి మంచి చిన్న బడ్జెట్ మూవీస్ వస్తాయి. డైరెక్టర్ పృథ్వీ పొయెటిక్ కథతో చాలా ప్యాషనేట్ గా ఈ మూవీని రూపొందించారు. మీ అందరికీ ఈ సినిమా నచ్చుతుందని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ పృథ్వీ పెరిచెర్ల మాట్లాడుతూ, సినిమా మేకింగ్ అంటే ఏంటో, ఏ క్రాఫ్టులు కలిసి పనిచేస్తాయో అవగాహన తెచ్చుకుంటూ ఈ చిత్రానికి సన్నాహాలు చేసుకున్నాం. డైరెక్టర్ గా నాకు ఇది డెబ్యూ మూవీ. నేను ముందు ప్రొడ్యూసర్ నాగిరెడ్డి గారిని కలిశాను. ఆ తర్వాత రసూల్ గారిని కలిశాను. సినిమా మీద ప్యాషన్ తో మేమంతా వర్క్ చేశాం. ఇటీవల "స్కైణ మూవీ షో చూసి మూవీ చాలా బాగుందని అంతా చెప్పారు.

# 'దండోర్ణా తో నటిగా అదితి భావరాజు ఎంట్రీ

లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న 'దండోర్ణా మూవీతో నటిగా ఎంట్రీ ఇస్తోన్న సింగర్ అదితి భావరాజులౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌ను స్థాపించి తొలి చిత్రం కలర్‌ఫోటోతో అందరి దృష్టిని ఆకర్షించిన డైనమిక్ ప్రొడ్యూసర్ రవీంద్ర బెనర్జీ ముప్పనేని.. ఆ తర్వాత 'బెదురులంక 2012ణ వంటి సూపర్ హిట్ చిత్రాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. మరోసారి ఆయన తన సక్సెస్‌ఫుల్ బ్యానర్‌పై నిర్మిస్తోన్న లేటెస్ట్ ఎగ్జయిటింగ్ మూవీ 'దండోర్ణా. ఈ చిత్రానికి మురళీకాంత్ దర్శకత్వంవహిస్తున్నారు.గ్రామీణ తెలంగాణ నేపథ్యంలో రూపొందుతోన్న'దండోర్ణా లో బలమైన ప్రేమ కథాంశంతో పాటు కఠినమైన నిజాలను, సమాజంలో కొనసాగుతోన్న సామాజిక దుష్ప్రవర్తలను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మోనికా రెడ్డి, బిందు మాధవి,రాధ్య తదితరులు ప్రధాన పాత్రల్లో మెప్పించనున్నారు.ఇప్పుడు టాలెంటెడ్ సింగర్ అదితి భావరాజు నటిగా ఈ చిత్రంతో సిల్వర్ స్క్రీన్‌పై ఎంట్రీ ఇస్తున్నారు. ఎన్నో చార్ట్ బస్టర్ సాంగ్స్‌ను ఆలపించిన అదితి 'దండోర్ణా చిత్రంలో నటనా ప్రతిభను ప్రదర్శించనుంది. ఆమె ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు.దండోరా మూవీ ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది.తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో పలు కీలక షెడ్యూల్స్‌ను పూర్తి చేశారు. ఇటీవల విడుదలైన మూవీ ఫస్ట్ బీట్ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. దీంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. రాబోయే రోజుల్లో సినిమా నుంచి మరిన్ని ఆసక్తికరమైనవిశేషాలనుతెలియజేస్తామని మేకర్స్ తెలియజేశారు.మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్నఈ సినిమాకు మార్క్ కె.రాబిన్‌సంగీతాన్నిసమకూరుస్తున్నారు. వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రాఫర్‌గా, సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా, క్రాంతి ప్రియం ఆర్ట్



డైరెక్టర్‌గా, రేఖా బొగ్గారపు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు. ఎడ్వర్డ్ స్టీవెన్‌సన్ పెరెజి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కొండారు వెంకటేష్ లైన్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. బియాండ్ మీడియా నుంచి నాయుడు సురేంద్రకుమార్, ఫణికందుకూరి మీడియా మేనేజ్‌మెంట్ పిఆర్ వర్క్‌ను. టికెట్ ఫ్యాక్టరీ మార్కెటింగ్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా యంగ్ హీరో నార్నే నితిన్ "శ్రీ శ్రీ శ్రీ రాజావార్ణు ట్రైలర్ లాంచ్, జూన్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కు వస్తున్న మూవీనార్నే నితిన్ ,చిత్ర పరిశ్రమలోకి ఎన్టీఆర్ బావమరిదిగా ఎంట్రీ ఇచ్చి వరుస విజయాలు అందుకుంటున్న యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో.తనకంటూ ఓ పందాన్ని ఏర్పరచుకుని ప్రేక్షకుల మదిలో నటన పరంగా మంచి మార్కులు సంపాదించుకుంటున్నారు నార్నే నితిన్ .అలాగే జాతీయ అవార్డు విన్నర్ , "శతమానం భవతి" దర్శకులు సతీష్ వేగేశ్న దర్శకత్వంలో నార్నె నితిన్ "శ్రీ శ్రీ శ్రీ రాజావార్ణు జూన్ 6న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన సరసన సంపద హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వేధాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు నిర్మించారు. అన్నికమర్షియల్ ఎలిమెంట్స్ తో యూత్ ఫుల్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంఅత్యధిక థియేటర్లలో జూన్ 6న ప్రేక్షకులకు ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ నుహైదరాబాద్‌లో రిలీజ్ చేశారు ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు సతీష్ వేగ్నేష్న, నిర్మాత చింతపల్లి రామారావు, కో ప్రొడ్యూసర్ సుబ్బారెడ్డి,, దర్శక నిర్మాత రాజేష్ పుత్ర, రఘు కుంచే, రచ్చ రవి, సంగీత దర్శకుడు కైలాషా మీనన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగాదర్శకుడు సతీష్ వేగేశ్న మాట్లాడుతూ, మా "శ్రీ శ్రీ శ్రీ రాజావార్ణు సినిమా సాంగ్స్, ట్రైలర్ ను సక్సెస్ చేసిన మీ అందరికీ థ్యాంక్స్. ఈ సినిమాలో నరేష్ గారు ఒక డైలాగ్ చెబుతారు. మనల్ని మనం జయించుకోవడమే సక్సెస్ అంటే. ఈ కాన్సెప్ట్ తో సినిమాను రూపొందించాం. మా హీరో నార్నే నితిన్ పక్కింటి కుర్రాడిలా మొదలుపెట్టి, యాక్షన్ పరంగా ఆకట్టుకుంటూ అద్భుతంగా పర్ ఫార్మ్ చేశాడు. హీరోయిన్ సంపద మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. నా సినిమాల్లో ఎక్కువమంది ఆర్టిస్టులు ఉంటారు. కారణం మన కుటుంబాల్లో ఎలా ఎక్కువమంది మనవాళ్ల ఉండేవారే. నా కథల్లోనూ అలాంటి పాత్రలే పలకరిస్తాయి. మరుగున పడిన కొన్నింటిని చూపించాలనే నా మూవీస్ ద్వారా తాపత్రయపడుతుంటాను. అలాంటి ప్రయత్నమే "శ్రీ శ్రీశ్రీ రాజావార్ణు . ఈ సినిమా మిమ్మల్ని నిరాశపర్చదు. అన్ని

# నార్నే నితిన్ "శ్రీ శ్రీ శ్రీ రాజావార్ణు ట్రైలర్ లాంచ్

విషయాల్లో ఆకట్టుకుంటుంది. నా టెక్నికల్ టీమ్ అందరూ చాలా కష్టపడి పనిచేశారు. అయితే మేము ఎంత కష్టపడినా మీ ఆదరణ ఉంటేనే సక్సెస్ అవుతుంది. జూన్ 6న థియేటర్స్ లోకి వస్తున్న "శ్రీ శ్రీ శ్రీ రాజావార్ణు సినిమాను సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు.నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ, ఒక మంచి కమర్షియల్ ఎలిమెంట్స్ తో బిగ్ హిట్ మూవీని నిర్మించాలని నార్నె నితిన్, వేగేశ్న సతీష్ కాంబినేషన్లో ఈ చిత్రాన్ని రూపొందించాం. మా చిత్ర హీరో నార్నె నితిన్ ఇటీవల మంచి యూత్ ఫుల్ ఎంటర్టైనర్ మూవీస్ తో వరుస విజయాలు అందుకుంటున్నారు. ఇక శ్రీశ్రీశ్రీ రాజావారు విషయానికొస్తే మంచి గ్రామీణ నేపథ్యంలో సాగే వెరైటీ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇది.పూర్తి కమర్షియల్ ఫార్మాట్ లో భారీ తారాగణంతో తెరకెక్కించారు దర్శకుడు సతీష్ వేగేశ్న. అలాగే ఎన్టీఆర్ ఎంతో మెచ్చి, ఈ కథను ఎంపిక చేశారు. ఆయన అంచనాల మేరకు దర్శకుడు ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా తెరకెక్కించారు. కచ్చితంగా ఈ జూన్ 6న నార్నె నితిన్ ఖాతాలోఆయ్, మ్యాడ్ తరహాలో మరో సూపర్ హిట్ హిట్ పడుతుందని గట్టిగా నమ్ముతున్నాం. అని అన్నారు.నటీనటులు: నార్నే నితిన్, సంపద, రావు రమేష్, నరేష్, రఘు కుంచె, ప్రవీణ్, రచ్చ రవి, సరయు, రమ్య, ప్రియ మాచిరాజు, భద్రం, ఆనంద్, జబర్దస్త్ నాగి తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.్నికల్ టీమ్: సంగీతం: కైలాష్ మీనన్, కెమెరా: దాము నర్రావుల, ఎడిటర్: మధు, పాటలు: శ్రీమణి, పబ్లిసిటీ డిజైనర్: ఈశ్వర్, పి అర్ ఓ: బి. వీరబాబు, సమర్పణ: రంగాపురం రాఘవేంద్ర, మురళీకృష్ణ చింతలపాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సి.హెచ్.వి. శర్మ, రాజీవ్‌కుమార్, సహ నిర్మాత: ఎమ్. సుబ్బారెడ్డి, నిర్మాత: చింతపల్లి రామారావు, రచన,దర్శకత్వం: సతీష్ వేగేశ్న.



# మిస్ వరల్డ్ విజేతకు బహుమతిగా..




ప్రపంచ సుందరిగా గెలిచిన అందాల రాణి కోట్ల రూపాయల నగదు మాత్రమే బహుమతిగా అందుకోదు. లండన్‌లో ఏడాది పొడవునా నివాసం, అలంకరణ దుస్తులతో పాటు మేకప్, చెప్పులు, నగలు... అన్నీ విజేతకు ఉచితంగా దక్కుతాయి. అంతేకాదు, పోషకాహార, ఫిట్నెస్ నిపుణులు, పీఆర్ సిబ్బంది... ఈ కాలంలో ఆమెకు సహాయంగా ఉంటారు. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఒప్పందాలను అనుసరించి 'బ్యూటీ విత్ పర్పస్' ప్రాజెక్టులకు ప్రసిద్ధి చెందింది. ఈ సంవత్సరం మొత్తం మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్, అది వారు దాతృత్వ కార్యక్రమాలకు రాయబారిగా వ్యవహరించారు. అలానే, గెలిచిన అందాలరాణి... తన సొంత సేవాకార్యక్రమాలనూ నిర్వహించవచ్చు. అయితే, మోడలింగ్, నటన అవకాశాలు వస్తే మాత్రం... మిస్ వరల్డ్ సంస్థ అనుమతితో కొనసాగుతుంది. □

## ప్రయోగాలతో నేర్పిద్దామా?



ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన పిల్లలకు ఆటవిడుపు వినోదాన్నే కాదు. విజ్ఞానాన్నీ అందిస్తే బాగుంటుంది కదా! చిన్న చిన్న సైన్స్ ప్రయోగాలు వారిలో కొత్త విషయాలను తెలుసుకోవాలన్న ఉత్సాహాన్ని ఇస్తాయి. ఉదాహరణకు వినెగర్‌తో బేకింగ్ సోడా చర్య జరిపినప్పుడు కార్బన్‌డయాక్సైడ్ వాయువు ఉత్పత్తి అవుతుంది. దాన్ని పిల్లలకు ప్రత్య క్షంగా చూపించేందుకు ఓ గాజు గ్లాసు లోకి 1/3 వంతు వినెగర్ తీసుకోండి. ఆపై అందులో చెంచా బేకింగ్ సోడా వేస్తే సరి. ఈ రెండూ కలిసినప్పుడు నీళ్ల నురగలు/బుడగలు కక్కుతూ సీసా బయటకి పొంగుతాయి. ఆ బుడగలే కార్బన్‌డయాక్సైడ్ వాయువు అని చెబితే వాళ్లకి థ్రిల్లింగ్‌గా ఉంటుంది. దాంతో మరో ప్రయోగం చేద్దామా అని మిమ్మల్నే అడుగుతాడు. □

# వైద్యురాలు మిస్ వరల్డ్ వేదికపై..




వైద్యురాలు.. కానీ మిస్ వరల్డ్ వేదికపై కిరీటం కోసం పోటీలో ఉన్నారు. **మిస్ తుర్కియే ఇదిల్ బిల్గెన్.** ఎందుకంటే నా అందాల పోటీ జీవితాన్ని సాకారం వేదిక అని చెప్తున్నారు మహిళల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఈమె హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో ఆసియా ఓషియానా తరపున విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. మనతో తన ప్రయాణాన్ని పంచుకున్నారిలా....

కుటుంబానికి తల్లే జీవనాధారం. అటువంటి ఆమె ఆరోగ్యాన్ని పట్టించుకోకపోతే జరిగే నష్టం భర్తీ చేయలేనిది. ఆ బాధేంటో నాకు బాగా తెలుసు. మా అమ్మ రొమ్ము క్యాన్సర్‌తో చనిపోయారు. నా కష్టం వేరెవరికీ రావొద్దనుకున్నా. దానికోసం ఏదైనా చేయాలనుకున్నా. ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. వాటిల్లోనూ ఎక్కువమంది బాధితులు మహిళలే. వీళ్ల తమ ఆరోగ్యానికి ఎప్పుడూ ప్రాథమిక ప్రాధాన్యత ఇవ్వరు. పరీక్షలు వగైరా చేయించుకోరు. ఈ విషయం నన్ను కలవరపరిచింది. ఇక్కడ ప్రధాన సమస్య అవగాహన లేకపోవడమే. మా అమ్మ కూడా అలాగే చనిపోయింది. వీటిని ముందే గుర్తిస్తే చాలా వరకు నష్టాన్ని నివారించొచ్చు. అందుకే మెడిసిన్ పూర్తిచేశాక మహిళలకు తీవ్ర సమస్యగా మారుతున్న రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్ల మీద అవగాహన కల్పించడం ప్రారంభించింది. అంతేకాదు, ప్రస్తుతం అమెరికాలో రేడియేషన్ అంకాలజీలో స్పెషలైజేషన్ చేస్తున్నా. అక్కడి ప్రముఖ క్యాన్సర్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నా. రేడియేషన్ అంకాలజీలో పరిశోధనలు, ఆవిష్కరణలపైనా పనిచేస్తున్నా. అందాల పోటీలు సౌందర్య ప్రదర్శనకే కాదు... ఎంతో మందిని చేరుకునే వేదిక కూడా. ఈ అవగాహన వచ్చాకే అందాల పోటీల్లో పాదం మోపా. అందుకే నా బ్యూటీ విత్ ఎ పర్పస్ ప్రాజెక్ట్ కూడా.. మహిళలకు ఆరోగ్య ప్రాధాన్యాన్ని చెప్పడం, దానిపై దృష్టిసారించేలా చేయడం, క్యాన్సర్‌కు సంబంధించి మోమోగ్రామ్ పరీక్షలు చేయించుకునేలా చూడటమే. దీనికోసం ఐక్యరాజ్యసమితి సహా పలు సంస్థలతో కలిసి తుర్కియే, ఉక్రెయిన్‌ల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. వైద్యపరీక్షలపై భయాన్నీ పోగొడుతున్నా. క్యాన్సర్ బాధితుల్లో ధైర్యాన్నీ పెంచుతున్నా. రేడియేషన్ అంకాలజిస్ట్ అయ్యాక నా సేవల్ని ప్రపంచవ్యాప్తం చేయాలి. ఇందుకోసం అనేక సంస్థలతో పనిచేయాలి. అందుకు మిస్ వరల్డ్ ప్లాట్‌ఫామ్ చక్కని వేదిక. దీనిద్వారా యువతరానికి చేరువ కావొచ్చు. పోటీల సమయంలో ఎంతోమందిని కలుసుకున్నా. నా లక్ష్యం నెరవేర్చుకునే అవకాశాలూ మెరుగు పడ్డాయి. బలమైన నెట్‌వర్క్ ఏర్పడింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో క్యాన్సర్ ఆసుపత్రులు, వైద్యనిపుణులతో కలిసి పనిచేసే అవకాశం లభించింది. మహిళలూ.. ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం ఇవ్వండి. ఒక వయసు దాటాక క్యాన్సర్ పరీక్షలు తప్పక చేయించుకోండి. హెచ్‌పివి వ్యాక్సిన్లు వేయించుకోండి. ఈ మెసేజ్ ప్రపంచ నలుమూలలకీ చేర్చాలి. వైద్యురాలిగా రాణించాలన్నవా నా లక్ష్యం. □

# అపార్థాలకు తావివ్వకూడదంటే..



భార్యాభర్త లిద్దరి ఆలోచనలు ఒకేలా ఉండాలని రూలేం లేదు. ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకుంటూ మంచిచెడులను తర్కించుకుంటూ ఒకటిగా అడుగేసినప్పుడే ఆ దాంపత్యం కలకాలం నిలుస్తుంది. అందుకు ఇద్దరూ ఒకరి మాటను ఒకరు విని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా కాకుండా తమ భాగస్వామి మాట్లాడేటప్పుడు ఎప్పుడూ, ఎదో ఒక ఫిర్యాదు చేస్తూనే ఉంటుంది అంటూ తీసిపడేసినా, వినీవినట్లు ఉన్నా ఆపోహలు తప్పవు. అపార్థాలకు తావివ్వకూడదంటే ఇలా చేసి చూడండి. మీ భాగస్వామి వ్యక్తి గత, వృత్తి కుటుంబ విషయమై ఏదైనా మీకు ఫిర్యాదు చేసినప్పుడు దాన్ని తారీఖుతో సహా వారిముందే డైరీలో రాసుకోండి. దీనివల్ల మూడు ఉపయోగాలు ఉన్నాయి. . సమస్యపై మీరు స్పందించడం లేదనో, పట్టించుకోవడం లేదనో భావన వారిలో పోతుంది. తప్పు మీలో ఉంటే దాన్ని సరిచేసుకుని మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తపడచ్చు. వ. మీరు సమస్య వింటున్నారు, దాన్ని సరిచేసుకునేందుకు ప్రయత్నిస్తారని వాళ్లకు తెలుస్తుంది. దాంతో గంభీరంగా ప్రారంభమైన వారి సంభాషణ చల్లబడుతుంది. వాదోపవాదాలు లేకుండా పరిస్థితి గట్టెక్కుతుంది. తీరిక సమయాల్లో ఆ డైరీని తిరగవేయమని చెప్పండి. చిన్నచిన్న విషయాలకే వారు ఫిర్యాదులు చేస్తుంటే దాన్ని మానుకునే అవకాశం ఉంటుంది. □

# మల్టీపర్పస్ ఎగ్ బాయ్‌లర్

వంటలన్నీ చకచకా చేసేవాళ్లు కూడా కోడిగుడ్డు ఉడకబెట్టే విషయంలో కొంచెం చిరాకుపడటం చూస్తుంటాం. మామూలుగా గుడ్లు మునిగేవరకూ నీళ్ల పోసి మీడియం ఫ్లేమ్ మీద ఏడెనిమిది నిమిషాలు ఉడికిస్తే సరిపోతుంది. కానీ పనుల ఒత్తిడిలో దాని సంగతి మర్చిపోతే కష్టమే. సరిగ్గా ఉడకకపోయినా, ఎక్కువ ఉడికిరాయిలా తయారైనా లాభంలేదు. ఈ సమస్యను నివారించే పరికరం ఎగ్ బాయ్‌లర్ ఆటోమాటిక్ ఎలక్ట్రానిక్ కుకర్. చూసేందుకు ఫ్లాస్క్‌లా ఉంటుంది. ఇందులో గుడ్లు ఉడికించవచ్చు. ఆమ్లెట్ వేసుకోవచ్చు. ఎగ్‌రోల్స్ లాంటివీ తయారుచేయొచ్చు. ఇందుకు ప్రత్యేకించి ప్యాన్ కానీ కడాయి కానీ అవసరం లేదు. నాన్ స్టిక్ కుకింగ్ ఛాంబర్ ఉన్న ఈ మల్టీ పర్పస్ పరికరాన్ని ఎక్కువ కాలం మన్నేలా రూపొందించారు. దీన్ని శుభ్రపరచడమూ సులువే. □





**చెలి చిట్కా**

తేనెను కొంచెం వేడిచేసి ముఖమంతాపూసి అరగంట తర్వాత కడిగి వేయండి. తరువాత చల్లటి నీటిని జల్లులాగా ముఖము మీద వేస్తే మంచింది. □

# దేవుడితో సహవాసం గొప్ప ధన్యత..

'ఆయన(దేవుని)తో సహవాసము చేసినయెడల నీకు సమాధానము కలుగును' (యోబు 22:21). నిజమే దేవుడితో మనం సహవాసం కలిగి వుంటే అన్నివిషయాల్లోనూ సమాధానంగా ఉంటాం. దేవుడితో సహవాసం అంటే ఎలా ఉండగలం? రోజూ బైబిల్ చదవడం, ప్రార్థన చేయడం, చర్చికి వెళ్లి ఆయన వాక్యాన్ని వినడం, దేవుడి బిడ్డలతో సహవాసంతో దేవుడి గురించి చర్చించుకోవడం, కుటుంబ సభ్యులతో దేవుడి ప్రేమను, ఆశ్చర్యకార్యాలను చర్చించుకోవడం వంటివన్నీ దేవుడితో సహవాసం కిందకే వస్తుంది. ఆయనతో ఇంకా వ్యక్తిగత సహవాసం అంటే ప్రార్థన, బైబిల్ చదవడం..ఒక్కమాటలో చెప్పాలంటే ఏకాంతంగా ఆయనతో గడపడమే. దావీదు మహారాజు గురించి తెలియని వారుండరు. ఆయన బత్షెబతో పాపం చేసినప్పుడు దేవుడి తన అనుబంధాన్ని దాదాపు 9నెలలు కొనసాగించలేక పోయాడు. ఆ బిడ్డను దేవుడు హత మార్చినప్పుడు, నాతాను అనే ప్రవక్త వచ్చి దావీదులో చెప్పినప్పుడు, అప్పుడు దావీదు తన తప్పును తెలుసుకుని, దేవుడి సన్నిధిలో ఒప్పుకుని, తిరిగి దేవుడితో సహవాసాన్ని కొనసాగించాడు. ఆ సహవాసం మరణించేంతవరకు సాగింది. అందుకే దేవుడే దావీదు గురించి గొప్ప సాక్ష్యం చెప్పాడు. 'బత్షెబ విషయంలో తప్ప దావీదు ఏవిషయంలోనూ పాపం చేయలేదని, దేవుడికి నమ్మకంగా జీవించాడు అని చెప్పాడు. అబ్రాహాము కూడా భార్య శారా మాట విని, హాగరును వివాహం చేసుకుని, ఇష్మాయేలను కుమారుడిని కన్న తర్వాత దాదాపు 13 సంవత్సరాలు దేవుడి అబ్రాహాముతో మాట్లాడినట్లు మనకు బైబిల్‌లో కనిపించదు. వారిద్దరిమధ్య 13 సంవత్సరాల సహవాసం లేనట్లుగా కనిపిస్తుంది. తర్వాత దేవుడు ఆదికాండం 17వ అధ్యాయం మొదటి వచనంలో ప్రత్యక్షమై..'నా సన్నిధిలో నడుచుచు నిందారహితుడవై యుండుము' అని చెప్పాల్సి వచ్చింది. అంటే దేవుడు అబ్రాహామును తన సన్నిధిలో జీవించాలి అని దేవుడి కోరిక. అలాగే దావీదును సరిచేసేందుకు నాతాను అనే ప్రవక్తను దేవుడు పంపాల్సి వచ్చింది. అబ్రాహాము, దావీదు వంటి గొప్ప భక్తులే దేవుడి నుంచి తాత్కాలికంగా దూరమయ్యారు. మనం ఏపాటివారం. కాబట్టి శరీరబలహీనతలో మనం దేవుడికి చాలాసార్లు దూరమైపోతుంటాం. పర్వాలేదు. ఆదూరాన్ని మరింత దూరం చేసుకోకుండా సరిచేసుకుని, తిరిగి దేవుడితో నిత్యం సహవాసాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిద్దాం. ఆయన నమ్మదగిన దేవుడు, మనం క్షమించమని వేడుకుంటే, తప్పకుండా తన సహవాసంలో జీవించేందుకు మనకు సాయం చేస్తాడు. అప్పుడే మనం అన్నింట్లోనూ సమాధానంతో జీవించగలం. ఆ కృప దేవుడు మనకందరికీ దయచేయునుగాక..

-పి.వాణిపుష్ప



అంతర్వాణి

# చికెన్‌తో కొత్త రుచులు

ఇంట్లో చికెన్ ఉంటే.. దాంతో పులుసు పెట్టాలా లేదా వేపుడు చేయాలా అని ఆలోచిస్తాం లేదా గబగబా బిర్యానీ వండేస్తాం. కానీ చికెన్‌తో అవే కాదు మరికొన్ని రుచులూ చేసుకోవచ్చు.

## అచారీ చికెన్

**కావలసినవి :** చికెన్: అరకేజీ, ఎండుమిర్చి: నాలుగు, ధనియాలు: రెండు టేబుల్‌స్పూన్లు, ఆవాలు: పావుటేబుల్‌స్పూను, జీలకర్ర: టేబుల్‌స్పూను, మెంతులు: పావుచెంచా, సోంపు: ఒకటిన్నర చెంచా, ఉల్లిముక్కలు: కప్పు, టొమాటోముక్కలు: ముప్పావుకప్పు, నూనె: రెండుటేబుల్‌స్పూన్లు, అల్లంవెల్లుల్లి : టేబుల్‌స్పూను, పసుపు: పావుచెంచా, కారం: ఒకటిన్నరచెంచా, చక్కెర: ఒకటిన్నర చెంచా, పెరుగు: అరకప్పు, ఆవకాయ గుజ్జు: టేబుల్‌స్పూను, కొత్తిమీర తరుగు: పావుకప్పు, అల్లం తరుగు : చెంచా.



**తయారీ విధానం :** ఎండుమిర్చి, ధనియాలు, ఆవాలు, జీలకర్ర, మెంతులు, సోంపు నూనె లేకుండా వేయించి తీసుకోవాలి. చల్లారాక మిక్సీలో పొడి చేసుకోవాలి. స్టౌమీద బాణలి పెట్టి నూనె వేసి, వేడయ్యాక ఉల్లిముక్కలు, అల్లంవెల్లుల్లి ముద్ద, ముందుగా చేసుకున్న పొడి వేయాలి. రెండు నిమిషాలయ్యాక టొమాటో గుజ్జు, కారం, పసుపు, తగినంత ఉప్పు, చక్కెర వేసి బాగా కలపాలి. అన్నీ వేగాక గిలకొట్టి పెరుగు,దాని తరువాత చికెన్ ముక్కలు,అరకప్పు వేణ్నీళ్ల పోయాలి. చికెన్ పూర్తి ఉడికాక ఆవకాయ గుజ్జు, కొత్తిమీర తరుగు, అల్లం తరుగు వేసి బాగా కలిపి దింపేయాలి.

## చెట్టినాడ్ పెప్పర్ చికెన్

**కావలసినవి:** చికెన్ : అరకేజీ, జీలకర్ర: చెంచా, ధనియాలు: రెండు చెంచాలు, ఎండు మిర్చి: అయిదు, మిరియాలు: మూడుచెంచాలు, దాల్చినచెక్క: చిన్న ముక్క, యాలకులు: నాలుగు, సోంపు: చెంచా, ఎండుకొబ్బరిపొడి: పావుకప్పు, అల్లం: చిన్న ముక్క, వెల్లుల్లి రెబ్బలు: పది నూనె: అరకప్పు, బిర్యానీ ఆకులు: రెండు, ఆవాలు: చెంచా, ఉల్లిపాయ ముక్కలు, రెండు కప్పులు, పచ్చిమర్చి తరుగు: చెంచా, కరివేపాకు రెబ్బలు: రెండు టొమాటోగుజ్జు: ఒకటిన్నర కప్పు, ఉప్పు: తగినంత, కారం: రెండు చెంచాలు, పసుపు: చెంచా, చింతపండుగుజ్జు: రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు: రెండు చెంచాలు.



**తయారీ విధానం :** జీలకర్ర ధనియాలు, ఎండుమిర్చి, మిరియాలు, దాల్చినచెక్క, యాలకులు, సోంపు , ఎండుకొబ్బరి, అల్లం, వెల్లుల్లి రెబ్బలు వేయించి, చల్లారాక అన్నీ మిక్సీలో గ్రైండ్ చేయాలి. అదే బాణలిలో బిర్యానీ ఆకులు, ఆవాలు వేసి వేగాక ఉల్లిముక్కలు, పచ్చిమర్చి తరుగు, కరివేపాకు వేసి వేయించాలి. చికెన్ ముక్కలు వేసి కాసేపు వేయించి రుబ్బిన మసాలా టొమాటో గుజ్జు, ఉప్పు, కారం, పసుపు, కప్పు నీళ్ల పోసి ఉడికించాలి. ఆపై చింతపండుగుజ్జు చేసి మరికాసేపు ఉడికించి దించేముందు కొత్తిమీర చల్లాలి.

## చికెన్ రోస్ట్

**కావలసినవి :** చికెన్: కేజీ, పసుపు: పావుచెంచా, కారం: పావు చెంచా, ధనియాలపొడి: పావుచెంచా, వెల్లుల్లి రెబ్బలు: అయిదు, పచ్చిమిర్చి: అయిదు, ఉప్పు: తగినంత, ఉల్లిపాయలు: మూడు, టొమాటో : ఒకటి 'పేస్టులా చేసుకోవాలి) కరివేపాకు రెబ్బలు: మూడు, గరంమసాలా: పావుచెంచా, మిరియాలపొడి: పావు చెంచా, నిమ్మకాయ: ఒకటి, నూనె: వేయించేందుకు సరిపడా.



**తయారీ విధానం :** చికెన్‌ని కడిగి చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. మిక్సీలో పసుపు, కారం, ధనియాలపొడి, చెంచ నిమ్మరసం, వెల్లుల్లి తరుగు, మూడు పచ్చిమిర్చి ముక్కలు, తగినంత ఉప్పువేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని చికెన్ ముక్కలపైన వేసి బాగా కలపాలి. గంట తరువాత స్టౌమీద బాణలి పెట్టి టేబుల్‌స్పూను నూనె వేసి ఉల్లిపాయ ముక్కలు వేయించుకుని తీసుకోవాలి. అదే బాణలిలో కప్పు నూనె వేసి చికెన్ ముక్కల్ని వేయించి తీసుకోవాలి. మరో బాణలిలో రెండు టేబుల్‌స్పూన్ల నూనె వేసి మిగిలిన పచ్చిమిర్చి కరివేపాకు వేయించాలి. నిమిషం తరువాత టొమాటో గుజ్జువేసి.. ముందుగా వేయించుకున్న చికెన్ ముక్కల్ని వేయాలి. చికెన్ ముక్కలు టొమాటో గుజ్జు పట్టాక ఉల్లిపాయ ముక్కలు, గరంమసాలా, మిరియాలపొడి మిగిలిన నిమ్మరసం వేసి బాగా కలిపి రెండు నిమిషాలయ్యాక దింపేయాలి.

## చిల్లీ చైనీస్ చికెన్

**కావలసినవి :** చికెన్: అరకేజీ, మొక్కజొన్నపిండి: రెండు టేబుల్‌స్పూన్లు, సోయాసాస్ : నాలుగు టేబుల్‌స్పూన్లు, గుడ్డు: ఒకటి, ఉల్లిపాయలు: రెండు, నూనె: కప్పు, ఎండుమిర్చి: ఆరు, వెల్లుల్లి తరుగు: రెండు టేబుల్‌స్పూన్లు, అల్లం తరుగు: చెంచా, టొమాటో కెచప్: రెండు టేబుల్‌స్పూన్లు, క్యాప్సికం: రెండు ఉప్పు: తగినంత.



**తయారీవిధానం :** చికెన్‌ని చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఓ గిన్నెలో చికెన్ ముక్కలు, మొక్కజొన్నపిండి, సోయాసాస్, గుడ్డు సొన వేసి అన్నింటినీకలిపి పెట్టుకవాలి. స్టౌమీద బాణలి పెట్టి రెండు టేబుల్‌స్పూన్లనూనె వేసి ఎండుమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, అల్లంవెల్లుల్లి తరుగు వేసి వేయించాలి. అవివేగాక టొమాటో కెచప్, తగినంత ఉప్పు వేసి ఓసారి కలిపి దింపేయాలి. మరోబాణలిని పొయ్యిమీద పెట్టి మిగిలిన నూనె వేసి చికెన్ ముక్కల్ని వేయించి టొమాటోసాస్‌లో వేయాలి. తరువాత అన్నింటినీ కలిపి స్టౌమీద పెట్టి క్యాప్సికం ముక్కలు, కప్పు వేడి నీళ్ల పోసి స్టౌని సిమ్‌లో పెట్టాలి. మిశ్రమం కాస్త చిక్కబడ్డాక దింపేయాలి. □

# దోశ ప్రింటర్

ప్రింటర్ అవసరమైన కథనాలు కాపీలు తీస్తాం. అది మనందరికీ తెలిసిందే! దోశలు కూడా అలా తీయొచ్చు అంటే దోశ బొమ్మల ప్రింటవుట్ కాదండోయ్. అసలైన దోశలే. ఇదెక్కడి చోద్యం అనుకుంటున్నారా? అలాంటి పరికరం నిజంగానే ఉంది మరి. ఇందులో పిండిని లోడ్ చేస్తే చాలు. 360 డిగ్రీల ఫుడ్ గ్రేడ్ కోటెడ్ రోలర్ లోంచి నిమిషంలో దోశలు డౌన్‌లోడ్ అవుతాయి. ఎంత మందంగా కావాలి. ఏ మాత్రం వేగాలి మొదలైన కంట్రోల్ బటన్‌లు కూడా ఉన్నాయి. దీన్ని కొనుక్కున్నామంటే చెమటలు కక్కుతూ దోశలు వేయాల్సి పనేలేదు. ఎంచక్కా మీట నొక్కితే చాలు. కరకరలాడే దోశలు వచ్చేస్తాయి. □



# షూటింగ్ వరల్డ్‌కప్‌లో మోనాకు రజతం

**న్యూఢిల్లీ:** దక్షిణ కొరియాలో జరిగిన పారా షూటింగ్ ప్రపంచ కప్‌లో మోనా అగర్వాల్ రజత పతకాన్ని గెలుచుకుంది. చాంగ్‌వాన్‌లో శనివారం జరిగిన 2025 పారా షూటింగ్ ప్రపంచ కప్‌లో మహిళల పి2-10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1 ఈవెంట్‌లో భారతదేశానికి చెందిన మోనా అగర్వాల్ ఈ రజతాన్ని కైవసం చేసుకుంది. ఇక దక్షిణ కొరియాకు చెందిన యున్రీలీ పారాలింపిక్స్‌లో రజతం గెలుచుకుంది. మొనా అగర్వాల్ కూడా పారా షూటింగ్ ప్రపంచ కప్‌లో పాల్గొంది, అక్కడ ఆమె స్వర్ణం మరియు కాంస్యం గెలుచుకుంది. అంతకు ముందు ఆమె పారిస్ పారాలింపిక్స్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. పారాలింపిక్స్‌లో అవని లేఖరా అదే ఈవెంట్‌లో రెండు స్వర్ణ పతకాలను గెలుచుకున్న మొదటి భారతీయ మహిళగా అవతరించింది.




**న్యూఢిల్లీ:** రెండు ఫిఫా అంతర్జాతీయ మహిళల ఫ్రెన్డ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో భారత్ 0-1 తేడాతో ఉజ్బెకిస్తాన్ చేతిలో ఓడిపోయింది. బెంగుళూరు పదుకొనే ద్రవిడ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌లో జరిగిన రెండు పోటీల్లో భాగంగా మొదటి మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు టీమ్‌లోని డియోరాఖోన్ ఖబిబుల్లేవా ఏకైక గోల్ చేయడంతో భారత మహిళా ఫుట్‌బాల్ జట్టు పరాజయం చెందింది. గోల్ లేని మొదటి అర్ధభాగం తర్వాత, ఖబిబుల్లేవా 56వ నిమిషంలో ప్రతిష్టంభనను ఛేదించి ఆతిథ్య జట్టుకు విజయాన్ని అందించింది. భారత్ జట్టు ప్రారంభంలోనే కొన్ని కార్నర్‌లను సంపాదించగా, గోల్ కీపర్ పాంథోయ్ చాను ఉజ్బెకిస్తాన్ దాడిదారులను ఆరంభంలో అడ్డుకుని రాణించాడు. కెప్టెన్‌గా బరిలోకి దిగిన పాంథోయ్, ఉజ్బెకిస్తాన్ ఫార్వర్డ్‌ను భారత రక్షణ వెనుక నుండి ఆడించిన తర్వాత, ఎనిమిదో నిమిషంలో నిలుఫర్ కుద్రటోవా నుండి బంతిని సేకరించడంలో కృతకృత్యులైయ్యింది. ఆట సాగుతున్న కొద్దీ, భారత్ జట్టు

## ఫిఫా మహిళల ఫుట్‌బాల్‌లో

# భారత్ ఓటమి

### 0-1 తేడాతో ఉజ్బెకిస్థాన్ విక్టరీ

నిదానంగా వ్యవహరించింది. కౌంటర్‌లో ఉన్న సౌమ్య గుగులోత్, డాంగ్‌మీ గ్రేస్‌కు పాస్‌ను థ్రెడ్ చేసింది, ఉజ్బెకిస్తాన్ బ్యాక్ లైన్‌ను దాటి వేగంగా దూసుకెళ్లింది. అయితే, మప్తునా జోనిమ్‌క్లోవా తన లైన్ నుండి బయట ఎదుర్కొని భారత ఫార్వర్డ్ పాదాల నుండి బంతిని లాక్కుంది. తర్వాత, డియోరాఖోన్ ఏరియల్ త్రూ బాల్‌లోకి పరిగెత్తింది మరియు పాంథోయ్‌ను ఓడించడానికి మాత్రమే మిగిలి ఉంది. అయితే, భారత సెంటర్‌బ్యాక్ శిల్కీ దేవి తన భౌతిక ఉనికితో ఉజ్బెకిస్తాన్ ఫార్వర్డ్‌ను నియంత్రించి,



పాంథోయ్ బంతిని లాక్కోవడానికి కొంత అవకాశం కల్పించింది. ఎడమ పార్శ్వం నుండి తప్పించుకున్న మప్తునా షోయిమోవా, ఇండియా బాక్స్‌లోకి పిన్‌పాయింట్ క్రాస్ పంపింది. 56వ నిమిషంలో డియోరాఖోన్ దానిని దగ్గరగా కొట్టి తన జట్టుకు ఆధిక్యాన్ని అందించింది.

# పాక్‌దే టి20 సిరీస్

### 57 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ చిత్తు

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో పాకిస్తాన్ 57 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. పాకిస్తాన్ టాప్ ఆర్డర్ వరుసగా రెండోసారి 201 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. మరియు ఎనిమిది మంది బౌలర్లలో ఏడుగురు వికెట్లు తీసి బంగ్లాదేశ్‌ను 19 ఓవర్లలో 144 పరుగులకే ఆలౌట్ చేశారు.




ఛేజింగ్‌లో మొదటి రెండు ఓవర్లలో తంజిద్ హసన్ మొత్తం 32 పరుగులు చేశాడు. కానీ అబ్రార్ అహ్మద్ షార్ట్ ఫైన్ లెగ్ వద్ద అద్భుతమైన రిఫ్లెక్స్ క్యాచ్‌తో 33 పరుగులకే ఔటయ్యాడు. పవర్‌ప్లే ముగిసే సమయానికి, బంగ్లాదేశ్ 543తో ఉంది మరియు కొన్ని అద్భుతమైన క్యాచ్‌లతో వెనుకబడి ఉంది. వరుస పదునైన గూగ్లీలతో అబ్రార్ తోహిద్ హ్రిదోయ్, జాకర్ అలీలను లెగ్ బిఫోర్ వికెట్‌గా నిరోధించాడు. ఆటలో సగం సమయానికి బంగ్లాదేశ్ 78/7తో నిలిచింది. 9వ ర్యాంకర్ బ్యాట్స్‌మన్ తంజిమ్ హసన్ సాకిబ్ మాత్రమే 31 బంతుల్లో 50 పరుగులు చేసి అతని తొలి గి20 అర్ధ సెంచరీ చేశాడు. ఫాస్ట్ బౌలర్ షోరిఫుల్ ఇస్లాం తన మొదటి ఓవర్‌లోనే గాయంతో బ్యాటింగ్ చేయలేకపోయిన తర్వాత చివరిగా ఔటయ్యాడు. ఫర్హాన్ 54 బంతుల్లో 103 పరుగులు జోడించి, మొహమ్మద్ హారిస్ (41) తో కలిసి కొత్త కోచ్ మైక్ హెస్సన్ నాయకత్వంలో దూకుడుగా ఆడాడు. 11వ ఓవర్లో హారిస్ బ్యాక్‌వర్డ్ పాయింట్ వద్ద క్యాచ్ అవుట్ అయ్యాడు, మరియు ఫర్హాన్ తర్వాత ఓవర్‌లో బంగ్లాదేశ్ కెప్టెన్ లిట్టన్ దాస్ స్టంప్స్ వెనుక క్యాచ్ అవుట్ అయ్యాడు. పాకిస్తాన్ మిడిల్ ఆర్డర్ హసన్ నవాజ్ 25 బంతుల్లో మూడు సిక్సర్లు మరియు రెండు ఫోర్లతో 51 పరుగులు చేశాడు. కానీ పాకిస్తాన్ చివరి ఐదు ఓవర్లలో 40 పరుగులు మాత్రమే చేసింది, ఫాస్ట్ బౌలర్ హసన్ మహ్మూద్ 247తో అద్భుతమైన పునరాగమనం చేశాడు.




# టైటిల్‌పై ఆర్‌సిబి ఆశలు

### 18 యేళ్లుగా ఊరిస్తున్న ఐపిఎల్.. ఫైనల్స్ చేరుకోవడం ఇది 4వ సారి

**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో గత 18 ఏళ్లుగా ఊరిస్తున్న ఐపీఎల్ కప్పును ఈ సారి ఏమైనా సాధించాలని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పట్టుదలతో ఉంది. ప్రతీసారి కప్ మనదే అంటూ రావడం, ఆ తరువాత నిరాశ పరచడం గత కొన్నాళ్లుగా ఆర్‌సీబీ తీరు ఇది. ఈ సీజన్‌లో మాత్రం ఆర్‌సీబీ అదరగొడుతోంది. క్వాలిఫయర్ 1లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుని చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి కేవలం అడుగు దూరంలో నిలిచింది. 9 ఏళ్ల విరామం తరువాత ఆర్‌సీబీ ఫైనల్ మ్యాచ్‌లో అడుగుపెట్టింది. ఈ జట్టు ఫైనల్‌కు చేరుకోవడం ఐపీఎల్ చరిత్రలో ఇది నాలుగో సారి. 2009, 2011, 2016లోనూ ఇలాగే ఫైనల్ చేరుకున్నప్పటికి నిరాశ తప్పలేదు. ఐపీఎల్ 2008లో ఆరంభమైంది. తొలి సీజన్‌లో ఆర్‌సీబీ నిరాశజనక ప్రదర్శన చేయడంతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంతో టోర్నీని ముగించింది. రెండో సీజన్‌లో అందరి అంచనాలను తలక్రిందులు చేస్తూ అనిల్ కుంబ్లే సారథ్యంలో ఫైనల్‌కు దూసుకువెళ్లింది. ఫైనల్‌లో డెక్కన్ ఛార్జర్స్‌తో తలపడింది. గిల్ క్రిస్ట్ నాయకత్వంలోని డెక్కన్ ఛార్జర్స్ తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనలో ఆర్‌సీబీ 9 వికెట్లు కోల్పోయి 137 పరుగులకే పరిమితమై 6 పరుగుల తేడాతో ఓడిపోయింది. అలాగే 2011లో రెండో సారి ఐపీఎల్ ఫైనల్ చేరుకుంది. ఈసారి డేనియర్‌వెటోరీ ఆర్‌సీబీని ముందుండి నడిపించాడు. అయితే ఫైనల్‌లో మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్సీలో చెన్నై అడ్డుపడింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల స్కోరు సాధించింది. ఆ తరువాత లక్ష్య ఛేదనలో ఆర్‌సీబీ 8 వికెట్ల నష్టానికి 147 పరుగులకే పరిమితం కావడంతో మరోసారి తనిరాశే తప్పలేదు. ముచ్చటగా మూడోసారి 2016 ఐపీఎల్‌లో ఫైనల్‌కు చేరుకుంది. కెప్టెన్ విరాట్ కోహ్లి భీకర ఫామ్‌తో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. కోహ్లి ఊపు చూస్తే ఆర్‌సీబీ మూడో ప్రయత్నంలో కప్పును ముద్దాడుతుందని అంచనావేశారు. అయితే డేవిడ్ వార్నర్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆర్‌సీబీకి గట్టి షాక్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ తొలుత బ్యాటింగ్ చేసి 7 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. తదుపరి ఆర్‌సీబీ 7 వికెట్ల నష్టానికి 200 పరుగుల దగ్గర ఆగిపోయి 8 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ మూడు సందర్భాల్లో కూడా ఆర్‌సీబీ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. ఈ క్రమంలో జూన్ 3న జరిగే ఐపీఎల్-2025 ఫైనల్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ తొలుత బ్యాటింగ్ చేయడంతో పాటు, కప్పు సాధించాలనే దిశగా తీవ్ర యత్నం చేస్తోంది.

## ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో

# సచిన్, పారుల్‌కు రజతం

### విద్య, అనిమేష్‌కు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 చివరి రోజు కూడా భారత్ అథ్లెట్లు సత్తా చాటారు. జావెలిన్ త్రో విభాగంలో సచిన్ యాదవ్ రజతాన్ని పరుగు మహిళల ఈవెంట్‌లో పరుల్‌చౌదరి రజతాన్ని, హర్డిల్స్ మహిళల విభాగంలో విద్యా రామరాజ్, పరుగులో అనిమేష్ కుజుర్ కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. దక్షిణ కొరియాలోని గుమిలో శనివారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో సచిన్ 85.16 మీటర్ల త్రోతో వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన ఇచ్చాడు. అతని స్వదేశీయుడు యశ్ వీర్ సింగ్ ఐదవ స్థానంలో నిలిచాడు, కానీ 82.57 మీటర్ల త్రోతో వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన కూడా చేశాడు. అయితే పాకిస్తాన్‌కు చెందిన అథ్లెట్ నదీమ్ స్వర్ణపతకాన్ని కైవసం చేసుకున్నాడు. తన తొలి ఆసియా ఛాంపియన్‌షిప్ పతకాన్ని సాధించడంలో 86.40 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. అలాగే మహిళల 5000 మీటర్ల పరుగులో పారుల్ 15:15.33 సెకన్లలో కజకిస్తాన్‌కు చెందిన నోరా జెరుటో తనూయ్ (14:58.71 సెకన్లు) కంటే వెనుకబడి రజతం గెలుచుకుంది. జపాన్‌కు చెందిన యుమా యమమోటో 15:16.86 సెకన్లతో కాంస్యం గెలుచుకుంది. ఇక తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల విద్య మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో 56.46 సెకన్లతో మూడవ స్థానంలో నిలిచింది, చైనాకు చెందిన మో జియాడీ మరియు బహ్రెయిన్‌కు చెందిన ఒలువాకేమి ముజిదత్ అడెకోయా తర్వాత నిలిచింది. ఇక మరో భారత్ అథ్లెటిక్ అనిమేష్ 20.32 సెకన్ల పరుగుతో పురుషుల 200 మీటర్ల జాతీయ రికార్డును బద్దలు కొట్టి కాంస్యం గెలుచుకున్నాడు. ఈ పతకంతో అనిమేష్ 2015లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున రెండవసారి 200 మీటర్ల పతక విజేతగా ధరంబీర్ సింగ్ సాధించిన ఘనతను సమం చేశాడు. ఇక జపాన్‌కు చెందిన తోవా ఉజావా మీట్ రికార్డ్ టైమింగ్ 20.12 సెకన్లతో స్వర్ణం గెలుచుకున్నాడు. సౌదీ అరేబియాకు చెందిన అబ్దులాజీజ్ అటాఫీ 20.31 వ్యక్తిగత ఉత్తమ సమయంతో రజతం సాధించాడు.













# నష్టాలను తగ్గించుకుంటున్న వొడాఫోన్ ఐడియా!




**ముంబయి, మే 31:** వొడాఫోన్ ఐడియా జనవరి మార్చి త్రైమాసికానికిగాను మొత్తం రూ.7166 కోట్ల నష్టం చవిచూసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.7674 కోట్లకంటే కొంతమేర తగ్గించగలిగింది. 6.62శాతం నష్టాలు తగ్గినట్లు కంపెనీ ప్రకటించింది. వ్యయాలను నియంత్రించుకోవడంతోనే క్రమానుగతంగా నష్టాలను తగ్గించుకుంది. అయితేనికరనష్టం మాత్రం 8.42శాతంగా ఉంది.అంతకుముందు త్రైమాసికంలో 6609కోట్లకంటే కొంతమేర పెరిగింది. టెల్కో ఆర్థిక వ్యయాలు రూ.6471కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో ఉన్న 6280 కోట్లకంటే మూడుశాతంపెరిగాయి. వొడాఫోన్ బోర్డు సమావేశంలో రూ.20 వేల కోట్లు నిధుల సమీకరణకు ఆమోదం తెలిపింది. ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్, ప్రైవేటు ప్లేస్‌మెంట్‌ద్వారా సంస్థాగత ప్లేస్‌మెంట్ క్యూఐపిద్వారా కూడా నిధులు సమీకరించేందుకు ఆమోదం పొందింది. కంపెనీ ఒక కస్టమరుపైనా సగటు రాబడి ఈ త్రైమాసికంలో 164రూపాయలుగా ఉందని తెలిపింది. అంతకుముందు 163 నుంచి స్వల్పంగాపెరిగింది. గడచిన మూడు త్రైమాసికాల్లో రూ.163,రూ.154, రూ.146గా ఉన్నాయి. ట్యారిఫ్‌లు పెంచడంవల్ల చందాదారులు పెరగడం వల్ల వొడాఫోన్ కస్టమర్‌బేస్ పెరిగిందని ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 126.4 మిలియన్లుగా ఉంది. గత త్రైమాసికాల్లో 122.6 మిలియన్లు, 124.7 మిలియన్లు, 125.6 మిలియన్లనుంచి కొంతమేర పెంచుకోగలిగింది. అయితే జియో, ఎయిర్‌టెల్‌కంటే నాలుగోత్రైమాసికంలో చందాదారులను ఎక్కువ కోల్పోతోంది. 1.6 మిలియన్లమంది ఇతర టెల్కోలకు మారిపోయారు. మూడోత్రైమాసికంలో అయితే ఏకంగా 5.2 మిలియన్లమంది ఇతరవాటికి బదలీకాగా నాలుగోత్రైమాసికంలో తగ్గించుకోగలిగింది. స్థూల రెవెనూనయ రూ.11,014కోట్లుగా ఉంది. వార్షికపద్ధతిలోచూస్తే 3.83శాతం వృద్ధి ఉంది అలాగే వడ్డీ, పన్నులుచెల్లింపులు, తరుగుదలకు ముందు చూస్తే 7.47శాతంగా ఉంది. అంటే 4659 కోట్లుగా ఉందని అంచనా. గత ఏడాది ఇదే త్రైమాసికంలో 4335 కంటే కొంతమేర మెరుగుపడింది.

## షాపూర్జీకోసం

### డచ్‌బ్యాంక్ 3.35 బిలియన్ డాలర్ల సమీకరణ

**ముంబయి, మే 31:** షాపూర్జీ పల్లోంజీ (ఎస్పీ) గ్రూప్ కోసం డచ్ బ్యాంక్ అమెరికా వెలుపల అతిపెద్ద ప్రైవేట్ క్రెడిట్ లావాదేవీని ప్లాన్ చేసింది, దీని ద్వారా షాపూర్జీ పల్లోంజీ (ఎస్పీ) గ్రూప్ కోసం 3.35బిలియన్లడాలర్లను సేకరించింది. ఈ మౌలిక సదుపాయాల గ్రూపు తన టాటా సన్స్ వాటాలో కొంత భాగాన్ని పూచీకత్తుగా ఉపయోగించుకుంది, బ్లాక్‌రాక్ మరియు మోర్గాన్ స్టాన్లీతో సహా ప్రధాన ప్రపంచ పెట్టుబడిదారుల నుండి మొత్తం ఈ నిధులు సమీకరించింది. మూడు సంవత్సరాల నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు (ఎన్‌సిడి) ద్వారా ఈ ఫైనాన్సింగ్ రాబట్టింది, ఇవి 19.75 శాతం దిగుబడిని అందిస్తాయి వార్షికపద్ధతిలో గణించి మెచూరిటీ సమయంలో చెల్లిస్తారు. ఇది మునుపటి రుణజారీల నుండి పెరుగుదలను సూచిస్తుంది, దీని వలన రాబడి దాదాపు ఒక శాతం పాయింట్ తక్కువగా ఉంటుంది. 2023లో, ఎస్పీగ్రూప్ యొక్క గోస్వామి ఇన్‌ఫ్రాటెక్ 18.75 శాతం దిగుబడితో 1.7 బిలియన్లడాలర్లను సేకరించింది.డచ్ బ్యాంక్ బాండ్ జారీకి 8.93 మిలియన్లడాలర్లకు కట్టుబడి ఉందిదాని పుస్తకాలలో !!500 మిలియన్లకు పైగా నిలుపుకుంటుందని భావి స్తున్నారు. జర్మన్ బ్యాంక్ ఈ ఒప్పందాన్ని బ్లాక్‌రాక్, సోనా క్యాపిటల్, మోర్గాన్ స్టాన్లీ మరియు పిఐఎంకో వంటి విస్తృత శ్రేణి ప్రపంచ పెట్టుబడిదారులకు సిండికేట్ చేసింది. ముఖ్యంగా, ఈ లావాదేవీ సోనా క్యాపిటల్ మరియు పిమ్కో సంస్థలకు భారతదేశంలో మొట్టమొదటి ముఖ్యమైన ప్రైవేట్ క్రెడిట్ ట్రేడ్‌ను గుర్తించింది.ఇంకా చదవండి: షాపూర్జీ పల్లోంజీ గురుగ్రామ్‌లో రూ.1,400 కోట్లకు పైగా లగ్జరీ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు!!3.35 బిలియన్ల నిధుల రౌండ్ మూడు విభిన్న పెట్టుబడిదారుల సమూహాలనుఒక్క గ్రూప్‌గా మార్చిందని చెప్పవచ్చు. స్టెర్లింగ్ బాండ్ల ప్రస్తుత బాండ్ హోల్డర్లు, గోస్వామి బాండ్లలో ప్రస్తుత పెట్టుబడిదారులు అమెరికా, యుకె, హాంకాంగ్, సింగపూర్, భారతదేశంప్రైవేట్ క్రెడిట్ పెట్టుబడిదారుల కొత్త బృందం.

# 4.4 శాతానికి చేరిన ఆర్థికలోటు!

**న్యూఢిల్లీ, మే 31:** కేంద్రప్రభుత్వం తన ఆర్థికలోటును కొంతమేర మెరుగుపరుచుకుంటున్నది. గత బడ్జెట్ అంచనాలతోపోలిస్తే సవరించిన అంచనాల్లో చూపించిన 4.84శాతం కంటే 4.77శాతానికి తీసుకురాగలిగింది. కాగ్ శుక్రవారం విడుదలచేసిన గణాంకాలు ఆర్థికలోటు తగ్గుదలను చూపిస్తున్నాయి. అలాగే జిడిపి 2025కి గాను 330.68 లక్షలకోట్లుగా ఉంది. అంతకుముందు సవరించిన అంచనాల్లో 324.11 లక్షలకోట్లకంటే కొంతమేర మెరుగుపడింది. జిడిపి దిగివచ్చిన శాతంతో బేరీజువేసి ఆర్థికలోటును గణిస్తారు. ఆర్థికలోటు సవరించిన 2025 అంచనాల్లో 77 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రభుత్వ వ్యయం పెంచడంతో పెట్టుబడులు కూడా పెరిగాయని దీనివల్లనే కొంతమేర జిడిపి కూడా వృద్ధిలో ఉందని చెపుతున్నారు. రెవెన్యూ వ్యయంలో దాదాపు రూ90వేల కోట్లను ఆదాచేయగలిగినట్లు ఇక్రా ఆర్థికవేత్తలుచెపుతున్నారు. 2022లో 6.7శాతం, 2023లో 6.4శాతం ఆపై సంవత్సరంలో 5.6శాతంగా ఉన్న ఆర్థికలోటు 2025కిమాత్రం 4.77 శాతంగా ఉంది. ఇక సవరించిన అంచనాల బడ్జెట్‌లో 4.4శాతానికి దిగివచ్చినట్లు కేంద్రం చెపుతోంది. మొత్తం రాబడులపరగాచూస్తే 30.78 లక్షలకోట్లుకాగా పన్ను రాబడులు 24.98 లక్షలకోట్లుగా ఉన్నాయి. ఇక మూలధన వ్యయం 1052 లక్షలకోట్లుగా ఉన్నాయి. మొత్తం వ్యయం చూస్తే 46.56 లక్షలకోట్లుగా ఉంది. పన్నేతర రాబడులు 5.38 లక్షలకోట్లు మాత్రమేనని ప్రభుత్వ అంచనాలు స్పష్టంచేస్తున్నాయి. 2025 ఆర్థికసంవత్సరంలో మూలధన వ్యయం 10.5 లక్షలకోట్లుగా ఉంది. దీన్నిబట్టిచూస్తే మౌలికవనరుల రంగంపై వ్యయం పెరిగింది. సుమారుగా 103.3శాతం పెరిగినట్లు తేలింది.




## వాణిజ్యం

# మే నెలలో ఎఫ్‌పిఐల పెట్టుబడులు రూ. 19, 860 కోట్లు!




ముంబయి, మే 31: భారత మార్కెట్లలో విదేశీ పెట్టుబడులు రికార్డుస్థాయికి పెరిగాయి. నికర ఎఫ్‌పిఐలు 19,860 కోట్లుగా ఉన్నాయి. ఈ ఏడాదిలో అత్యుత్తమంగా పెట్టుబడులు ఆకర్షించిన మాసంగా మేనెల రికార్డయింది.

ఈనెల 26 నుంచి 30వ తేదీవరకూ చూస్తే విదేశీ ఇన్వెస్టర్లు నికరంగా 6024.77 కోట్లు పెట్టుబడులుపెట్టారు. ఇదొక సానుకూల పరిణామం అని మార్కెట్‌నిపుణులు చెపుతున్నారు. నికరంగా శుక్రవారం ఒక్కరోజు మాత్రమే 1758.23 కోట్లు అమ్మకాలు కనిపించాయి. అంటే విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు విత్‌డ్రాచేసుకున్నారు. నెలవారీగాకూడా రికార్డుస్థాయిలో పెట్టుబడులు రాబట్టిన మార్కెట్లు 2025లో కొంతమేర ప్రతికూలంగానే ఉంది. జనవరినుంచి మే వరకూ నికరంగా 92,491 కోట్లు విత్‌డ్రా అయ్యాయి. అయితే మేనెలలో మారిన దోరణులతో విదేశీ ఇన్వెస్టర్లలో నమ్మకాలుపెరిగి మళ్లీ పెట్టుబడులు పెరిగాయి. మొత్తంగా 19,860 కోట్లు పెట్టుబడులు కుమ్మరించినట్లు నేషనల్ సెక్యూరిటీ డిపాజిటరీ నివేదికలు తేటతెల్లంచేస్తున్నాయి. ఈ వారంలోఐదు ట్రేడింగ్‌సెషన్లలోనూ ఎఫ్‌పిఐలు పెరిగాయి. ఒక్క శుక్రవారం రోజుమాత్రమే విత్‌డ్రా జరిగినట్లు తేలింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఎఫ్‌పిఐలు భారత ఈక్విటీల్లో వరుసగా 78,027 కోట్లు, 34,574 కోట్లు మేర విత్‌డ్రాచేసుకున్నారు. మార్చినెలలో కూడా 3973 కోట్లు విత్‌డ్రా అయ్యాయి. అయితే మేనెల చివరిలో మళ్లీ రీబౌండ్ కావడంతో ఎఫ్‌పిఐలు మరింతపెరుగుతాయన్న అంచనాలున్నాయి.




# పసిడి కొనుగోళ్లపై పెరుగుతున్న క్రేజ్

## మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

**ముంబయి, మే 31:** బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం పదిగ్రాములు పదిరూపాయలుపెరిగింది. ట్రేడింగ్ ఆరంభంలోనే ఈ పెరుగుదల నమోదుచేస్తే ట్రేడింగ్‌ముగిసేనాటికి మరింత పెరుగుతుందన్న అంచనాలున్నాయి. ప్రస్తుతం పదిగ్రాముల బంగారం 97,320 రూపాయలుగా ట్రేడ్ అవుతున్నట్లు తెలుస్తోంది. అలాగే వెండిధరలుచూస్తే 100 రూపాయలు తగ్గింది. కిలో వెండి 99,800గాట్రేడ్ అవుతోంది. అదే సమయంలో 22 కేరట్ల బంగారందరలు కూడా పదిరూపాయలుపెరిగి పదిగ్రాములు 89,210 రూపాయలుగా అమ్మకాలు సాగుతున్నాయి. ముంబయి, కోల్‌కత్తా, చెన్నైలలో ఈ 24 కేరట్ల బంగారం 97,320గా కొనసాగుతోంది. ఢిల్లీలోపదిగ్రాముల 24 కేరట్ల బంగారం 97,470రూపాయలుగా కొనసాగుతోంది. ఇక ముంబయిలో 22 కేరట్ల బంగారం 89,210గా నడుస్తోంది. కోల్‌కత్తా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలోకూడా ఇవేధరలు కొనసాగుతున్నాయి. ఢిల్లీలో 22 కేరట్ల బంగారంరూ.89,360గా కొనసాగుతోంది. ఇక ఢిల్లీకోల్‌కత్తా, ముంబయిలలో కిలో వెండి రూ.99,800గా నడుస్తోంది. కిలో వెండిపరంగా చెన్నైలో మాత్రమే 1,10,800రూపాయలుగా నడుస్తోంది. అమెరికాలో పసిడిధరలు కొంతమేరపెరిగాయి. తాజా సుంకాల భారం నేపత్యంలో ద్రవ్యోల్బణం కూడా కొంతమేర తగ్గిన వార్తలతో అమెరికా పండ్‌రేట్లు కూడా తగ్గించవచ్చున్న అంచనాలుపెరిగాయి.

స్పట్‌గోల్డ్ 0.7శాతం తగ్గి ఔన్స్ ఒక్కంటికి 3,293.59 డాలర్లుగా నడిచాయి. స్పాట్ మార్కెట్‌లో వెండికూడా 1.2శాతం క్షీణించి ఔన్స్‌కు 32.94గానడిచింది. ఇక ప్లాటినమ్ 2.5శాతం క్షీణించి ఔన్స్‌కు 1055.05గా ఉంది.

పల్లాడియం విలువలు 0.6శాతం క్షీణించి 967.30 డాలర్లుగా నడుస్తున్నట్లు బులియన్ వర్గాలుప్రకటించాయి.




# ఇండిగోతో లీజు ఒప్పందం రద్దు చేసుకోవాలి

### విమానయానసంస్థకు డిజిసిఎ అల్టిమేటమ్

**న్యూఢిల్లీ, మే 31:** పౌరవిమానయానరంగ పర్యవేక్షణ సంస్థ డిజిసిఎ ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు అల్టిమేటమ్ జారీచేసింది. టర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో ఉన్న అన్ని ఒప్పందాలను మూడునెలల లోపు ముగించాలని ఆదేశించింది. అంటే ఆగస్టు 31వ తేదీలోపు అన్ని టైఅప్‌లనను రద్దుచేసుకోవాల్సి ఉంటుంది. పాకిస్తాన్‌కు మద్దతు ప్రకటించడంతోపాటు ఆయుధాలు, సైనికులను కూడా సరఫరాచేసిన క్రమంలో భారత్ తుర్కియేతో అన్ని ఒప్పందాలను పునఃసమీక్షిస్తోంది. ఇండిగో ప్రస్తుతం బి777-300 ఇ ఆర్ విమానం తుర్కియే ఎయిర్‌లైన్స్‌నుంచి లీజుకు నడుపుతోంది ప్రస్తుత లీజు ఈనెలాఖరుతోనే ముగిసింది. ఇండిగో గతంలో ఆరునెలలు పొడిగించాలని కోరింది. అయితే తుర్కియేతో ఉన్న విభేదాల దృష్ట్యా ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆగస్టు 31వ తేదీవరకూ మాత్రమే ఒప్పందాన్ని అనుమతించింది. ఆ తర్వాత తుర్కియేతో అన్ని ఒప్పందాలు రద్దుచేసుకోవాలని డిజిసిఎ ఆదేశించింది. ఈ ఆదేశాలపై ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్ మాట్లాడుతూ ప్రభుత్వ చట్టాలకు అనుగుణంగాను, ఆదేశాలకు అనుగుణంగానే ముందుకువెళతామని చెప్పారు. ద్వైపాక్షిక ఎయిర్‌సర్వీస్ ఒప్పందం పరిధిలో రెండుదేశాలమధ్య విమానసర్వీసులు నడుస్తున్నాయి. ఈనెలలోనే ఏవియేషన్ సెక్యూరిటీ సంస్థ బికాస్ తుర్కియే కంపెనీ సెలెబి ఎయిర్‌పోర్టు సర్వీసెస్‌కు సెక్యూరిటీ క్లియరెన్సులను రద్దుచేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.